

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 298 • పేజీలు : 12 • శనివారం 20 జూలై 2024 • వెల : రూ. 5.00 Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati

## బిల్కిస్ బానో కేసు..

- బిల్కిస్ బానో కేసులో దోషులకు షాక్
- బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం..



న్యూఢిల్లీ,జూలై 19 : బిల్కిస్ బానో కేసులో ఇద్దరు దోషుల పిటిషన్‌ను సుప్రీం కొట్టివేసింది. రెమిషన్ వచ్చేవరకు తమకు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా దోషులు సుప్రీంను ఆశ్రయించారు. కాగా అత్యున్నత మిగతా 7లో

## ఏపికి మరో శుభవార్త

◆ గుడ్‌న్యూస్ వినిపించిన కేంద్ర ప్రభుత్వం



అమరావతి, జూలై 19 (ఆంధ్రపత్రిక): ఏపీలోని రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుభవార్త చెప్పారు. విజయవాడ డివిజన్ పరి ధిలో 40 రైళ్లకు కొత్తగా 30 రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ స్టేషన్ల నుంచి రైల్వేకు ఎంత ఆదాయం మిగతా 7లో

## అందరి చూపు కమలాహ్యారిస్ వైపు



◆ బైడెన్ పట్ల డెమొక్రాట్లలో అసమ్మతి
◆ అభ్యర్థిత్వం మార్చాలన్న డిమాండ్
◆ తప్పుకుంటేనే మంచిదన్న ఒబామా

7

## 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన



◆ పేదరికం లేని సమాజం కోసం కృషి
◆ బాబుతో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం భేటీ
◆ అట్టడుగు స్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చేలా ప్రభుత్వ విజన్ ఉండాలి
◆ 15 శాతం గ్రోత్ రేట్ సాధించడం ద్వారా తలసరి ఆదాయం రెట్టింపు

అమరావతి,జూలై 19 (ఆంధ్రప్రత్రిక): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు వేగంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రయోజనాల కోసం పలుమార్లు ఢిల్లీ పెద్దలను కలిశారు. అలాగే ఏపీ ప్రజల జీవితాల్లో మార్పు కోసం తాజాగా వికసిత్ ఆంధ్రప్రదేశ్ పేరుతో విజన్ డాక్యుమెంట్ రూప కల్పనకు సీఎం చంద్ర బాబు శ్రీకారం మిగతా 7లో



# అప్రమత్తంగా ఉండాలి

అల్పపీడనంతో కలెక్టర్లతో సిఎం చంద్రబాబు నాయుడు సమీక్ష

"బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. అన్ని ప్రాజెక్టుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. గోదావరి, కృష్ణా నదుల్లో అంతకంతకూ పెరుగుతున్న వరద ప్రవాహం.."

అమరావతి, జూలై 19 (ఆంధ్రప్రత్రిక): బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం అప్రమత్తమైంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు, వర దలపై సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని నివాసంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 8 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మిగతా 7లో

◆ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సూచన..
◆ సిఎం ఆదేశాలతో అప్రమత్తం అయిన సిబ్బంది
◆ వాగులు ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
◆ అక్రమ తవ్వకాలతో బలహీనపడ్డ గోదావరి కట్టలు
◆ ముందస్తు ప్రణాళికతో పనిచేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి
◆ 8 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులు పలు సూచనలు
◆ బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు
◆ అల్పపీడనం నేపథ్యంలో అప్రమత్తమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## మోదీజీ ఉద్యోగాలు ఎక్కడ..?



- 8 కోట్ల ఉద్యోగాల సృష్టి..మరో ట్రాష్ : ఖర్గే

న్యూఢిల్లీ,జూలై 19 : ఎనిమిది కోట్ల ఉద్యోగాలు సృష్టించామన్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటనను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం తీవ్రంగా విమర్శించారు. ప్రధాని మిగతా 7లో

## ఏపిలో అరాచక పాలన..

◆ రాష్ట్రపతి పాలన విధించాల్సిందే..
◆ 24న ఎంపిలు,ఎమ్మెల్యేలతో కలసి ఢిల్లీలో ధర్నా
◆ ప్రధాని మోదీని కలిసి అరాచకాలను వివరిస్తా..
◆ హత్యకు గురైన రషీద్ కుటుంబానికి పరామర్శ
◆ అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ
◆ మీడియాతో వైఎస్ జగన్ వెల్లడి



పల్నాడు,జూలై 19 (ఆంధ్రప్రత్రిక): ఏపీలో జరుగుతున్న దాడులపై ప్రధాని నరేంద్ర మోదీని కలుస్తామని వైఎస్ జగన్ సంచలన ప్రకటన చేశారు. అంతేకాదు.. ఏపీ పరిస్థితులపై 24న బుధవారం నాడు ఢిల్లీలో ధర్నా చేస్తామని మాజీ సీఎం ప్రకటించారు. ఎంపీలు, మిగతా 7లో

## జస్టిస్ రవీంద్రబాబు సేవలు ప్రసంశనీయం

- హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్





అమరావతి, జూలై 19 (ఆంధ్రప్రత్రిక): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా జస్టిస్ ఎవి రవీంద్రబాబు అందిం చిన సేవలు ప్రసంశ నీయమైనవని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయ మూర్తిగా సేవలు అందజేస్తున్న జస్టిస్ ఎవి రవీంద్రబాబు పదవీ విరమణ మిగతా 7లో

## 22 నుంచి ఎపి అసెంబ్లీ సమావేశాలు





◆ ఐదు రోజుల సభ..మళ్లీ ఓటాన్ బడ్జెట్ ◆ పోలీసు ఉన్నతాధికారులతో స్పీకర్ సమీక్ష ◆ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు ◆ ఉభయసభల్ని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

అమరావతి, జూలై 19 (ఆంధ్రప్రత్రిక): ఏపీలో కూటమి సర్కార్ రెండోసారి అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సిద్ధమవుతోంది. ఈ వారం జరిగిన కేబినెట్ భేటీలో 22 నుంచి అసెంబ్లీ సమా వేశాల నిర్వహణకు నిర్ణయించారు. దీంతో సోమవారం అసెంబ్లీ సమావేశం మిగతా 7లో

## విమాన సర్వీసులకు అంతరాయం



◆ మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యలు..
◆ ప్రయాణికులకు నీళ్లు, ఆహార సేవలు అందించాలి..
◆ అధికారులకు మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ,జూలై 19 : మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యల కారణంగా విమాన సేవలు ప్రభావి తమయ్యాయి. చాలా కంపెనీల విమానాలు ఎగర లేక పోతున్నాయి. భారతదేశంలో, ఢిల్లీ, మిగతా 7లో

## మద్యం అక్రమాలపై ముమ్మర దర్యాప్తు

◆ కూపీ లాగుతున్న ఎపి సిఐడి అధికారులు
◆ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి అక్రమాలపై సీఐడీ కూపీ
◆ ఎక్సైజ్ శాఖలో జరిగిన అవకతవకలు..అక్రమాలు..
◆ వాసుదేవరెడ్డి పాత్రపై సంచలన వాస్తవాలు వెలుగులోకి..







అమరావతి,జూలై 19 (ఆంధ్రప్రత్రిక): గత ప్రభుత్వ హయాంలో మద్యం అక్రమాలపై సీఐడీ ముమ్మరంగా దర్యాప్తు చేస్తోంది. ఏపీబీసీఎస్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి అక్రమాలపై సీఐడీ కూపీ లాగుతోంది. ఎక్సైజ్ శాఖలో జరిగిన అవకత్ వకలు.. అక్రమాలు జరిగిన తీరుపై మిగతా 7లో



## వాస్తవాలు మాట్లాడాలి

◆ వినుకొండ హత్యపై జగన్ అబద్ధాలు
◆ టిడిపికి ఆపాదించే చర్యలు సరికాదు
◆ జగన్ ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలి
◆ సంక్షేమ శాఖ మంత్రి డోలా విమర్శలు

7

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్
ఆంధ్రపత్రిక
వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# కిటికీలు మూసుకుపోయాయి!

మైక్రోసాఫ్ట్ విండోస్ సేవల్లో అంతరాయం ఏర్పడింది.దీనితో ప్రపంచ వ్యాప్తంగా సమస్యలు చుట్టుముట్టాయి.అనేక విభాగాల సేవలు నిలిచిపోయాయి. తీవ్ర గందరగోళ వాతావరణం అలుముకుంది.ఈ సమస్యపై మైక్రోసాఫ్ట్ స్పందించింది.ఆ సంస్థకు చెందిన 365 యాప్స్,సర్వీసుల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పింది. ప్రయత్నాల్లో పురోగతి కనిపిస్తోందంటూ ఆశలు రేకెత్తించే సమాచారాన్ని పంచుకుంది.ఈ సమస్య సత్వరమే పరిష్కారం కాకపోతే ప్రపంచంలో పెద్ద గందరగోళం ఏర్పడే ప్రమాదం వుంది.ఈ సమస్య ప్రభావం మిగిలిన అనేక దేశాలతో పాటు మన దేశంపైన కూడా పడింది.ఈ సమస్య తలెత్తిన నేపథ్యంలో ల్యాప్ ట్యాప్,పర్సనల్ కంప్యూటర్ స్క్రీన్ ల పై బ్లూ స్క్రీన్ అఫ్ డెత్ ఎర్రర్ కనిపిస్తోంది.వెంటనే సిస్టమ్ షట్ డౌన్ అవ్వడం లేదా రీస్టార్ట్ అవుతోంది.ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది వాడకందార్లు (యూజర్స్) ఎక్స్ వేదికగా తమ మొర వినిపిస్తున్నారు.అమెరికా,ఆస్ట్రేలియా,లండన్ మొదలైన చోట్ల ఇబ్బం దులు తీవ్రంగా వున్నాయి.విమాన,బ్యాంకింగ్ సేవలు స్థంభించిపోయాయి. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కొన్ని ఛానల్స్ వార్తా ప్రసారాలు కూడా ఆగిపోయాయి. సూపర్ మార్కెట్లు నుంచి స్టాక్ ఎక్స్ఛేంజిల వరకూ, మెట్రోసర్వీసులు నుంచి పోలీస్ వ్యవస్థ దాకా అనేకం నిలిచిపోయాయి,క్రాష్ అయి కొట్టుమిట్టాడుతున్నాయి. అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కార్యకలాపాలు కూడా దెబ్బతిన్నాయి. అగ్రరాజ్యంలో 911 అత్యవసర సర్వీసులు ఇబ్బందిలో పడ్డాయి. భారతదేశంలో అనేక విమానాలు రద్దయ్యాయి. భారతీ య రిజర్వ్ బ్యాంక్ ఇచ్చిన సమాచారం మేరకు మనదేశంలో 10 బ్యాంకులు,ఎన్ బీ ఎఫ్ సీలపై అతి స్వల్ప ప్రభావం మాత్రమే పడడం హర్షదాయకం.దేశంలోని చాలా బ్యాంకుల కీలకమైన వ్యవస్థలు క్లౌడ్ లో లేవని,కొన్ని బ్యాంకులు మాత్రమే క్రౌడ్ స్ట్రైక్ వినియోగిస్తున్నాయని సమాచారం.సమస్యలు తలెత్తిన వెనువెంటనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. మైక్రోసాఫ్ట్‌తో నిరంతరం మాట్లాడుతూ సమాచారం తెలుసుకుంటోంది, సలహాల ను స్వీకరిస్తోందని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలియజేసారు. సమస్యకు సంబం ధించిన కారణాలను గుర్తించినట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. పరిష్కారా నికి సంబంధించిన అప్ డేట్స్ కూడా విడుదలైనట్లు తెలుస్తోంది.నేషనల్ ఇన్ఫర్మా టిక్ సెంటర్ నెట్ వర్క్ ఎలాంటి ప్రభావానికి గురికాకపోవడం మనకు ఊరటనిచ్చే అంశం.కంప్యూటర్స్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ సాంకేతిక సలహాలను అందిస్తోంది.'ఫాల్కన్ సెన్సర్ 'రీసెంట్ అప్ డేట్ మూలంగానే ఈ సమస్య ఎదురైందని మన కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్) చెబుతోంది. దీనివల్లనే విండోస్ మూసుకుపోయాయని అర్థమవుతోంది. మొత్తంగా చూస్తే ఆధునిక సాంకేతికత అద్భుతంగా అందివస్తున్నందుకు, విస్తరిస్తున్నందుకు అనం దంగా వున్నప్పటికీ, ఇటు వంటి సమస్యలు వచ్చినప్పుడల్లా భవిష్యత్ పై భయం వేస్తోంది.మనం నిద్రలేచినప్పటి నుంచి నిద్రలోకి వెళ్లిపోయేంతవరకూ ప్రతిదశ లోనూ సాంకేతికతపై ఆధారపడుతున్నాం. మొబైల్ ఫోన్ ఒక నిముషం పనిచేయక పోయినా, కనిపించకపోయినా పిచ్చెక్కిపోతున్నాం.ముందు ముందు ఈ అలవా టు,అవసరం మరింత పెరిగేవే కానీ,తగ్గేవి కాదు. ప్రపంచంలోని ఇన్ని కోట్లమంది మనుషుల అన్ని సేవలకు సాంకేతికత ఆధారమైన ఈ యుగంలో సాంకేతికతే పెద్ద సునామీ సృష్టించే పెను ప్రమాదాలు ముందు ముందు సంభవిస్తాయని నేటి ఉదంతం బట్టి అంచనా వెయ్యవచ్చు.కరోనా ఎంతటి విలయం సృష్టించిందో సాంకేతికత కూడా ఆ స్థాయి భూకంపం పుట్టిస్తుంది.24 ఏళ్ళ క్రితం 2000 వ సంవత్సరంలో డెస్క్ టాప్ యుగం నడుస్తున్న వేళలో 'వై2కే'రూపంలో ఉప్పెన వచ్చి ప్రపంచ దేశాలను కకావికలం చేసింది.ఇప్పుడు 'క్రౌడ్ స్ట్రైక్ ' ఎఫెక్ట్ రూపంలో మరో తుపాన్ మనల్ని తాకింది.ఈ 24 ఏళ్ళలో సాంకేతిక వినియోగం ఎన్నోరెట్లు పెరిగింది.ఇంటర్నెట్ ప్రపంచంలో ఈరోజు జరిగింది సామాన్యమైన అంశం కాదు.ఏ మాత్రం తేలికగా తీసుకోకూడదు.ఈ స్థాయి సమస్య గతంలో ఎన్నడూ రాలేదు.సామాన్య వాడకందార్ల నుంచి సమాచార సాంకేతిక దిగ్గజాల వరకూ ఈరోజు జరిగిన సంఘటనతో హడలెత్తిపోయారు.ఈ క్రౌడ్ స్ట్రైక్ అనేది అమెరికాకు చెందిన ఒక సైబర్ సెక్యూరిటీ సంస్థ.విండోస్ తో పాటు అగ్రస్థాయి ఐటీ సంస్థలకు అడ్వాన్స్డ్ సెక్యూరిటీని అందిస్తూ వుంటోంది. ప్రభుత్వ సంస్థలతో పాటు కీలకమైన బ్యాంకింగ్,ఎయిర్ లైన్స్ నిర్వహణ సంస్థలకు సేవలు అంది స్తుంది.ఈ సంస్థ 2011లో ఏర్పడింది. సైబర్ దాడులను బలంగా ఎదుర్కొం టుందనే పేరుంది.అందుకే అగ్రరాజ్యం ఈ సంస్థను ఎంచుకుంది. విండోస్ లో ఏర్పడిన బ్లూ స్క్రీన్ ఎర్రర్ కు క్రౌడ్ స్ట్రైక్ నుంచి వచ్చిన ఒక అప్ డేట్ కారణమని నిపుణులు అంచనా వేశారు.గతంలో 'వై 2కె ' సమస్యను పరిష్కరించుకొనే క్రమంలో కోట్లాది రూపాయలు ఖర్చయింది. సాఫ్ట్ వేర్ తో పాటు హార్డ్ వేర్ పైనా ఖర్చు పెట్టాల్సి వచ్చింది.ఇప్పుడు ఉత్పన్నమైన ఈ సమస్య పరిష్కారానికి ఎన్ని కోట్లు ఖర్చుపెడుతున్నారో తెలియాల్సివుంది. భవిష్యత్ లో అనేక రూపాల్లో సమస్యలు వచ్చినప్పుడు ఎలా పరిష్కరించుకుంటారో భవిష్యత్ లోనే తెలుస్తుంది. ప్రకృతి వైపరీత్యాలలో కొన్నింటిని ముందుగానే అంచనా వేసే సాంకేతిక శక్తి అందుబాటులో వుంది.కానీ,కొన్నింటిని ఏ మాత్రం కనిపెట్టలేని పరిస్థితిలోనే వున్నాం. అట్లే! సైబర్ ప్రపంచంలో, ఐటీ వ్యవస్థలో కొన్నింటిని మనం అంచనా వెయ్యలేం. దానికి నేటి పరిణామం బలమైన ఉదాహ రణ.ఇబ్బడిముబ్బడిగా ఆక్రమిస్తున్న ఆధునిక సాంకేతిక యుగంలో భవిష్యత్‌లో ఎన్నో సవాళ్లు మన ఎదురుగా కనిపిస్తున్నాయి. ఈ సాగరాన్ని ఎలా దాటుతామో? ప్రత్యామ్నాయ మార్గాలు, సంప్రదాయ పద్ధతులు ఏమైనా ఉన్నాయేమో కనిపెట్టాలి.

# రేడియో ఆవిష్కర్త మార్కోనీ



ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఇప్పుడు టివి ఉన్నట్లే కొంత కాలం క్రితం ప్రతి ఇంటిలో రేడియో సెట్ ఉండేది. నాడు ప్రధాన మనో రంజన సాధనాల్లో రేడియో ప్రధాన మైనది. రేడియో పేరు తీయగానే గుర్తుకు వచ్చేది దాని ఆవిష్కర్త మార్కోనీయే. గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ (1874 ఏప్రిల్ 25 – 1937 జూలై 20) ఇటాలియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితామహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909లో కార్ల్ ఫెడ్రినాండ్ బ్రాన్ తో కలిసి వైర్‌లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897లో బ్రిటన్‌లో వైర్ లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్కరణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు.రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేష న్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాలో అన్నీ జేమ్సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూపించేవాడు. తన తల్లిదండ్రులచే నియమించబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు.లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపాధ్యాయుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విషయాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాంతాలను నేర్పించాడు.18 యేళ్ళ వయస్సులో అతను తిరిగి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు.1890ల ప్రారంభంలో, అతను "వైర్‌లెస్ టెలిగ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభించాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉపయోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం.

బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగలవచ్చునని, గుర్తించగలమని నిరూపించాడు. ఒకరోజు అర్థరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్యపరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది. మార్కోనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యుడయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే. వేల్స్ రాకుమారు డు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీకొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది. 1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు. మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతం గా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభమైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు.1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది.బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.

– రామ కిష్టయ్య సంగన భట్ల...

# పర్వతారోహణ క్రీడకు పెరుగుతున్న ఆదరణ



8848 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగల హిమాలయ పర్వతాలలోని ఎవరెస్టు శిఖరం అధిరోహణ అత్యంత సాహసమైన కృత్యం. టెన్సింగ్ నార్కేతో పాటు ఎడ్మండ్ హిల్లరీ 1953, మార్చి 29 నాడు ఈ శిఖరాన్ని చేరుకొని ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తులుగా నిలిచారు. మౌంట్ ఎవరెస్టు పర్వతాన్ని నేపాలీలు 'సగరమతా' అని అలాగే టిబెటన్లు 'చోమోలున్ద్మా' పర్వతమని పిలుస్తారు. 1830– 43 శ్రీ మధ్య తొలిసారి సర్వే చేసిన భారత సర్వేయర్ జనరల్ 'సర్ జార్జ్ ఎవరెస్ట్' ఈ పర్వతాన్ని గుర్తించారు. ఆయన స్మారకార్థం ఈ పర్వతానికి 'ఎవరెస్ట్' అని నామకరణం చేశారు. సర్ ఎడ్మండ్ పర్సీవల్ హిల్లరీ (జూలై 20, 1919 జనవరి 11, 2008) న్యూజిలాండ్కు చెందిన పర్వతారోహకుడు,అన్వేషకుడు. ఎడ్మండ్ హిల్లరీ 1919 జూలై 20న న్యూజిలాండ్ లోని ఆక్లాండ్‌లో జన్మించాడు. 16 సంవత్సరాల వయస్సులోనే హిల్లరీ పర్వతారో హణపై మక్కువ చూపినాడు. 1939లో దక్షిణ ఆల్ప్సు పర్వతాలలో ఉన్న ఆలివర్ పర్వత శిఖరాన్ని అధిరోహించడం అతని జీవితంలో తొలి ప్రధాన సాహస కృత్యం. ఎవరెస్ట్ అధిరోహణే కాకుండా హిమాలయ పర్వతాలలో ఉన్న ముఖ్యమైన మరో 10 శిఖరాలను కూడా హిల్లరీ అధిరోహిం చాడు. ఎడ్మండ్ హిల్లరీ నేపాలీల ముఖ్యంగా షెర్పాల దృష్టిలో దైవసమానుడు. ఎవరెస్టు అధిరోహణ సమయంలో అక్కడి షెర్పాల దయనీయ జీవితాన్ని చూసి చలించి,అక్కడ పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి షెర్పాల జీవితంలో వెలుగులు నింపాడు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి తమ దేశ గౌరవాన్ని నిలబెట్టినందుకు న్యూజీలాండ్ ప్రభుత్వం 5 డాలర్ల కరెన్సీ నోటుపై హిల్లరీ బొమ్మను ముద్రించి అతని ప్రతిభను గౌరవించింది. బ్రిటన్ జట్టులోని సభ్యుడిగా హిల్లరీ సాధించిన విజయాన్ని గౌరవిస్తూ బ్రిటన్ రాణి రెండో ఎలిజబెత్ హిల్లరీని సత్కరించింది.

**పర్వతారోహణ సాహస క్రీడ ప్రమాదకరం:** హిమాలయాల్లోని 'మహాలంగూర్ హిమల్' సబ్–రేంజ్లో అత్యంత ఎత్తైన ఎవరెస్టు పర్వతం చైనా–నేపాల్ సరి హద్దుల్లో ఉన్నది. ఎవరెస్ట్ పర్వతారోహణలో ప్రతికూల వాతావ రణం, బలమైన గాలులు, అవలాంచ్ ప్రమాదాలు, అల్టి ట్యూడ్ సిక్నెస్, మంచు చెరియలు విరిగి పడడం లాంటి ప్రాణాంతక ప్రమాదాలు ఉంటాయి. 2019 గణాంకాల ప్రకారం 306కు పైగా ఎవరెస్ట్ పర్వతారోహకులు అధిరోహించాలనే ప్రయత్నాల లో ప్రాణాలు విడవడం, అలాంటి సాహసికుల పార్థివ దేహాలు ఆ మంచు కొండల్లోనే కలవడం జరిగింది. ఆక్సీజన్ బాటిల్ వెంట ఉన్నప్పటికీ పర్వతారోహకులు వాంతులు, అలసట, వికా రం, హిమఘాతం (ఫ్రోస్బైట్), అల్పోష్ణస్థితి లాంటి పలు అనారోగ్యాల పాలు అవుతారు. పర్వతారోహణాన్ని పూర్తి చేసి దిగువకు వచ్చిన వారు పలు శారీరక, మానసిక బలహీనతలతో బాధ పడడం సాధారణంగా జరుగుతుంది.

**పర్వతారోహణకు పెరిగిన ఆసక్తి:** 4,042 మంది పర్వతారోహకులు ఎవరెస్టు అధిరోహించగా, అందులో 635 మంది మహిళలు కూడా ఉన్నారు. పర్వతారోహణకు అనేక మాసాల శిక్షణ, తయారీ మరియు సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. ఎవరె–స్ట్ శిఖరాన్ని అధిరోహించుటకు దాదాపు 65,000 డాలర్ల రుసుము, ఖరీదైన పరికరాలు అవసరం అవుతాయి. ఎవరెస్ట్ పర్వతాన్ని అత్యధికంగా 21 సార్లు అధికోహించిన రికార్డును 'అపా షెర్పా' మరియు 'పుర్బా షెర్పా'లు దక్కించుకున్నారు. ప్రతి ఏటా మే, సెప్టెంబర్ మాసాలు ఎవరెస్టు ఎక్కడానికి అనువైన సీజన్లుగా గుర్తించారు. పర్వతారోహకులకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు 19 రోజులు, అక్కడి నుండి ఎవరెస్ట్ శిఖరాగ్రానికి దాదాపు 40 రోజుల సమయం పడుతుంది. ప్రతి ఏటా దాదాపు 800 మంది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహిస్తు న్నారు. ఎన్ని అవాంతరాలు, ప్రతికూలతలు ఎదురైన పర్వతారో హకులు ఎవరెస్ట్ లాంటి అత్యంత ఎత్తైన మంచు పర్వతాన్ని అధిరోహించాలని తపన పడడం అభినందనీయం. ప్రాణాలకు తెగించి సాహసం చేసే పర్వతారోహణ సాహస వీరులకు శుభాకాంక్షలు తెలియజేద్దాం, ఆ క్రీడ పట్ల యువతను ప్రోత్సహిద్దాం.

# గురువు దైవానికి ప్రతిరూపం జీవితానికి దారి దీపం



గురువు అంటే త్రిమూర్తి స్వరూపం అజ్ఞానం నుండి జ్ఞానంవైపు నడిపించి అజ్ఞానమనే చీకటిని పారగొట్టెవాడు గురువు శిష్యుల్లో సంకల్పశక్తిని పాదుకొలిపి లక్ష్య సాధన సామర్థ్యాలకు ప్రేరేపక శక్తిగా నిలిచేవాడు తనజ్ఞాన బోధనతో విజ్ఞాన ప్రపంచంలో శిష్యులకు వెలుగును ప్రసాదిస్తాడు జీవితానికి అర్థం కల్పిస్తాడు అజ్ఞాన అంధకారం నశింప చేసి వెలుగు వైపు నడిపిస్తాడు మంచి చెడుల వివక్షను తెలిపిబతుకు బండి నడుపు బాట చూపి జీవన సాఫల్యతకు మార్గాన్ని నిర్దశిస్తాడు జీవన సమరంలో సమస్యలపరిష్కార మార్గదర్శి గురువు ఎంతో శాంతంగా ఉండి తన బిడ్డల కన్నా ఎక్కువగా ప్రేమించి మరింత జ్ఞానాన్ని శిష్యులకు పంచుతాడు చైతన్యం కలిగించే విద్యను అందించి శిష్యులను తేజోవంతులుగా జ్ఞానవంతులుగా తీర్చి దిద్ది వినూతన ఆవిష్కరణలరూపశిల్పి గురువు శిష్యులనువిజ్ఞాన ఖనిగా మార్చే శక్తి గురువు జీవన విద్యలో మెలుకువలు చెప్పిఆత్మవిశ్వాసాన్ని పట్టుదలను ప్రేరేపించి ప్రగతి పురోగతి చూపే బాటసారి అభ్యుదయ భావాలను ఆవిష్కరించి అభివృద్ధికి దశ దిశ నిర్దేశిస్తాడు మనిషి జననం నుండి మరణించే వరకు ప్రతి విషయంలో గురువు ఉంటాడు భారతీయ సంస్కృతిలో గురువు పరంపర ప్రత్యేకత సంతరించుకుంది గురువు భగవంతునికి భక్తునికి మధ్య సంధాన కర్త అజ్ఞానంగా వున్న మనకు విజ్ఞానం బోధిస్తాడు అదమరిచి వున్న మనకు అర్థశాస్త్రం బోధిస్తాడు ఆర్థిక అక్షరాస్యత పరిజ్ఞాన పరివ్యాప్తి స్పృహను మనలో సృష్టిస్తాడు పౌరశాస్త్రం చరిత్ర చెప్పి సంస్కృతి పాలన ధర్మ రక్షణ పట్ల కార్యోన్ముఖులను చేస్తూ చరిత్రను భోదించి దేశభక్తిని ప్రేరేపించి వెన్నంటి వుండే కొండంత అండ గురువు పామరులను పండితులను చేసే నిర్మలమైన స్వచ్ఛమైన ప్రేమ ఆప్యాయతలు చూపే దైవం గురువు గురువు దైవానికి ప్రతిరూపం జీవితానికి దారి దీపం గురువు విద్యతో పాటు వినయం విచక్షణ తాత్వికత తార్కికత నేర్పిస్తాడు పరిశీలన పరికల్పన పరిశోధన వివరణ విశ్లేషణా శక్తి సామర్థ్యాల ఉద్దీపనకు ఉత్ప్రేరకంగా నిలుస్తాడు చీకట్లను తొలిగించి వెలుగులు పంచే దివ్వె గురువు జీవితానికి గమ్యాన్ని మార్గనిర్దేశం చేసే మహర్షి గురువు ఉన్నత స్థాయిలో శిష్యుల ప్రగతికి పాటుపడి దారి చూపే జ్ఞాన జ్యోతి గురువు సమాజంలో అజ్ఞానాన్ని తరిమి విజ్ఞానాన్ని పెంచి మంచి తనం మమతను పంచి మానవీయ విలువల ఆవిష్కకర్త గురువు మేథో సామర్థ్యాలు పెంచుకొని భారత దేశ కీర్తి ప్రతిష్టలు పెంచుదాం భారతీయ నాగరికత సంస్కృతి ఆధ్యాత్మి కతను జగతిన చాటుదాం గురువు లేకుంటే ప్రగతి కొరవడి ప్రపంచం అంధకారంలో కూరుకు పోతుంది జీవితాలకు మార్గనిర్దేశనం చేసి జ్ఞానాన్ని అందించి ముక్తి వైపు నడిపిన గురువులను గురుపూర్ణిమ రోజు పూజించడం భారత దేశ సాంప్రదాయ పరంపరను కొనసాగిద్దాం ఉత్తమ పౌరులుగా ఎదుగుదాం ఉజ్వల భవిష్యత్తుతో ఉన్నత స్థాయిలో విజ్ఞాన భారత్ వికసిత భారత్ నిర్మాణప్రక్రియలో భాగస్వాములమై ప్రగతిశీల ప్రతిభా ఆవిష్కరణలతో భారత్ ను విశ్వ గురువు స్థాయికి చేర్చుదాం

– నేదునూరి కనకయ్య

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన









**ఎ.కొండూరు జూలై 19 (ఆంధ్రపత్రిక) :** ప్రజలు సీజనల్ వ్యాధులైన మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ వైరల్ జ్వరాల బారిన . పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ముఖ్యంగా ఇళ్ల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటిస్తూ వ్యక్తిగత పరిశుభ్రతను కూడా పాటించాలని జిల్లా కలెక్టర్ జి సృజన పేర్కొన్నారు.శుక్రవారం ఆమె మండలంలోని చీమలపాడు పెద్ద తండా గ్రామపంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పిల్లలకు పెడుతున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు బోధిస్తున్న అక్షర విధానాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు పౌష్టికాహార కేంద్రాలు కావని ఇక్కడ నుండే చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన అక్షరజ్ఞానం పెంపొందించాలని అందుకు తగినట్లుగా అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది రూపకల్పన చేసుకోవాలని సూచించారు ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులతో ముచ్చటించి వారిచే మంచి పదాలు పలికించారు అనంతరం ఆమె అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహారమైన కోడిగుడ్లు రాగి పిండి పాలు నూనె ప్యాకెట్లను పంపిణీ చేశారు. తిరువూరు ఎమ్మెల్యే కొలిగిపూడి శ్రీనివాసరావుతో కలిసి గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు అనంతరం అంగన్వాడీ కేంద్రం ఆవరణలో కూరగాయ మొక్కలను నాటారు డెంగ్యూ నివారణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధులు డెంగ్యూ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారుల తోకలసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు తమకు అటవీ హక్కుచట్టం ద్వారా సాగు చేసుకుంటున్నఅటవీ భూములకు పట్టాలు మంజూరు చేయవలసిందిగా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు అనంతరం కలెక్టర్ ఎమ్మెల్యే తండాలోని పాఠశాలను సందర్శించి పాఠశాలలో పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధారావతు లక్ష్మీ డిఎండ్ హెచ్ ఓ ఎం.సుహాసిని ఆర్డీవో కె.మాధవి తాహాసిల్దార్ షేక్ .రియాజ్ హుస్సేన్ ఎంపీడీవో శ్రీకృష్ణ పరమాత్మ డాక్టర్ కె.శ్రీనివాసరావు ఐసిడిఎస్ సిడిపిఓ సత్యవతి సూపర్వైజర్ టి. శివకుమారి. టిడిపి నాయకులు అలవాల రమేష్ రెడ్డి గడ్డి కృష్ణారెడ్డి వాసం మునియ్య భీమనాయక్ పిక్లా నాయక్ జనసేన నాయకులు మనుబోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# చాపల మార్కెట్లో మత్స్యకారుల అగచాట్లు...

## కనీస వసతులు కల్పించాలని వేడుకోలు..



**పెడన 19 జూలై (ఆంధ్రపత్రిక) :** పెడన చేపల మార్కెట్లో మత్స్యకారులు పలు ఇబ్బందులకు గురవుతున్న సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.వర్షం పడితే ఆ ప్రాంతం జలమయంగా మారి మార్కెట్లో ఉన్న చేపల సైతం దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చిన్నపాటి వర్షం పడిన ఆ ప్రాంతం తడిసి ముద్ద అవడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం పెడనలో వారపు సంత జరగటం ఎన్నో సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుంది. ఈ సంతకు తాడేపల్లిగూడెం ఉప్పాడ అనకాపల్లి ఉభయగోదావరి జిల్లాల నుండి గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల నుంచి వారపు సంతకు పెద్ద ఎత్తున మహిళ వ్యాపారులు కొన్ని సంవత్సరాలుగా ఎండు చేపల వ్యాపారం చేయడానికి వస్తుంటారు. ఈ వారపు సంతలో నిలువ నీడ లేక. ఎన్నో అగచాట్లు పడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్యతో పోరాడుతున్నారు. ఈ విషయమైఅనేకసార్లు సంబంధిత శాఖ అధికారులకు విషయం తెలిపిన స్పందించడం లో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేపల వ్యాపారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

## బ్రహ్మయ్య కాలనీలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ



**విజయవాడ పశ్చిమ, జూలై 19, (ఆంధ్ర పత్రిక) :** స్థానిక 45వ డివిజన్ బ్రహ్మయ్య కాలనీ, శ్రీనిధి శాంతి నగర్ కాలనీలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించండి అనే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి శానిటేషన్ సిబ్బంది మున్సిపల్ సిబ్బందితో వెళ్లి ఆ ఇంట్లో నివసిస్తున్న వారికి పారిశుధ్యం గురించి పరిసరాల శుభ్రత గురించి వివరిస్తూ పారిశుద్ధ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ వర్షాకాలంలో సీజనల్ గా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తూ చెత్తాచెదారాలను రోడ్లపై వేయకుండా ఉండమని, అలాగే నీటిని నిల్వ ఉంచే ప్రాంతాల్లో సరైన శుభ్రత పాటించకపోతే దోమల వల్ల మలేరియా డెంగ్యూ కలరా అతిసార వ్యాధులు వస్తాయని ప్రజలకు అవగాహన కల్పించారు. 45 డివిజన్ జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షురాలు బొమ్మ గోవిందు లక్ష్మి రాంబాబులు కాలనీలో శానిటేషన్ సిబ్బందితోపాటు ఇంటింటికి తిరిగి మూడు కాలనీవాసులకు తెలియపరచడం జరిగినది. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షురాలు బొమ్ము గోవింద లక్ష్మి మాట్లాడుతూ డివిజన్లోని ప్రజలకు ప్రతి శుక్రవారం మౌత్ స్పీకర్ ద్వారా చెత్తాచెదారాలు విచ్చలవిడిగా రోడ్లపై వేయవద్దని, వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రజలకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి తమ ఆలోచనని చెప్పడం జరిగింది. అలాగే కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని దాని వలన రోడ్లపై విసర్జించే మలమూత్రాలు వల్ల కూడా ఇబ్బందులు వస్తాయి కాబట్టి తక్షణమే ఆ కుక్కల బెడదను తక్షణం పరిష్కరిస్తే మంచిదని వివరించడం జరిగింది.

# ఫ్రైడే డ్రై డే పాటిద్దాం

# డెంగ్యూ,మలేరియాలను నివారిద్దాం



**మచిలీపట్నం19జూలై (ఆంధ్రపత్రిక) :** ది 19-07-2024 న చిలకలపూడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వి.శ్రావ్య పర్యవేక్షణలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఆషా మరియు ఆరోగ్య కార్యకర్తల ద్వారా దోమల నియంత్రణ కొరకు ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటిస్తూ గృహ దర్శనముల ద్వారా ఇళ్ళలోఉన్న నిల్వ నీటిలోని లార్వాలను తొలగించుట ,నీటి నిల్వలు ఉన్న ప్లాస్టిక్ బాటిళు ,టైర్లు ,వృధాగా పారవేసిన ప్లాస్టిక్ బాటిల్లు , టైర్లు ,వృధాగా పారవేసిన ప్లాస్టిక్ కుండీలు ,ఇతర గృహపకరణాలను శుభ్రము చేసుకోవాలని ప్రజలకు సూచించమనిరి .ప్రస్తుతం జిల్లాలో జరుగుచున్న ఎల్సిడిసి సర్వే ద్వారా అనుమానిత లక్షణాలున్న కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించి వ్యాధి నిర్ధారణ కొరకు పంపించినచో అవసరమైన వారికి ఎండిటి మందులను అందించుట జరుగుతుందని తెలియజెచ్చినారు. వీటితోపాటు గృహ దర్శనముల సమయంలో ఎవరైన గత వారం రోజులలో గాని ,ప్రస్తుతం గాని నీళ్ల విరోచనాలు అతిసారం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారి గురించి తెలుసుకొని కావలసిన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను , జింక్ మాత్రలను అందించి వ్యాధి నివారణ చర్యలు చేపట్టవలసినదిగా వైద్య సిబ్బందిని వైద్యాధికారి ఆదేశించినారు . మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.మురళి మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులైన మలేరియా ,డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కాల్వలలో నిలవనీరు లేకుండా మునిసిపాలిటీ వారి సహాయంతో పారుదల అయ్యేటట్లు చూడవలసిందిగా కోరినారు . ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య విద్య మరియు విస్తరణాధికారి బి . శివసాంబి రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ,దోమల నియంత్రణ చర్యలపై ఇంటిటి ప్రచారం ద్వారా ప్రజలలా చైతన్యము కలిగించవలసినదిగా వైద్య సిబ్బంది కి తెలియజేసినారు . ఈ సందర్భంగా వైద్యాధికారి మరియు ఆశా కార్యకర్తలు ,ఆరోగ్య కార్యకర్తలు టీం వర్క్ గా వెళ్లి గృహ దర్శనములు చేసి లార్వాలు ఉన్న నీటి నిల్వలు గుర్తించి తొలగించటమైనది .ఈ కార్యక్రమంలో ఏ . నాగమణి ఏఎన్ఎం, కే బాలాజీ ,సిహెచ్ ప్రవీణ్ కుమార్ ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూజివీడు మున్సిపాలిటీలో

## వినూత్న రీతిలో దోమల నివారణ కార్యక్రమాలు




**నూజివీడు జూలై 19 (ఆంధ్రపత్రిక) :** నూజివీడు మున్సిపాలిటీలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దోమల నివారణకు తీసుకోవ లసిన చర్యల గురించి ఆరోగ్యసిబ్బం దికి అవగాహన కల్పించారు. అనం తరం దోమకాటు వలన వ్యాపించే డెంగ్యూ,మలేరియా జ్వరాల వలన ప్రజలను కాపాడడం కోసం,ఇళ్ళలో వాడే ఫ్రిజ్జులు, పూలకుండీలు,ఖాళీ కొబ్బరి బొండాలలో చేరే నీరు వంటి వాటిలో ఎక్కువ రోజులు నిల్వ ఉండే నీటిలో లార్వా తయారు అవుతుందని ఆ లార్వా వృద్ధి చెంది దోమలు తయారు అవుతాయని తద్వారా ఇళ్లలోనే దోమల పెరుగుగుదలకు మనమే దోహదం అవుతున్నామనే విషయాలు స్పష్టంగా ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా దోమల నివారణ సాధ్యం అవుతుందని తెలిపారు.అలాగే కలుషిత నీరు ఆహారం వలన టైఫాయిడ్ మరియు డైయేరియా వంటి వ్యాధులు వస్తాయని ప్రజలు పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. నూజివీడు మునిసిపల్ కమీషనర్ ఆర్ వెంకట రామి రెడ్డి గారు ,నూజివీడు లో మంచి నీరు క్లోరినేషన్ చేసి ఇంటింటికీ సరఫరా చేస్తున్నామని తద్వారా సురక్షిత మంచినీరు సరఫరా చేయడం కోసం తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని,ఇంజనీరింగ్ అసిసిస్టెంట్ల ద్వారా మంచినీటి పైపుల నుండి నీరు సేకరించి సైతం వాటర్ టెస్టింగ్ కూడా విధిగా చేస్తున్నామని,అలాగే మున్సిపాలిటీ పరిధిలో కాల్వలు శుభ్రం చేస్తున్నామని,దోమల నివారణకు దోమల మందు స్ప్రే చేయిస్తున్నామని తెలిపారు. మునిసిపల్ కమీషనర్ పారిశుద్ధ్యం పరిశుభ్రత మరియు దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధతో మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలు మరియు కళాశాలలకు పంచాయతీ కార్యదర్శులు వారితోపాటు ఎ.యన్.యం లు నేరుగా వెళ్ళి విద్యార్థులకు డెమో ద్వారా ప్రత్యక్షంగా లార్వా వృద్ధి చెందే వాటిని చూపించి అవగాహన కల్పించాలని ఆదేశించారు.అలాగే డ్రై డే కార్యక్రమం శుక్ర,శని,ఆదివారాలలో ఏదో ఒకరోజు సచివాలయ ఉద్యోగులు అందరూ పాల్గొని ప్రతి ఇంటినీ తనిఖీ చేసి ప్రజల ఆరోగ్యం మరియు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధి లో మరియు పరిసరాలలో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ర్యాలీ ముగిసిన అనంతరం మునిసిపల్ కమీషనర్ మరియు సచివాలయం కార్యదర్శులు,ఎ.యన్.యంలు మరియు ఆశకార్యకర్తల బృందం స్వయంగా కొన్ని ఇళ్ళను తనిఖీ చేసి ప్రత్యక్షంగా ప్రజల ఇళ్ళలో నిల్వ ఉన్న నీటిలో వృద్ధి చెందుతున్న లార్వా ను వారికి చూపించి దోమలు వృద్ధికి ఇటువంటి నిల్వ ఉండే నీరు కారణం అవుతుందని అవగాహన కల్పించారు.అనంతరం ఇళ్లు మరియు పరిసరాలు శుభ్రం ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని మునిసిపల్ కమీషనర్ ఆ ప్రాంత ప్రజలకు తెలియజేశారు.

## కొలికిపూడి శ్రీనివాసరావు హయాంలోనే తిరువూరు నియోజకవర్గం

# అన్ని రంగాల్లో అభివృద్ధి

### ఎమ్మెల్యే కొలికిపూడిని ఘనంగా సన్మానించిన మాజీ మంత్రి దేవినేని ఉమా




**తిరువూరు జూలై 19 (ఆంధ్రపత్రిక) :** తిరువూరు నియోజకవర్గంలో గత 20 సంవత్సరాలు నుంచి తెలుగుదేశం పార్టీ ఓటమి పాలవుతుంది. గత సార్వత్రిక ఎన్నికల్లో తిరువూరు నియోజవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొంది తిరువూరు నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించిన ఘనత కొలికిపుడి శ్రీనివాసరావు కి దక్కుతుందని దేవినేని ఉమామహేశ్వరరావు కొనియాడారు. గెలిచిన నాటి నుండి తిరువూరు నియోజవర్గ అభివృద్ధికి బాటలు వేశారని విద్యకు ప్రాధాన్యత నిస్తూ చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులకు ల్యాబ్ ట్యాబులు సైకిళ్లుఆర్థిక సహాయంఅందించి విద్యను ప్రోత్సహిస్తున్న మహోన్నత వ్యక్తిగా కొనియాడారు. గ్రామాల్లో దీర్ఘకాలికంగా పడకేసిన పారిశుధ్య నిర్మూలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలను తనే స్వయంగా తెలుసుకోవడానికి ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ అనే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో సమస్యలను సత్వరంగా పరిష్కరిస్తున్న ఘనత ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకేదక్కిందన్నారు. తాను ఎలా ఉన్నా ప్రజలు బాగుండాలని కోరుకునే మహోన్నత వ్యక్తిత్వం గల ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అందుకు వైద్యారోగ్య సిబ్బంది సహకరించాలని గ్రామాల్లో వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి జ్వరాల నియంత్రణకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును అభినందించారు. గత 20 సంవత్సరాలుగా తిరువూరు నియోజవర్గం అన్ని రంగాల్లో వెనకబడి ఉందని కొలికపూడి శ్రీనివాసరావు రాకతో తిరువూరు నియోజవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో నడిపేందుకు కొలికపూడి శ్రీనివాసరావు కృషిని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రివర్యులు దేవినేని ఉమామహేశ్వరరావు దుశ్శాలవతో ఘనంగా సన్మానించారు.

# కట్టలేరువాగు ఉధృతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి.సృజన





**తిరువూరు (గంపలగూడెం) జూలై 19 (ఆంధ్రపత్రిక) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ గంపలగూడెం మండలంలోని వినగడప... తోటమూల గ్రామాల మధ్యలో ఉన్న కట్టలేరు వాగు ఉధృతిని శుక్రవారం జిల్లా కలెక్టర్ జి సృజన పరిశీలించారు. ఎగువ కురుస్తున్న భారీ వర్షాలకు కట్టలేరు వాగు వరద నీరు పోటెత్తడంతో ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజల రాకపోకలను నిలిపివేయాలని గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ జి సృజన ఆదేశించారు కట్టలేరు వాగుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు రోడ్లు భవనాల ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే వంతెనపై ప్రజల రాకపోకలకు అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో కొత్త మాధవి మండల తహాశీల్దార్ డి సుగుణ ఎ. కొండూరు మండల తహాశీల్దార్. షేక్ రియాజ్ హుస్సేన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## తుఫాను ప్రభావం స్తంభించిన

# జనజీవనం



**ఆగిరిపల్లి, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి మండలం వ్యాప్తంగా తుఫాను వల్ల ముసురు వర్ష ప్రభావంతో జనజీవనం స్తంభించింది. ప్రజలు నిత్యవసర సరుకులు తెచ్చుకోవడానికి, వ్యవసాయదారులు వ్యవసాయ పనులకు ఆటంకం కలగడం, పశువులు పొలాలకు వెళ్లి పొలాలలో నీళ్లు ఉండటం వల్ల మేత తినుటకు కూడా ఇబ్బంది పడ్డాయి. చేతివృత్తుల వారు గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో పనులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇంత వర్షం కురుస్తున్న చెరువుల్లోకి, వరి మాగానులలోకి ఏమాత్రం నీరు చేరలేదని, వరి చేలో మొక్కలు నాటుటకు ఇంతవరకు నీరు లేకపోవడంతో వరి నారుకు విత్తనాలు కూడా నాట లేదని వాపోయారు. గత 24 గంటల నుండి ఈరోజు సాయంత్రం వరకు 42.10ఎంఎం వర్షశాతం నమోదయిందని ఆగిరిపల్లి డిప్యూటీ తాసిల్దార్ పవన్ తెలిపారు

## సైఫ్ జోన్ అధికారులతో కలిసి బి2బి సమావేశాలను నిర్వహించిన అసోచామ్



**విజయవాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** అసోసియేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్), షార్జా ప్రభుత్వం, యూఏఈ సహకారంతో, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య మద్దతుతో యూఏఈ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మీ వ్యాపారాన్ని విస్తరించడం శీర్షికన బి2బి సమావేశాలు విజయవంతంగా నిర్వహించింది. నోవాటెల్ వరుణ్లో ఈ నెల 17 నుండి 19వ తేదీ వరకు ఈ సమావేశాలు జరిగాయి. యూఏఈలోని షార్జా ఎయిర్పోర్ట్ ఇంటర్నేషనల్ ఫ్రీ జోన్ అందించే లాభదాయకమైన అవకాశాలను అన్వేషించాలనే ఆసక్తి కలిగిన, 70 కంటే ఎక్కువ కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొనటం ద్వారా అద్భుతమైన స్పందన లభించింది. అసోచామ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ డెవలప్మెంట్ కౌన్సిల్ చైర్మన్, యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ సీఎండీ రవి కుమార్ రెడ్డి కటారు ఈ కార్యక్రమం పట్ల తన సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఆంధ్రపత్రిక
జిల్లాలకు విలేఖరులు కావలెను
స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన
ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914
గుంటూరు, బాపట్ల, ఒంగోలు జిల్లాలోని
నియోజకవర్గాలకు
మరియు మండలాల వారిగా
విలేఖర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

# భారీ వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**గన్నవరం జూలై 19 (ఆంధ్రపత్రిక) :** జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భారీ వర్షాలు, వరదల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన గన్నవరంలోని ఎంపీడీవో కార్యాలయం నుండి రెవెన్యూ డివిజన్ల అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తాసిల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భారీ వర్షాలు, వరదల పట్ల తీసుకోవలసిన ముందస్తు చర్యలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉందని, వాతావరణ శాఖ హెచ్చరికలు, పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించుకుంటూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కృష్ణానది పరివాహక లోతట్టు ప్రాంతాలు, లంక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

పాకలు, పూరీళ్లలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, గర్భిణీ స్త్రీలు, డయాలసిస్ పేషంట్లను దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులను, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. అవసరమైనన్ని రేషన్ సరుకులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాలకు ఎలాంటి అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, స్టోరేజ్ ట్యాంకులు, చెరువులు నింపుకొని నీటి సమస్య లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తుకు అంతరాయం లేకుండా పడిపోయిన స్తంభాలను పునరుద్ధరణ చేసే విధంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్లపై పడిపోయిన చెట్లను వెంటనే తొలగించే విధంగా అవసరమైన రంపాలు, ఇతర సామాగ్రిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బలహీనంగా ఉన్న కాలువలు, చెరువు కట్టలను నిరంతర పర్యవేక్షణ చేసి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

## దోచుకున్న డబ్బులు పెద్దిరెడ్డి ప్రజలకు పంచాలి

**మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న డిమాండ్**



**విజయవాడ పశ్చిమ, జూలై 19, (ఆంధ్రపత్రిక) :** ప్రజల వద్ద దోచుకున్న డబ్బులు వైసీపీ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి తదితరులు పంచి క్షమాపణ చెప్పాలని ఉత్తరాంధ్ర టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతు పుంగనూరులో తండ్రి కొడుకులు పై దాడి చేసింది స్థానిక ప్రజలే తప్ప తెలుగుదేశం కార్యకర్తలు కాదన్నారు. గతంలో పెద్దిరెడ్డి గనులు శాఖ మంత్రిగా న్యాయబద్ధంగా వ్యాపారాలు చేసేవారి వద్ద నుండి దౌర్జన్యంగా వారి వ్యాపారాలను లాక్కున్నారని వెంకన్న ఆరోపించారు. ఎన్నికల సమయంలో పెదిరెడ్డి సొంత ఊరైన పుంగనూరులో కిరాయి రౌడీలు చేత బాబుపై దాడి చేయించింది పెద్దిరెడ్డి అని ఆయన ఆరోపించారు. పెద్దిరెడ్డి చేయించిన దాడిని ధైర్యంగా ఎదుర్కొన్న వ్యక్తి చంద్రబాబు నాయుడు మాత్రమేనన్నారు. తండ్రి కొడుకులు పై దాడి చేయించే అవకాశం ఉన్నప్పటికీ అలాంటి చర్యలకు పాల్పడే నైజం చంద్రబాబుకు లేదన్నారు. ప్రస్తుతం బాబు రామరాజ్యపాలన చేస్తుండగా, గతంలో జగన్ రాక్షస పాలన సాగించారన్నారు. పెద్దిరెడ్డి బాధితులు ఎవరైనా ఉంటే వారికి న్యాయం చేసి వారి ఆస్తులను తిరిగి అప్పగిస్తామని బుద్ధ వెంకన్న భరోసా ఇచ్చారు. జగన్‌కు వ్యవస్థల గురించి పూర్తిగా తెలియదని, అందుకే దొంగకు తాళం చేతులు ఇచ్చినట్లు గనులు ఉన్న పెద్దిరెడ్డికి ఆ శాఖనే అప్పగించడంతో పెద్దిరెడ్డి వెయ్యి సంవత్సరాలకు సరిపడే ఆస్తులను సంపాదించారని బుద్ధ వెంకన్న ఆరోపించారు. లోకేష్ రెడ్ బుక్ జోలికి వెళ్లలేదని, కేవలం సంక్షేమ పాలన కోసం కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో తెలుగుదేశం నాయకులు కొట్టేటి హనుమంతరావు, ఉమ్మడి చంటి, తుపాకుల వెంకటేశ్వర్లు, శివాజీ ముదిరాజ్, పేరం సత్యనారాయణ, బెవర జోగేష్, ఈగల సాంబ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ



**మచిలీపట్నం జూలై 19 (ఆంధ్రపత్రిక) :** కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. పెండింగ్ కేసులను తగ్గించడానికి, లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయశాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేసి బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం అందేలా కృషి చేయటం పై ఇరువురు చర్చించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేలా, పోలీసు శాఖ తరపున కృషి చేస్తామని జిల్లా ఎస్పీ గంగాధర రావు జిల్లా ప్రధాన న్యాయమూర్తికి తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యమిస్తామ ని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.

## పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనుకూలమైన ప్రాంతం

**జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ**



**మచిలీపట్నం జూలై 19 (ఆంధ్రపత్రిక) :** పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనుకూలమైన ప్రాంతమని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ కోరారు. శుక్రవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు, రైలు, విమాన రవాణా మార్గాల సౌకర్యాలతో పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాను ఎంపిక చేసుకోదగిన ప్రాంతమని, ఉత్సాహవంతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. వీరపనేనిగూడెం, మల్లవల్లి, చల్లపల్లి వంటి ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సింగిల్ విండో పద్ధతిపై అనుమతులు, మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. బ్యాంకుల్లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే రుణాలు మంజూరయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ కు సూచించారు. చేతివృత్తుల వారిని ప్రోత్సహించేందుకు 18 రకాల ట్రేడ్లతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద అత్యధికంగా టైలరింగ్, తాపీ మేస్త్రి ట్రేడ్లకు ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిశీలించాలని ఎంపీడీవోలకు సూచించారు. మిగిలిన ట్రేడ్లలో చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన పరచాలన్నారు. జిల్లాలోని పరిశ్రమలకు సంబంధించి నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారాం, లీడ్ బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సిఆర్డిఏ డిడి కోటేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన వడ్డెర నాయకురాలు రాయపాటి అరుణ

**వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రాయపాటి అరుణ**



**మచిలీపట్నం జూలై 19 (ఆంధ్రపత్రిక) :** శుక్రవారం జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ గనుల, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ను విజయవాడలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాజకీయా పరిణామాలపై చర్చలు జరిపారు. ఇటీవల కాలంలో నామినేటెడ్ కార్పొరేషన్ చైర్మన్ పదవుల కోసం పార్టీ ప్రముఖులతో చర్చించి కొంత మంది ద్వితీయ శ్రేణి నాయకులు నామినేటెడ్ పదవులకు దరఖాస్తులు సమర్పించారు. రాయపాటి అరుణ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలవటం ప్రస్తుత రాజకీయ వర్గాలలో ప్రాధాన్యత సంతరించుకుంది. రాయపాటి అరుణను వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గా నియమిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. చైర్మన్ ల ఎంపికలో రాయపాటికి అరుణకు పవన్ కళ్యాణ్ ప్రథమ ప్రాధాన్యత ఇస్తారని తెలుస్తోంది.

## తహశీల్దార్లను పూర్వ జిల్లాలకు పునః బదిలీ ఉత్తర్వులు మంజూరు

**ముఖ్యమంత్రి వర్యులు మరియు రెవెన్యూ శాఖామాత్యులకు కృతజ్ఞతలు...**

**బొప్పరాజు - కే. రమేష్ కుమార్**

**విజయవాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** కొన్ని దశాబ్దాలుగా సాధారణ ఎన్నికలు నిర్వహించుటకు జిల్లాలో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న తహశీల్దార్లు ఆ జోన్ లోని వేరే జిల్లాలకు మార్చడం పరిపాటి. అదే విధంగా 2024 సాధారణ ఎన్నికల నిర్వహణ నిమిత్తం తహశీల్దార్లకు భారత ఎన్నికల సంఘం ఉత్తర్వులను అనుసరించి బదిలీలు మార్చి 2024 లో బదిలీలు చేసియున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వారి ఉత్తర్వులు మేరకు ఎక్కడా ఒక్క పోలింగ్ కేంద్రంలో కూడా రీ - పోలింగ్ అవసరం లేకుండా, భారత దేశంలోకెల్లా అత్యంత (82%) పోలింగ్ శాతంతో విజయవంతంగా 2024 - సాధారణ ఎన్నికలు నిర్వహించిన ఘనత రెవెన్యూ శాఖకు దక్కింది. జూన్ 6 , 2024 న ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగియడంతో, ఎన్నికల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, గతంలో దశాబ్దాలుగా ఉన్న సాంప్రదాయం ప్రకారం, ఎన్నికల నిర్వహణ కొరకు బదిలీ అయిన తహశీల్దార్లు ను తిరిగి వారి పూర్వ జిల్లాకు బదిలీ చేయవలసియున్నదని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు, ఎన్నికల సంఘం , ఆర్థిక శాఖల అనుమతితో ప్రభుత్వం తహశీల్దార్ల పునః బదిలీకి ఉత్తర్వులు మంజూరు చేసియున్నారు. తహశీల్దార్ల పునః బదిలీకి ఉత్తర్వులు మంజూరు చేయుటలో కీలక పాత్ర పోషించిన రెవెన్యూ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్ గారికి మరియు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గార్కి, రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, ఐఏఎస్., గారికి, ప్రపోజల్స్ సానుకూలంగా పంపిన చీఫ్ కమిషనర్ ఆఫ్ లాండ్ అడ్మినిస్ట్రేషన్ గార్లకు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.

## శాంసంగ్ నుంచి గెలాక్సీ వాచ్ 7, గెలాక్సీ వాచ్ అల్ట్రా, బడ్స్ 3 సిరీస్




**విజయవాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, తమ సరికొత్త గెలాక్సీ బడ్స్ 3, గెలాక్సీ బడ్స్ 3 ప్రో, గెలాక్సీ వాచ్ 7, గెలాక్సీ వాచ్ అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను ముందస్తు (ప్రీ) ఆర్డర్ చేసే వినియోగదారుల కోసం అద్భుతమైన ఆఫర్‌లను ప్రకటించింది. ప్రతి ఒక్కరికీ సమగ్రమైన వెల్‌నెస్ అనుభవాలను అందించడానికి రూపొందించబడిన వేరబల్ పరికరాల ద్వారా మరింత మందికి గెలాక్సీ ఏఐ శక్తిని గెలాక్సీ వాచ్ 7, గెలాక్సీ వాచ్ అల్ట్రా విస్తరింపజేస్తాయి. గెలాక్సీ వాచ్ 7ని ముందుగా బుక్ చేసుకునే కస్టమర్‌లు రూ. 8000 విలువైన మల్టీ బ్యాంక్ క్యాష్‌బ్యాక్ లేదా రూ. 8000 విలువైన అప్‌గ్రేడ్ బోనస్ పొందుతారు. అయితే గెలాక్సీ వాచ్ అల్ట్రా ని ముందుగా బుక్ చేసుకునే కస్టమర్‌లు రూ. 10 వేలు విలువైన మల్టీ బ్యాంక్ క్యాష్‌బ్యాక్ లేదా రూ. 10 వేలు విలువైన అప్‌గ్రేడ్ బోనస్‌ను పొందవచ్చు.

## సోనీ ఇండియా నుంచి బ్రావియా 3 టెలివిజన్ సిరీస్



**విజయవాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** హెూమ్ ఎంటర్‌టైన్‌మెంట్ టెక్నాలజీలో గణనీయమైన ముందడుగు వేస్తూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బ్రావియా 3 సిరీస్ టెలివిజన్‌లను విడుదల చేసినట్లు సోనీ ఇండియా ప్రకటించింది. వీక్షణ అనుభవాన్ని పునర్నిర్వచించటానికి రూపొందించబడిన ఈ సిరీస్ అద్భుతమైన డిజైన్‌తో అత్యాధునిక ఫీచర్లను మిళితం చేయటంతో పాటుగా, అసమానమైన చిత్ర నాణ్యత, లీనమయ్యే ధ్వని, సహజమైన వినియోగదారు ఇంటర్‌ఫేస్‌ను అందిస్తుంది. కొత్త బ్రావియా 3 టివి సిరీస్ 43, 50, 55, 65, 75, 85 అంగుళాల సైజులో అందుబాటులో ఉంది. ఈ మోడల్‌లు భారతదేశంలోని అన్ని సోనీ సెంటర్‌లు, ప్రధాన ఎలక్ట్రానిక్ స్టోర్‌లు, ఇ-కామర్స్ పోర్టల్‌లలో అందుబాటులో ఉంటాయి.

# వీకెండ్ వినోదం..

**- డీడీ రిటర్న్స్ శనివారం సాయంత్రం 6 గంటలకు జీ సినిమాలులో**

**- గామి ఆదివారం సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో!**




**కర్నూలు, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీలో అత్యంత ఆదరణ గల రెండు ఛానళ్లు జీ తెలుగు, జీ సినిమాలు తమ ప్రేక్షకులను అలరించడానికి మరోసారి సిద్ధమయ్యాయి. వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులకు ఎనలేని వినోదం పంచుతున్న ఈ ఛానల్స్ మరోసారి బ్లాక్‌బస్టర్ సినిమాలతో ఈ వారాంతంలో అలరించేందుకు సిద్ధమయ్యాయి. జులై 20 శనివారం సాయంత్రం 6 గంటలకు జీ సినిమాలులో డీడీ రిటర్న్స్ (భూతాల బంగ్లా), జులై 21 ఆదివారం సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో గామి వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ప్రసారం కానున్నాయి! హారర్ కామెడీ సినిమాగా ప్రేక్షకులను అలరించిన డీడీ రిటర్న్స్(భూతాల బంగ్లా) సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోంది జీ సినిమాలు. ఈ సినిమా కథ దశాబ్దాల క్రితం పాండిచ్చేరి శివార్లలోని ఒక రాజభవనంలో ప్రారంభమవుతుంది. అక్కడ ఆటలో ఓడిపోయిన వారు కుటుంబ సభ్యులచే చంపబడతారు. ప్రస్తుతం ఒక డాన్ కు చెందిన పెద్ద బ్యాగ్ నిండా డబ్బు, నగలు మరో ముఠా దోచుకుంటుంది. పొరపాటున ఆ బ్యాగ్ సతీష్ (సంతానం) మరియు అతని స్నేహితుల దగ్గరకు వస్తుంది. డబ్బు కోసం జరిగే పోరాటంలో హీరో గెలుస్తాడా, ఓడిపోతాడా అనేదే కథ. సంతానం, సురభి, రెడిన్ కింగ్స్లే, మారన్, టైగర్ తంగదురై, ఫెఫ్సీ విజయన్, ధీనా, దీప వంటి నటులు ప్రముఖ పాత్రలు పోషించిన ఈ సినిమాను జీ సినిమాలు వేదికగా మీరూ చూసేయండి! ఇక, వారాంతం వినోదంలో భాగంగా గామి సినిమా ఆదివారం ప్రసారం అవుతుంది. 'గామి' కథ మానవ స్పర్శ కారణంగా మూర్ఛపోయే అరుదైన సమస్యతో బాధపడుతున్న శంకర్ (విశ్వక్సేన్) అనే అఘోరా చుట్టూ తిరుగుతుంది. ద్రోణగిరి పర్వతంపై దొరికే అరుదైన మాలి పత్రాల అన్వేషణకు బయల్దేరిన శంకర్కి, దేవదాసి దుర్గ(అభినయ), ఆమె కూతురు(హారిక), జాహ్నవి(చాందినీ చౌదరి)కి గల సంబంధం ఏంటనేది తెలియాలంటే జీ తెలుగులో ప్రసారం కానున్న గామి సినిమా చూడాల్సిందే. విద్యాధర్ కగితా దర్శకత్వం వహించిన ఈ సినిమా యాక్షన్, సస్పెన్స్ మేళవింపుతో ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకుంటుంది. అత్యున్నత స్థాయి సంగీతం ఈ చిత్రానికి హైలైట్ గా నిలుస్తుంది. విశ్వక్సేన్, చాందినీ చౌదరి, అభినయ, మహ్మద్ సమద్, హారిక పేడాడ, శాంతిరావు, మయాంక్ పరాక్ నటన మరిచిపోలేని అనుభూతినిస్తుంది. కామెడీతోపాటు సస్పెన్స్ థ్రిల్లింగ్ ఫీల్ని పొందాలంటే ఈ వారాంతంలో జీ సినిమాలు, జీ తెలుగులో ప్రసారం కానున్న డీడీ రిటర్న్స్, గామి సినిమాలను మిస్ అవకండి

## జాతీయ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు అందుకున్న మల్లాది ప్రసాదరావు



**విజయవాడ, జులై 19 (ఆంధ్రపత్రిక) :** మీడియా రంగంలో ఉత్తమ పాత్రికేయుడిగా, నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జర్నలిస్ట్ ఉద్యమ నేత గా దాదాపు దశబ్దం కాలంగా పైబడి నవసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ తనదైన శైలిలో వార్తా కథనాలు రాస్తూ, జర్నలిస్టుల సంక్షేమం, రక్షణ ప్రధాన ధ్యేయంగా పనిచేస్తూ ముఖ్యంగా కరోనా కాలంలో స్వచ్ఛందంగా ఎటువంటి లాభవేక్ష ఆశించకుండా సామాన్య జర్నలిస్టుగా మల్లాది ప్రసాదరావు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను రాజస్థాన్ రాష్ట్ర జ్ఞాన్ ఉదయ్ ఫౌండేషన్ గుర్తించి తెలుగు వార్త దినపత్రిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యూరో చీఫ్, మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు మల్లాది ప్రసాదరావు కి జాతీయ ఉత్తమ జర్నలిస్టు అవార్డు అందించారు. శుక్రవారం విజయవాడ హెూటల్ ఐలాపురం లో జ్ఞాన్ ఉదయ్ ఫౌండేషన్ మీడియా రంగంలో సామాజిక సేవ చేస్తున్న పాత్రికేయులకు జాతీయ ఉత్తమ జర్నలిస్టుల అవార్డు పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కె జలీల్ చేతుల మీదుగా మల్లాది ప్రసాదరావు కి జాతీయ ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రధానం చేశారు. జాతీయ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు అందుకున్న మల్లాది ప్రసాదరావు మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం కోసం ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిదిగా పనిచేస్తూ కరోనా మహమ్మారి ప్రపంచాన్ని గడగడలాడించిన కాలంలో నేను చేసిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను గుర్తించి నాకు అవార్డు ప్రధానం చేసిన జ్ఞాన్ ఉదయ్ ఫౌండేషన్ వారికి, జర్నలిస్టుగా దశాబ్ద కాలంగా పైబడి నన్ను ప్రోత్సహిస్తూ అండగా ఉన్న నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్. బండి సురేంద్రబాబు, ప్రముఖ జర్నలిస్ట్ నవ్యాంధ్ర జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ,తెలుగు వార్త దినపత్రిక చీఫ్ ఎడిటర్ ఎస్.కె జలీల్ మరియు నా సహచర పాత్రికేయ మిత్రులకి, స్వచ్ఛంద సేవకులకు, శ్రేయోభిలాషులకి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. జాతీయ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు అందుకున్న మల్లాది ప్రసాదరావును ప్రముఖ జర్నలిస్ట్ సంఘాలు, పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధు, గ్రామ ప్రజలు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలుపుతూ హర్ష వ్యక్తం చేశారు.

## సీనియర్ అడ్వకేట్ సిహెచ్. ప్రభాకర్ కన్నుమూత!



**విజయవాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** పట్టణ ప్రముఖుడు సీనియర్ న్యాయవాది సిహెచ్. ప్రభాకర్ బుధవారం తెల్లవారుజామున హైదారాబాద్ లో కన్నుమూశారు. వీరు కొంతకాలంగా అనారోగ్యంతో ఉంటూ మెరుగైన ట్రీట్మెంట్ కోసం సిటీలో కుమార్తె వద్ద ఉంటున్నారు. ప్రభాకర్ ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో పట్టభద్రులు అయ్యాక, 1975-76 మధ్య హైదరాబాద్ లో ప్రముఖ న్యాయవాది శ్రీ వేదాంతరావు వద్ద కొద్ది కాలం జూనియర్ గా ఉన్నారు. అనంతరం 1977 నుంచి ఇప్పటివరకు అదిలాబాద్ జిల్లా లక్షెట్టిపేట మున్సిఫ్ కోర్టులో ప్లీడరుగా ప్రాక్టీసు చేశారు. సివిల్, క్రిమినల్ కేసులు రెండింటిలోనూ 45 ఏళ్ల పాటుగా సుదీర్ఘ కాలం వీరు న్యాయవాద వృత్తిలో ఉన్నారు. ఈ ప్రాంతం కేసులు లక్షెట్టిపేట్, చెన్నూరు మున్సిఫ్ కోర్టులు, అదిలాబాద్ జిల్లా కోర్టులోనూ వాదించే క్రమంలో... పది మందికి పైగా వీరి వద్ద జూనియర్ ప్లీడరులు ప్రాక్టీస్ లో ఉండేవారు. వీరు కాంగ్రెస్ రాజకీయాల్లో చురుగ్గా వుంటూ, డిస్ట్రిక్ట్ యూత్ కాంగ్రెస్ ప్రసిడెంట్ గా 1982-83 మధ్య పనిచేసారు. ఆ కాలంలో జిల్లాలో పార్టీలోకి యువతను పెద్ద ఎత్తున చేర్చే క్రమంలో ప్రభాకర్ క్రియాశీలంగా పనిచేసారు. స్థానిక శాసన సభ్యులు ఇతర నాయకులకు న్యాయ సలహాదారుగా ఉండేవారు. భారత ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ బ్లాక్ అధికారిగా వీరి తండ్రి శ్రీ చోరగుడి జాన్ సుదర్శనం ను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణకు పోస్ట్ చేయడంతో ప్రభాకర్ కుటుంబం ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా కోలవెన్ను గ్రామం నుంచి 1954 లో తెలంగాణ వచ్చి, అప్పటి అదిలాబాద్ జిల్లా లక్షెట్టి పేట్ లో స్థిరపడ్డారు. వీరి తల్లి శ్రీమతి ప్రేమావతి అదే ప్రాజెక్టులో స్త్రీ సంక్షేమ విభాగంలో పనిచేసారు. ప్రభాకర్ సతీమణి శ్రీమతి ఎలిజబెత్ ప్రభుత్వ కళాశాల విద్యా శాఖలో ఆంగ్ల బోధకురాలుగా పనిచేసారు.

# అధిక వర్షాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

## రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

**నూజివీడు, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** రెండు రోజులనుండి ఎడతెరుపు లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు పాటించాలని మంత్రివర్యులు కొలుసు పార్థసారధి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.నూజివీడు నియోజక వర్గ ప్రజలకు భారీ వర్షాల కారణంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే మా కార్యదర్శి దృష్టికి తెలియజేయాలని సూచించారు.తెలియజేసిన మరుక్షణమే సంబంధింత అధికారులను అదేశించి తక్షణ చర్యలు చేపడతామన్నారు .వరదల సమయంలో ముఖ్యంగా కలుషిత నీరు త్రాగడం ద్వారా అతిసార వ్యాధి వచ్చే అవకాశం ఉందనీ,కాచి చల్లార్చిన నేరు త్రాగడం మంచిదన్నారు. విద్యుత్ స్తంభాలు విరగడంతో విద్యుత్ అంతరాయం ,భారీ చెట్లు విరగడంతో రవాణా అంతరాయం కలగడం ప్రమాదాలు జరగడం మరియు విషసర్పాలు ఇళ్లలో ప్రవేశించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ఆహార కొరత ఉన్న మరియు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన ఎటువంటి ప్రమాదం



ఎదురైన వెంటనే మంత్రివర్యుల కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాలని ,24 గంటలు మా సిబ్బంది మంత్రివర్యుల క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ,వారియొక్క సేవలు వినియోగించుకోవాలని నియోజకవర్గ ప్రజలకు మంత్రివర్యులు సూచించారు. వరదలకు సంబంధించిన పలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల ప్రభుత్వ శాఖల ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు .ప్రభుత్వ అధికారుల్లో ముఖ్యంగా వైద్య, రెవెన్యూ, విద్యుత్, రవాణా శాఖ, ఆహార భద్రత, ఎన్ డి అర్ ఎఫ్, శాఖల కు సంబంధించి అధికారులందరూ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ ఏ విధమైన ఇబ్బందులకు గురికాకుండా కాపాడడానికి సంసిద్ధం గా ఉన్నారన్నారు. నియోజక ప్రజలు ,జిల్లా ప్రజానీకం ఆదర్య పడకుండా వారి సేవలు వినియోగించుకోవాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేసారు. 24 గంటలు మంత్రివర్యుల కార్యదర్శి కాల్ చేయ వలసిన నెంబర్:లో 8522007645 అందుబాటులో ఉంటారు.

## జర్నలిస్టులపై మీడియా సంస్థలపై విజయసాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా

# శాంతియుత నిరసన నిర్వహణ

**మచిలీపట్నం జూలై 19 (ఆంధ్రపత్రిక) :** జర్నలిస్టులపై మీడియా సంస్థలపై రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నగరంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కి చెందిన జర్నలిస్టులు స్థానిక కలెక్టరేట్ వద్ద శుక్రవారం శాంతియుత నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీడియా నిరసనకు జనసేన బందరు నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామ కృష్ణ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్రెపాటి గోపీచంద్, కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి పివి ఫణికుమార్ , సిపిఐ నాయకులు ఫిలిప్, కాంగ్రెస్ నాయకులు, సంఘీభావం తెలిపి విజయసాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలను నాయకులు ఖండించారు.మీడియా సంస్థల యాజమాన్యాలపై జర్నలిస్టులపై రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాక, వారిపై బెదిరింపు చర్యలకు పాల్పడడం ఇష్టాను రీతిగా మీడియా ప్రతినిధులను ఏక వచనంతో వ్యాఖ్యానించడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలుగు దేశం రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్రెపాటి గోపీచంద్ ఖండించారు. విజయసాయిరెడ్డి మీడియాకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా మిత్రులు నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మచిలీపట్నం జనసేన పార్టీ నియోజకవర్గ




ఇన్చార్జ్ బండి రామకృష్ణ మాట్లాడుతూ మీడియా కు సమాజంలో సముచిత స్థానం, గౌరవం, ఇవ్వవలసిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని, తన ఇష్టానురీతిగా విజయసాయిరెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడడమే కాక మీడియా ప్రతినిధులను ఏకవచనం తో, అరేయ్ ,ఒరేయ్, అని సంభోదించడం విజయసాయిరెడ్డి అహంకారానికి నిదర్శనమని అన్నారు. వెంటనే విజయసాయిరెడ్డి మీడియా ప్రతినిధులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు, టిడిపి ప్రచార కార్యదర్శి పి.వి.ఫణి కుమార్ వివిధ పార్టీలకు, చెందిన నాయకులు ప్రింట్-ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ర్యాలీగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి జిల్లా ఎస్పీ గంగాధర రావుకు, వినతి పత్రాన్ని అందించారు.

## శ్రీమహాలక్ష్మి అమ్మవారి శాకంబరి ఉత్సవాలు ప్రారంభం

**విజయవాడ పశ్చిమ, జూలై 19, (ఆంధ్రపత్రిక):** స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ నగరాల సీతారామ స్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానంలో శాకంబరి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 21వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు ,ప్రధాన కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతు తమ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. శాకంబరీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారని వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని,



అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారికి ఈ ప్రత్యేక అలంకారం చేసినట్లు తెలిపారు. దేశంలో ఒకసారి విపరీతమైన కరువు ఏర్పడడంతో ప్రజలు, దేవతలు, అందరూ కలిసి అమ్మవారిని ప్రార్థించడంతో ఆమె వివిధ రకాలైన కూరగాయలను సర్వాభరణాలుగా ధరించి భక్తులకు దివ్య దర్శనం ఇచ్చిందని, అప్పటి నుండి సకాలంలో పంటలు పండడంతో కరువు తొలగిపోయిందని, ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా పూజించడం సాంప్రదాయంగా మారిందన్నారు. కాగా ఈ ఉత్సవాల్లో అమ్మవారు శ్రీశాకాంబరీ దేవి అలంకారమునకు కాయగూరలు సమర్పించిన దాతలు రాజగిరి శివ, వారి కుటుంబాన్ని సత్కరించారు.

## శ్రీకనకదుర్గమ్మకు వడ్డెరపేటవారి ఆషాడం సారె

**విజయవాడ పశ్చిమ, జూలై 19, (ఆంధ్రపత్రిక) :** వడ్డెర పేటలో వడ్డే వారి కనకదుర్గ అమ్మవారికి ఆషాడం మాస సారే నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ తెలిపారు. శుక్రవారం వడ్డెర పేటలో వడ్డే వారి కనకదుర్గ ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో ఆలయ కమిటీ నిర్వాహకులు అమ్మవారికి పెద్ద ఎత్తున



భక్తులు అమ్మవారికి సారే సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు శర్మ మాట్లాడుతూ ఆషాడమాసంలో అమ్మవారికి సారే పెట్టడం ఆనవాయితీగా వస్తుందని ,అలాగే శాఖంబరీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ సారే కార్యక్రమం శ్రీ వాగు వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం నుండి ప్రత్యేక పూజల అనంతరం బయలుదేరి వాగు సెంటర్, బంగారయ్య కొట్టు, చిట్టినగర్ తిరిగి వాగు సెంటర్, శ్రీనివాస్ మాల్ సెంటర్, నుండి వాగు మీదుగా వద్రుపేటలో వేంచేసి ఉన్న వడ్డేవారి కనకదుర్గమ్మ వారికి భక్తులు పెద్ద ఎత్తున సారె సమర్పించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కొండప్రాంత బాధితులకు ఎమ్మెల్యే సుజనా ఆర్థికసాయం




**విజయవాడ పశ్చిమ, జూలై 19, (ఆంధ్రపత్రిక):** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నియోజకవర్గంలోని 51 డివిజన్‌లోని కొండ ప్రాంతంలో బాధిత కుటుంబానికి విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయం ఆర్థిక సాయం చేయడం జరిగింది. శుక్రవారం 51 డివిజన్ కొండ ప్రాంతంలో పర్యటిం చిన సుజనా చౌదరి కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ బాధిత కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. కొండ ప్రాంతంలో నివసిస్తున్న కడవల నూకాలమ్మ, రాజు కుటుంబ సభ్యులకు సుజనా చౌదరి కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ఆర్థిక సాయం చేశారు. నూకాలమ్మ ఇల్లు వర్షాలకు పిచ్చింగ్ జారిపోవడంతో వారి ఇళ్ళు దెబ్బతిన్నాయి. తమ సమస్య ఆలకించడంతోపాటు కొండ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తామని తమకు ఆర్థిక సాయం చేసిన పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండప్రాంత ప్రజల రక్షణకు ప్రత్యేక చర్యలు

### పశ్చిమ శాసన సభ్యులు సుజనాచౌదరి

**విజయవాడ పశ్చిమ, జూలై 19, (ఆంధ్రపత్రిక) :** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు



51 డివిజన్ కొండ ప్రాంతంలో ఉన్న ఇంటి దగ్గర ఉన్న పిచ్చింగ్ జారి కింద పడిపోవడం జరిగింది. కడవల అప్పారావు (పువ్వుల అప్పారావు) ప్రాంతంలోని బాధితుల ఇంటి వద్ద చోటు చేసుకున్న పరిణామాలు ను స్థానిక టిడిపి నాయకులు కిరణ్ కుమార్ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ సంబంధిత సమస్యను జోనల్ కమిషనర్ కీర్తనకు తెలియజేశారు. శుక్రవారం 51 డివిజన్లోని ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, జోనల్ కమిషనర్ పర్యటించి నేరుగా ఈ సమస్యతో పాటు బాధితులను పలకరించి వారికి భరోసా ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొనడం జరిగింది. ఈ సంఘటనలో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు ఈ ప్రాంత సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

## విద్యార్థులకు సైకిళ్లనుపంపిణీ

### ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



**ఎ.కొండూరు, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు గ్రామంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శుక్రవారం పర్యటించారు. పోలిశెట్టిపాడు గ్రామంలోని టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని 13 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో 13 సైకిళ్ళను అందజేశారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు సుమారు 3 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్ళే విద్యార్థుల బాధను చూడలేక తన మనస్సు చలించి విద్యార్థుల కష్టాలను గట్టెక్కించాలని ఉద్దేశంతో విద్యార్థుల కళ్ళల్లో ఆనందం కోసం సమయానికి పాఠశాలకు వెళ్లే విధంగా బాలురు మరియు బాలికలకు సైకిళ్లను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.తమ బాధను అర్థం చేసుకొని ఎంతో గొప్ప మనస్సుతో సైకిళ్లను పంపిణీ చేయటం పట్ల విద్యార్థినీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తిరువూరు మాజీ ఏఎంసీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ వాసం మునయ్య , పోలిశెట్టిపాడు సర్పంచ్ బొల్లె పోగు చిట్టిబాబు,టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**నూజివీడు, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** నూజివీడు మండలం దేవరగుంట గ్రామానికి చెందిన సుమారు 65 మంది కలిసి ఒక ప్రవేటు వాహనంలో గురువారం ఉదయం జంగారెడ్డిగూడెం సమీపంలో గల గుబ్బల మంగమ్మ తల్లి దర్శనానికి వెళ్లిన భక్తులు అకస్మాత్తుగా ఒక్కసారిగా వచ్చిన వరదల్లో గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో చీకటి అరణ్యంలో చిక్కుకున్న 65 మంది భక్తులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ఇక దేవుడే మనల్ని రక్షించాలని అనుకొని గుబ్బల మంగమ్మ తల్లికి మొక్కుకొని తల్లిని వేడుకుంటున్న సమయం అదే గ్రామానికి చెందిన భక్తుడు వంకాయలు హరిబాబు స్పందించి రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి వర్యులకు సమాచారం అందించగా వెంటనే స్పందించిన మంత్రివర్యులు ఆర్. టి. సి. డిపో మేనేజరు, ఇతర అధికారులతో మాట్లాడి తక్షణమే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి సురక్షిత ప్రాంతానికి తరలించాలని అధికారులకు ఆదేశించిన మంత్రివర్యులు కొలుసు పార్థసారథి ఆదేశించన వెంటనే ఆర్. టి. సి. డిపో మేనేజరు ఒక ప్రత్యేక బస్సు ను ఏర్పాటుచేసి భక్తులను వారి గమ్య స్థానాలకు చేర్చిన ఆర్.టి.సి. సిబ్బంది, ప్రాణాలతో తిరిగి వస్తామో లేదో అని అధైర్య పడే సమయంలో మా మనవి ఆలకించి మమ్మల్ని ప్రాణాలతో ఇంటికి సురక్షితంగా చేర్చిన రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి జీవితాంతం ఋణ పడివుంటామని భక్తులు వారి కృతజ్ఞతను, ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మంత్రిని మునుపెన్నడూ మేము చూడలేదని కలకాలం మీరే మాకు ఎమ్మెల్యేగా గా ఉండాలని ఆ గుబ్బల మంగమ్మ తల్లిని కోరుకుంటున్నామని వారి హర్షాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## రైతుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

### రైతు సంఘం నాయకులు



**బంటుమిల్లి 19 జూలై (ఆంధ్రపత్రిక) :** రాష్ట్ర రైతు ,కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపుమేరకు, రైతులకు 20 23 సంవత్సరం మీచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వవలసిన రైతులకు ఇవ్వాలని , గత సంవత్సరం పంటల బీమా పరిహారం ఇవ్వాలని ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన రైతు పెట్టుబడి సాయం 20 వేల రూపాయలు రైతులకు ,కౌలు రైతులకు వెంటనే ఇవ్వాలని, గత ప్రభుత్వము విద్యుత్ శక్తి సంబంధించి ఇచ్చిన 22వ జీవోను, స్మార్ట్ మీటర్ల లను రద్దు చేయాలని, కౌలు రైతులకు భూయాజమాని సంతకంతో ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి ,బ్యాంకు పంట రుణాలతో పాటు , ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు కూడా ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం 100 రోజుల నుంచి 200 రోజు వరకు పెంచాలని, 600 రూపాయల వరకు రోజు కూలి ఇవ్వాలని ,ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతు బంటుమిల్లి మండలంలో బంటుమిల్లి గ్రామ 2 సచివాలయంలో, పెందుర్రు, ములపర్రు , నాగేశ్వరరావు పేట ఆముదాలపల్లి, అర్తమూరుగ్రామ సచివాలయంలో మీ ద్వారా గౌరవనీయ మన రాష్ట్ర ముఖ్యమంత్రి కి పంపించవలసినదిగ కోరుతూ అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి మండలం రైతు సంఘ అధ్యక్ష ,కార్యదర్శులు మలిశెట్టి శివరాం ప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్, రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధన రావు, రైతులు వెంట్ర పాటి శ్యామసుందర్, గొట్టిపాటి గంగాధర్, సుంకర వెంకన్న,చిటికినేని నాగమల్లి, చిటికినేని బలరాముడు, సుంకర నాగమల్లేశ్వరావు,తలారి నాంచారయ్య, వాసన నాని బాబు , వ్యవసాయ కార్మిక సంఘం బంటుమిల్లి మండల కార్యదర్శి నాగిశెట్టి చంద్రశేఖరబాబు, సహాయ కార్యదర్శి నాగిశెట్టి కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం నాయకుడు జన్యావుల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## సెవెన్ హిల్స్‌ను కొనుగోలు చేసిన ఎంజిఎం హెల్త్‌కేర్

**విజయవాడ, 19 జూలై (ఆంధ్రపత్రిక) :** ప్రఖ్యాత మల్టీ-స్పెషాలిటీ క్వాటర్నరీ-కేర్ హెల్త్‌కేర్ గ్రూప్, ఎంజీఎం ఈరోజు కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియలో సెవెన్‌హిల్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా సెవెన్‌హిల్స్ హాస్పిటల్, విశాఖపట్నంను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఈ కొనుగోలుతో, ఎంజిఎం హెల్త్‌కేర్ గ్రూప్ మొదటి ఆసుపత్రిని ప్రారంభించిన 5 సంవత్సరాల స్వల్ప వ్యవధిలో 1000 కంటే ఎక్కువ పడకల మైలురాయిని సాధించింది.కొనుగోలు గురించి వ్యాఖ్యానిస్తూ, డాక్టర్ ప్రశాంత్ రాజగోపాలన్, డైరెక్టర్, ఎంజిఎం హెల్త్‌కేర్ ఇలా అన్నారు, "ఎంజిఎం హెల్త్‌కేర్, సెవెన్‌హిల్స్ ఆసుపత్రిని వ్యూహాత్మకంగా కొనుగోలు చేయడం చెన్నై వెలుపల కూడా మా ఉనికిని విస్తరించాలనే మా ప్రయత్నాన్ని, మరియు నాణ్యమైన, సరసమైన మరియు వ్యక్తిగతీకరించిన ఆరోగ్య సంరక్షణను అందించాలనే మా లక్ష్యంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. విశాఖపట్నంలో గొప్ప వారసత్వం కలిగిన గౌరవనీయ సంస్థ అయిన సెవెన్‌హిల్స్‌తో భాగస్వామ్యం ద్వారా, మేము వైజాగ్ తో పాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఒడిశా మరియు ఛత్తీస్‌గఢ్‌లోని రోగులకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కొనుగోలు ఎంజిఎం హెల్త్‌కేర్ యొక్క భౌగోళిక విస్తరణ వ్యూహానికి అనుగుణంగా ఉంది. తద్వారా నిబద్ధతతో, మేము మా సామర్థ్యాలను మరింత మెరుగుపరుస్తూ, రోగులకు గొప్ప ఆరోగ్య సంరక్షణను అందించడానికి తోడ్పడుతుందని చెప్పారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి

- మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన నాణ్యతపైనా ప్రత్యేక దృష్టి
- సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజా భాగస్వామ్యం అవసరం
- ఈ దిశగా జన జాగృతి కార్యక్రమాల నిర్వహణ
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన







**ఎ.కొండూరు, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేకంగా కృషి చేయడం జరుగుతుందని.. ఉపాధ్యాయులు తప్పనిసరిగా టీచింగ్ ప్లాన్ ప్రకారం బోధన జరిపేలా, మంచి బోధన ఫలితాలు లభించేలా మార్గనిర్దేశనం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. శుక్రవారం కలెక్టర్ సృజన ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఎ.కొండూరు మండలం, చీమలపాడు పెద్దతండాలో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికను అనుసరించాలన్నారు. వర్క్‌షీట్‌లను తప్పనిసరిగా చిన్నారులతో పూర్తిచేయించాలని ఆదేశించారు. అనంతరం కట్లేరు వాగు వరద ఉధృతిని పరిశీలించారు. నూతన వంతెన నిర్మాణానికి సంబంధించి, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. అనంతరం తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరువూరు నియోజకవర్గంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను కూడా కలెక్టర్ సృజన సందర్శించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పాఠశాలలో కలియ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా





కలెక్టర్ డా. జి.సృజన మాట్లాడుతూ క్షేత్రస్థాయి తనిఖీల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రం, బాలికోన్నత పాఠశాలను సందర్శిం చినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఎంత ముఖ్యమో విద్యార్థుల కు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం చాలా ముఖ్యమని.. ఇందుకు అనుగుణంగా టీచింగ్ ప్లాన్ ప్రకారం విద్యా నైపుణ్యాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మధ్యా హ్న భోజనం నాణ్యంగా ఉండేలా చూడాలని.. ప్రతి విద్యార్థి పోష కాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోపాలేవైనా ఉంటే వెంటనే చక్కదిద్దాలన్నారు. మీడియా, స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు తదితరుల సలహాలను కూడా పరిగణనలోకి తీసుకో నున్నట్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారి నపడకుండా ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు అడ్డుకట్ట వేయొచ్చని పేర్కొన్నారు. ఫ్రైడే-డ్రై డేను సమర్థవంతంగా అమలుచేసేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు. కలెక్టర్ వెంట తిరువూరు ఆర్‌డీవో కె.మాధవి, వివిధ శాఖల అధికారులు తదితరులున్నారు.

## ఫ్రైడే డ్రై డేతో దోమల నియంత్ర చర్యలు

అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ఎం.పి కేశినేని శివనాథ్




**విజయవాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** చంద్రబాబు నాయుడు మళ్ళీ అధికారంలోకి రావడంతో పరిశుభ్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటురని, అందులో భాగంగా ప్రతి శుక్రవారం డ్రై డేగా ప్రకటించి అధికారులను, ప్రజలను సమన్వయం చేసి దోమల నియంత్రణ ద్వారా వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్ శ్రీనివాసనగర్లో ఫ్రై డే డ్రై డే అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ఎం.పి కేశినేని శివనాథ్ లు పాల్గొన్నారు. అనంతరం రూ.20 లక్షలతో పరమేశ్వరరావు రోడ్డు నిర్మాణ పనులను భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకూడదని గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దోమలపై దండయాత్ర పేరుతో దోమల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు వైఎస్సార్సీపీ నాయకులు ఎగతాళి చేశారన్నారు. ఆనాడు చంద్రబాబు తీసుకున్న ప్రత్యేక కార్యక్రమం వల్లనే ప్రజలకు డెంగ్యూ, ఇతర వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. చంద్రబాబు నాయుడు వంటి విజన్ ఉన్న నాయకుడు చేసే పనులన్ని విజయవంతం అయి మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. చంద్రబాబు నాయుడిని ఎగతాళి చేయడమే పనిగా వైఎస్సార్సీపీ నాయకులు పెట్టుకున్నారన్నారు. దోమలకు నిలయంగా ఉండే ప్రాంతాలైన డ్రైనేజీలను క్లీనింగ్ చేయడం, భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హెూల్స్ పొంగకుండా కార్పోరేషన్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎంపి కేశినేని శివనాథ్ సహకారంతో రాజధాని విజయవాడ నగరంలోని ప్రతి రోడ్డు సీసీ రోడ్డుగా మార్చడం, భూగర్భడ్రైనేజీ సౌకర్యం కల్పించడంతో పాటుగా స్ట్రామ్ వాటర్ సౌకర్యాన్ని కల్పిస్తామని చెప్పారు. పరమేశ్వరరావు రోడ్డు నుంచి మహానాడు రోడ్డు వరకు రూ.20 లక్షలతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టామన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హాయంలో తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పడకేసిందని, గద్దె రామమోహన్ మూడో సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఈ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. గెలిచిన రోజు నుంచి ఈ రోజు వరకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పర్యటిస్తూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించడానికి తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, గొల్లపూడి నాగేశ్వరరావు, సలిమిశెట్టి రాజామణి, బొజ్జలపూడి నాగేశ్వరరావు, జోనల్ కమీషనర్ శివరామకృష్ణ, ఇ.ఇ. సామ్రాజ్యం చలసాని రోజా, వడ్లపాటి గోపాల కృష్ణ, వై. రాజా, కె. వెంకటరత్నం, కె. వెంకటేశ్వరరావు, అక్కినేని రమేష్, కె.రవి, వై.రాజేంద్ర ప్రసాద్, గద్దె రమేష్, కె. ఆంజనేయ వాసు, చలసాని వాసు తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల్లో పర్యటన



**తణుకు, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ రెగ్యులేటర్ ముంపు ప్రాంతాలలో పర్యటించి, లోతట్టు ప్రాంత వాసులను పరామర్శిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి. పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట స్థానిక శాసనసభ్యులు ఆరుమిల్లి రాధాకృష్ణ .నందమూరు ఆక్వాడెక్ట్, దువ్వ రెగ్యులేటర్ వద్ద యనమదుర్రు డ్రైయిన్ లో వరద నీటి పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ అవసరమైన ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు ఆదేశాలుతణుకు మండలం దువ్వ రెగ్యులేటర్ వద్ద కొత్తపేట కాలనీలో వరద నీటి కారణంగా మునిగిన గుడిసెలను పరిశీలించిన నాగరాణి, రాధా కృష్ణ స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావస కేంద్రాలకు తరలి రావలసిందిగా కోరిన పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

## పోలీస్ కమిషనర్‌ని కలిసిన ఎంపి చిన్ని, ఎమ్మెల్యే గద్దె



**విజయవాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** కొత్తగా నియమితులైన పోలీస్ కమిషనర్ ఎస్ వి.రాజశేఖర్ బాబుని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి రాములు శుక్రవారం నాడు మర్యాద పూర్వకంగా కలసి పూలబొకే అందజేసి, శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మెగా కుటుంబాన్ని విమర్శించే స్థాయి నీకు లేదు జగ్గారెడ్డి

ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన కార్యదర్శి నాగబాబు



**కృత్తివెన్ను 19 జూలై (ఆంధ్రపత్రిక) ;** తెలంగాణ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఒక మీడియా సమావేశంలో చిరంజీవి పవన్ కళ్యాణ్ ఉద్దేశించి రైతుల పక్షాన ఉన్నట్లు చిరంజీవి ఖైదీ నెంబర్ 150 తీశారు.రైతుల పేరుతో సినిమాల తీసి కోట్లు సంపాదిస్తున్నారు కానీ ఢిల్లీలో ధర్నా చేసిన రైతులకు మద్దతు ఇవ్వలేదు. చిరంజీవి సినిమా హిట్ రైతులు పట్, పవన్ బిజెపికే ఆయన మద్దతు ఇస్తున్నారు కాంగ్రెస్ లో ఉంటే సరైన దారిలో ఉండేవారు ఇప్పుడు పక్కదారి పట్టారు. అని ఒక మీడియా సమావేశంలో జగ్గారెడ్డి సెటైర్లు వేశారు. జగ్గారెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఉమ్మడి జనసేన జిల్లా కార్యదర్శి కూనసాని నాగబాబు. చిరంజీవిని పవన్ కళ్యాణ్ ని విమర్శించే స్థాయి మీకు లేదని, మీరు మాట్లాడే మాటలు హాస్యస్పదంగా ఉన్నాయని, యముడికి మొగుడు సినిమా టైంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం మెగాస్టార్ చిరంజీవి అందించారని, అలాగే పవన్ కళ్యాణ్ ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు దాదాపుగా 30 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన మహోన్నతమైన వ్యక్తిని నీ ఇష్టం వచ్చినట్టు విమర్శలు చేయడం నీ అజ్ఞానానికి తార్కాణం అని , మీ కాంగ్రెస్ పార్టీలో ఉంటేనే రైతులకు మేలు జరుగుతుందని మతిభ్రమించిన మాటలు ఇంక సరిపెట్టాలని లేని పక్షంలో మా జన సైనికుల చేతిలో నీకు ఘోర పరాభవం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతంగా నిర్వహించిన ఫ్రైడే - డ్రై డే

నగర ప్రజలకు సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ లాంటి జ్వరాలపై అవగాహన కార్యక్రమాలు

64 డివిజన్లో ఫ్రైడే - డ్రై డే అవగాహన కార్యక్రమం



**విజయవాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డెంగ్యూ మలేరియా డయేరియా వ్యాధులను అరికట్టేందుకు ప్రజలకు వాటి నివారణకై అవగాహన కార్యక్రమాలను, విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతంగా నిర్వహించింది. శుక్రవారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ నిర్వహించిన "ఫ్రైడే -డ్రై డే " కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గం 30 డివిజన్ లో జిల్లా కలెక్టర్ జి సృజన, తూర్పు నియోజకవర్గం నాలుగవ డివిజన్లో గౌరవనీయులైన పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్, శాసన సభ్యులు గద్దె రామ్మోహన్రావు, పశ్చిమ నియోజకవర్గం 46వ డివిజన్లో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి సైతం పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. విజయవాడ నగరపాలక సంస్థ 64 డివిజన్లోనూ "ఫ్రైడే - డ్రై డే" కార్యక్రమం ద్వారా మలేరియా, డెంగ్యూ, డయేరియా వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు డివిజన్ కార్పొరేటర్లు, హెల్ సెక్రటరీలు, ఎమినిటీ సెక్రటరీలు, ప్రజారోగ్య సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వర్షపు నీటి నిల్వలు వల్ల పుట్టే దోమలు, వాటి ద్వారా సోకే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటి జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నివారణ పద్ధతులు ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పడమే కాకుండా. ప్రతి శుక్రవారం ఇంటిలో ఉన్న నీటి నిల్వలైన వాడేసి పడిన కొబ్బరి చిప్పలు, రోలు, టైర్లు, పూల కుండీలు, ఫ్రిడ్జ్ బయట భాగం లో నిల్వ ఉండే నీరు, కూలర్ లో ఉన్న నీరు, ఇలా ప్రతి వస్తువులో నిల్వ ఉన్న నీటిని వారంలో ఒకసారి, అదే ప్రతి శుక్రవారం, డ్రై డే గా మార్చుకోవాల్సిందిగా, ఆ నీటి నిల్వలను పారవేసి శుభ్రపరచుకుటం వలన, దోమలు పుట్టే అవకాశం ఉండవని, తద్వారా దోమలు వల్ల కలిగే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటి జ్వరాలు సోకవని, ప్రజలు ఆరోగ్యంగా ఉండవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్లు, విజయవాడ నగర పలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ ఏ మహేష్, అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ కేవీ సత్యవతి, డిస్టిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గీత బాయ్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, శివరామకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు డాక్టర్ రామకోటేశ్వరరావు డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏ యస్ ఎన్ ప్రసాద్, శ్రీనివాస్, సామ్రాజ్యం, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య అధికారిగా పవన్ కుమార్



**ఆగిరిపల్లి, జూలై 19 (ఆంధ్రపత్రిక) ;** ఆగిరిపల్లి మండల పరిధిలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య అధికారిగా రెంటాల పవన్ కుమార్ నూతనంగా నిమతలయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలానికి మంచి నీటి సరఫరా, పారిశుధ్య (ఆర్ డబ్ల్యు ఎస్ అండ్ ఎస్) అధికారిగా (ఏ డబ్ల్యు ఈ) నియమితులైనానని, , జల జీవన్ మిషన్ ఫండ్స్ తో మండల వ్యాప్తంగా వాటర్ ట్యాంకులు నిర్మించడం, వాటర్ పైపులైన్లు ఏర్పాటు చేయడం, ఇంటింటికి మంచి నీటి సరఫరా ఏర్పాటు చేయటకు ఉన్నతాధికారుల సలహాలతో కృషి చేస్తానని, ఈరోజు మండలంలోని రెండు గ్రామాలను పరిశీలించి ఆ గ్రామాలలో డ్రెయిన్స్ పరిశీలించామని ఆ గ్రామాలలో సమస్యలను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకొని వెళ్లి ఫండ్స్ విడుదల అయ్యేలా చూస్తానని, మండల వ్యాప్తంగా ఏ గ్రామం వా రి కైనా మంచినీటి సరఫరా, పారిశుధ్యం పై ఏమైనా ఇబ్బంది వస్తే మా దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తానని తెలిపారు

## టీడీపీ హాయంలోనే తూర్పునియోజకవర్గంలో అభివృద్ధి

రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** గద్దె రామమోహన్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాతే తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మొదలయ్యాయని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ అన్నారు. శుక్రవారం ఉదయం 8వ డివిజన్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొని రూ.17.97 లక్షలతో అశోక్ నగర్ 5 నెంబర్ బస్ రూట్లోని మొదటి క్రాస్ రోడ్డుకు మరియు శ్యామ్ నగర్లో రూ.9.97 లక్షలతో సిసి రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ పరిధిలోని పలు రోడ్లను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తో కలిసి ప్రారంభించామన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తూర్పు నియోజకవర్గంలోని ప్రతి రోడ్డును సీసీ రోడ్డుగా మార్చడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారని, వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఆ నిధులు ఎమయ్యాయో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నాయన్నారు. అందువల్ల కొద్దిపాటి వర్షానికే నగరంలోని చాలా ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటున్నాయని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజులలోనే తూర్పు నియోజకవర్గంలో నాలుగు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి రోడ్డును సీసీ రోడ్డుగా మారుస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫ్రైడేను డ్రై డేగా అమలు చేయడం జరిగిందని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు. డ్రైడే పాటించడం వల్ల రోగాల బారిన పడకుండా ఉంటామన్నారు. ఇళ్ళ చుట్టూ నిల్వ ఉన్న నీటిని కార్పోరేషన్ సిబ్బంది సహకారంతో శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో అన్ని రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటుగా భూగర్భ డ్రైనేజీ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని చెప్పారు. రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు స్ట్రామ్ వాటర్ పథకాన్ని అమలు చేశామని, ఎల్అండ్ టీ కంపెనీతో ఆ పనులు కూడా చేపట్టామన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం హాయంలో ఆ కంపెనీ చేపట్టిన పనులను నిలిపివేయడంతో ఆ పథకంలో నిధులు ఉన్నా పనులు ముందుకు సాగలేదన్నారు. అందువల్లనే ఇప్పుడు కొద్ది పాటి వర్షానికే నగరంలోని నీరు రోడ్లపై నిల్వ ఉంటున్నాయన్నారు. ఇప్పుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో స్ట్రావ్వాటర్ పథకంలో భాగంగా మిగిలిన నిధులను తెచ్చి స్ట్రామ్ వాటర్ పథకాన్ని పూర్తి చేస్తామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, కోగంటి రామారావు, మల్లెల రామకృష్ణ, పాలడుగు వల్లభాయ్ పటేల్, కె.వి. శ్రీనివాస్, బోగాది అనీల్, ఎర్నేని వేదవ్యాస్, సొంగ సంజయ్ వర్మ, నారు రామారావు, బద్దూరి వీరారెడ్డి, గడ్డం హరికృష్ణ, వీరపనేని అరుణ, గద్దె రమేష్, చలసాని రమణ, తదితరులు పాల్గొన్నారు.

## 21వ తేదీ ఆదివారం ధ్యాన మందిరం ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు

**గుంటూరు : జులై 19 (ఆంధ్రపత్రిక)** స్థానిక కొత్తపేట శ్రీ గణేశ్వర రావు వీధిలో కొలువున్న శ్రీ షిరిడి సాయి ధ్యాన మందిరంలో ఈనెల 21వ తేదీ ఆదివారం నాడు గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వేపూరి లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. 21వ తేదీ ఆదివారం ఉదయం ఐదు గంటల 40 నిమిషాలకు కాకడ హారతి, ఆరున్నర కు పంచామృత అభిషేకములు, 10 గంటలకు స్వరరాగ సుధా సాయి వారిచే భక్తులకు ప్రవచనాలు, 12:30 కు మధ్యాహ్న హారతి అనంతరం బాబా చాలీసా పఠనం అనంతరం తీర్థప్రసాద వితరణ సాయంత్రం 6 గంటలకు లలిత సహస్రనామాలు జరుగుతాయని చెప్పారు. కావున ఆయా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించి బాబా వారి కృపకు పాత్రులు కావలసినదిగా లక్ష్మీనరసింహారావు ఒక ప్రకటనలో కోరారు.

# బిల్కిస్ బానో కేసు..

(మొదటిపేజీ తరువాయి)

న్యాయస్థానం శుక్రవారం ఈ పిటిషన్‌ను నిరాకరించింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం దీనిని పూర్తిగా తప్పుడు పిటిషన్‌గా పేర్కొంది. కోర్టులోని ఒక బెంచ్ జారీ చేసిన ఆర్డర్‌పై మరొక బెంచ్ ఎలా అప్పీల్ చేస్తారని ప్రశ్నించింది. కాగా దోషులు రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా, రాజుభాయ్ బాబులాల్ సోనీ పిటిషన్‌ను ఉపసంహరించు కోవడానికి అనుమతి కోరగా దానికి బెంచ్ అనుమతించింది. షా మధ్యంతర బెయిల్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో పెద్దఎత్తున చోటుచేసుకున్న మతపరమైన అల్లర్లలో బిల్కిస్ బానో కుటుంబానికి చెందిన ఏడుగురు సభ్యులు హత్యకు గురయ్యారు. 5 నెలల గర్భిణిగా ఉన్న బానోపై దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ కేసులో 11 మంది నిందితులకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2008లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 14 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్నవారికి 2022లో గుజరాత్ ప్రభుత్వం రెమిషన్ మంజూరు చేసింది. దీంతో 2022 ఆగస్టు 15న వారంతా జైలు నుంచి విడుదలయ్యారు. దీంతో గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బానో సుప్రీం తలుపుతట్టారు. గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపడుతూ.. వారి విడుదల చెల్లదని జనవరి 8న సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రెండు వారాల్లోగా జైలు అధికారుల వద్ద లొంగిపోవాలని ఆదే శించింది.

# ఎపికి మరో శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

వస్తుందనే విషయాన్ని పరిశీ లించిన తర్వాత సంతృప్త స్థాయిలో ఉంటే హాల్టింగ్ ను పొడిగిస్తారు. లేదంటే కేవలం ఆరు నెలలకు లేదంటే ఏడాది కాలం వరకు పరిమితం చేస్తారు. ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ లోపు దశలవారీగా హాల్టింగ్ సౌకర్యం ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఈ క్రింద పేర్కొన్న స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లను నిలుపుతారు. అలాగే ఆదాయంతోపాటు ప్రయాణికుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉంటే వీటిని అలాగే కొనసాగించడానికి అవకాశం ఉంది. దీనికి ఆయా ప్రాం తాల్లోని ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రజాప్రతినిధులతో రికమండేషన్ చేయించాల్సి ఉంటుం ది. ఏయే స్టేషన్లలో ఏ రైళ్లు ఆగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

# అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముందస్తు ప్రణాళికతో పనిచేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. చెరువులు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. గతంలో జరిగిన ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలతో గోదావరి కట్టలు బలహీన పడ్డాయని.. వాటిపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. విపత్తులు వచ్చినప్పుడే సమర్థత బయటపడుతుందని చెప్పారు. వాతావరణశాఖ హెచ్చరికలు, పరిస్థితులను అంచనా వేసి అప్రమత్తంగా వ్యవహరిస్తే నష్టాలను నివారించవచ్చని సూచించారు.

# 22 నుంచి ఎపి అసెంబ్లీ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

కాబోతోంది. అదే రోజు జరిగే బీఏసీ భేటీలో అసెంబ్లీ సమావేశాల అజెం డా, సభ ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఈ సమావేశాల్లోనే బడ్జెట్ పైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రంలో మరోసారి అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జూలై 22న సోమవారం అసెంబ్లీ సమావేశమవుతుంది. తొలి రోజు ఉదయం ఉభయసభల్ని ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత బీఏసీ భేటీ నిర్వహిస్తారు. ఇందులో ఓటాన్ అకౌంట్‌తో పాటు ఇతర అజెండా ఖరారు చేస్తున్నారు. మరోసారి రాష్ట్రంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు తగినంత సమయం లేకపోవడంతో రెండు నెలలకు ఓటాన్ అకౌంట్ తీసుకునే అవకాశాలున్నాయి. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై ఇవాళ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారులతో ఇవాళ భేటీ అయ్యారు. అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, అధికారులతో చర్చించారు. అనం తరం స్పీకర్, మండలి ఛైర్మన్ అధికారులతో సమావేశమై అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఇప్పటికే అసెంబ్లీ సమావేశాల్లో ఆంక్షలు తగ్గించేలా పలు ఆదేశాలు ఇచ్చారు. అలాగే ఈ సమావేశాల్లో కొత్త అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌గా సూర్యదేవర ప్రసన్నకుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు.

# విమాన సర్వీసులకు అంతరాయం

(మొదటిపేజీ తరువాయి)

ముంబై మరియు బెంగళూరు విమానాశ్రయాలలో విమానాలు షెడ్యూల్ కంటే ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ సాంకేతిక సమస్యల తర్వాత భారత ప్రభుత్వం మైక్రోసాఫ్ట్‌ను సంప్రదించింది. అనేక దేశాల ప్రభుత్వాలు అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేశాయి. స్పైస్‌జెట్, ఇండిగో,అకాసా ఎయిర్‌లైన్స్ కూడా ఇలాంటి సాంకేతిక సమస్యలను ఉదహరించాయి. ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు సర్వర్ సమస్యల కారణంగా సర్వీసులు నిలిచిపోయాయని చెబుతున్నాయి. తాజాగా ఈ సమస్య పరిష్కారమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సమస్య వల్ల విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ అంశంపై తాజాగా పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అంతరాయం వల్ల ప్రభావితమైన ప్రయాణికులకు నీరు, ఆహారం అందిస్తుందని మంత్రి తెలిపారు.ప్రయాణికుల పట్ల విమానాశ్రయ అధికారులు, విమానయాన సంస్థలు సానుభూతితో వ్యవహరించాలి. విమాన సర్వీసుల ఆలస్యం కారణంగా ప్రయాణికులకు అదనపు సీటింగ్, వాటర్, ఆహారాన్ని తప్పక అందించాలి. ప్రయాణీకుల సురక్షిత ప్రయాణం కోసం టెక్నికల్ టీమ్ కృషి చేస్తోంది. ఇలాంటి సమాయాల్లో ప్రయాణీకుల సహకారం కూడా తప్పకుండా అవసరం. టెక్నికల్ సమస్య, విమాన సర్వీసుల రాకపోకలపై ఎలాంటి అప్‌డేట్ ఉన్నా ప్రయాణీకులకు వెంటనే తెలియజేయాలి. విమానాశ్రయాల్లో ప్రయాణీకుల అవసరాల కోసం అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశాం. మైక్రోసాఫ్ట్ సంస్థతో అధికారులు టచ్‌లోనే ఉన్నారు. వీలైనంత త్వరగా మామూలు పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు.

# మద్యం అక్రమాలపై ముమ్మర దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)

నాటి ఉన్నతాధికారుల నుంచి వివరాలను సీఐడీ తీసుకుంటోంది. వాసుదేవరెడ్డి పాత్రపై సంచలన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీబీసీఎల్ ఎండీతో పాటు, డిస్టలరీల కమిషనర్‌గానూ వాసుదేవ రెడ్డికే గత ప్రభుత్వం బాధ్యతలు కట్టబెట్టింది. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్లక్కు పంపకుండా నిర్ణయాలు తీసుకునేలా వాసుదేవరెడ్డికే అధికారాలు ఇచ్చింది. ట్రాన్స్‌ఫర్లు చేయించేస్తానంటూ ఉన్నతాధికారులను బెదిరించారని వాసుదేవరెడ్డిపై ఆరోపణలు వచ్చాయి. మద్యం కొనుగోళ్లలోనూ భారీగా అవకతవకలకు వాసుదేవ రెడ్డి తెరలేపినట్లు తెలిసింది. ఒకే బ్రాండ్ మద్యాన్ని తెలంగాణ కంటే అధిక ధరకు కొనుగోలు చేసినట్టు విచారణలో సీఐడీ గుర్తించింది. ఒక్క వాసుదేవ రెడ్డి అవినీతే లెక్కలకు అందటం లేదని సీఐడీ అంటోంది. బినామీ పేర్లతో కొన్ని డిస్టిలరీల్లోకి వాసుదేవ రెడ్డి చొరబడినట్లు సీఐడీ పేర్కొంటోంది. కొన్ని మద్యం బ్రాండ్లను రాత్రికి రాత్రే తప్పించినట్లు గుర్తించింది. తక్కువ రేటు ఉన్న మద్యం బ్రాండ్లను గత సర్కారు గణనీయంగా తగ్గించేసినట్లు సీఐడీ గుర్తించింది. 2014-2019 మధ్యలో తక్కువ రేటు ఉన్న మద్యం బ్రాండ్లు 32 అందుబాటులో ఉంటే వాటిని రెండు బ్రాండ్లకే కుదించింది. . వాటిని అధిక ధరలకు విక్రయించి గత ప్రభుత్వం సొమ్ము చేసుకున్నట్లు సీఐడీ అధికారులు ఆరోపించారు. ప్రముఖ బ్రాండ్ల పేర్లతో పోలిన పేర్లు వచ్చేలా సొంత బ్రాండ్లను గత ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు సీఐడీ ఆరోపించింది. సొంత బ్రాండ్ల మద్యానికి అధిక ధరల ఎమ్మార్పీలను నిర్ధారించినట్లు సీఐడీ తెలిపింది. సబ్ లీజుల పేరుతో డిస్టిలరీలను జగన్ సన్నిహితులు కైవసం చేసుకున్నట్లు.. 11 డిస్టిలరీలను జగన్ అనుచరులు హస్తగతం చేసుకున్నట్టు విచారణలో గుర్తించినట్లు సీఐడీ ఆరోపించింది. హస్తగతం చేసుకున్న డిస్టిలరీల నుంచే 65 శాతం మేర మద్యాన్ని ఏపీలో కొనుగోళ్లకు వాసుదేవరెడ్డి అనుమతి ఇచ్చినట్లు తెలిపింది. 2014-19 మధ్య కాలం లో ఉన్న టాప్ 5 మద్యం బ్రాండ్ మద్యాన్ని 2019 తర్వాత కొనుగోళ్లు నిలిపివేశారని సీఐడీ పేర్కొంది. మద్యం ఆదాయాన్ని ఏపీ ఎస్డీసీకి రూ. 14,276 కోట్లు మళ్లించినట్టు గుర్తించింది.

# మోదీజీ ఉద్యోగాలు ఎక్కడ..?

(మొదటిపేజీ తరువాయి)

మోడీ 'ఒకదాని తరువాత ఒకటిగా అబద్ధం చెప్పడం' ద్వారా యువత 'పుండుపై కారం చల్లుతున్నారు' అని ఖర్గే ఆరోపించారు. గడచిన మూడు నాలుగు సంవత్సరాల్లో ఎనిమిది కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించడం నిరుద్యోగితపై తప్పుడు కథనాలు వ్యాప్తి చేసేవారి నోళ్లు 'మూతపడ్డాయి' అని ప్రధాని మోడీ క్రితం వారం ఉద్ఘాటించిన నేపథ్యంలో ఖర్గే ఈ విమర్శ చేశారు. ఉపాధి కల్పనపై ఆర్‌బిఐ ఇటీవల విడుదల చేసిన నివేదికను ప్రధాని ఉటంకిస్తూ, ఎన్‌డిఎ ప్రభుత్వం సుస్థిరత, వృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని నొక్కిచెప్పారు.చిన్న, పెద్ద స్థాయి మదుపరులు ఎన్‌డిఎ మూడవ హయాంను ఎంతో ఉత్సాహంతో స్వాగతించారని ఆయన తెలిపారు. 'నరేంద్ర మోడీజీ! ఉద్యోగాలపై ఒకదాని తరువాత ఒకటిగా అబద్దాలు చెబుతూ మీరు యువత పుండ్లపై కారం చల్లుతున్నారు' అని ఖర్గే 'ఎక్స్' పోస్ట్‌లో విమర్శించారు. 'అందుకే ఆర్‌బిఐ ప్రశ్నార్థక డేటాపై మిమ్మల్ని ప్రశ్నించాలని మేము అనుకుంటున్నాం/ మీరు పది సంవత్సరాల్లో 20 కోట్ల ఉద్యోగాలు వాగ్దానం చేసి 12 కోట్లకు పైగా ఉద్యోగాలను ఎందుకు పరిహరించారు?' అని ఖర్గే తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆర్‌బిఐ నివేదికకు ఆధారమైన ప్రభుత్వ పిఎల్‌ఎఫ్‌ఎస్ డేటా ప్రకారం పని చేసే మహిళల్లో 37 శాతం మందికి వేతనాల చెల్లింపులు జరగలేదన్నది నిజం కాదా అని ఖర్గే అడిగారు.

# జస్టిస్ రవీంద్రబాబు సేవలు ప్రసంశనీయం



(మొదటిపేజీ తరువాయి)

చేయనున్న నేపథ్యంలో శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ వీడ్కోలు కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయమూర్తి జస్టిస్ ఎవి రవీంద్రబాబు సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. 1962లో పూర్వపు ప్రకాశం జిల్లా అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన జస్టిస్ ఎవి రవీంద్రబాబు ప్రకాశం జిల్లాలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పిదప నెల్లూరు లోని విఆర్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ల్లో జూన్ 1988 లో న్యాయవాదిగా ఎన్రోల్ అయి చీరాల్లో శిక్షా స్మృతిలో లీడింగ్ లాయర్ అయిన లేటు ఎమ్.ఆర్.చౌధరి దగ్గర ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారన్నారు. తదుపరి వారి ప్రాక్టీసును అద్దంకి మార్చడం జరిగిందని, 1994 మే మాసంలో మున్సిఫ్ మెజిస్ట్రేట్‌గా ఎంపికై పలు ప్రాంతాల్లో పనిచేసి, 2005 లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది, 2012 లో డిస్ట్రిక్టు అండ్ సివిల్ జడ్జిగా నియమించబడ్డారన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో డిశంబరు 2021 రిజిస్ట్రారు జనరల్ గా నియామకానికి ముందు ప్రిన్సిఫల్ డిస్ట్రిక్టు జడ్జిగా పనిచేస్తూ ఆగస్టు 2022 న ఈ హైకోర్టులో జడ్జిగా పదోన్నతి పొంది న్యాయమూర్తిగా విశిష్ట సేవలందించారని ప్రశంసించారు. న్యాయ వృత్తిలో మూడు దశాబ్దాల పాటు సేవలు అందజేసిన వీరు ఎన్నో క్లిష్టమైన కేసులను ఎంతో సునాయాసంగా పరిష్కరించారన్నారు. చట్టాల అభివృద్దితో పలు కమిటీల్లో సభ్యులుగా పరిపాలనా వ్యవస్థను మెరుగుపర్చడంలో ఎంతగానో దోహద పడ్డారని అభినందించారు. న్యాయ సేవలో ఎనలేని అనుభవాన్ని గడించిన వీరు న్యాయాధికారులకు, భవిష్యత్ తరాల న్యాయవాదులకు, విద్యార్థులకు సూచనలు, సలహాలు మరియు మార్గదర్శకం చేసేలా పలు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. సిటింగ్ జడ్జిగా మాతో పనిచేసిన జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు మా కుటుంబ సభ్యులుగా ఎప్పటికీ మా హృదయాల్లో నిలిచిపోతారనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేస్తున్న న్యాయమూర్తి జస్టిస్ ఎవి రవీంద్రబాబు మాట్లాడుతూ న్యాయ మూర్తిగా తన కెరీర్ లో సహాయ సహాకారాలు అందించిన ప్రస్తుత ప్రధాన న్యాయ మూర్తితో పాటు పూర్వపు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయవాదులు,తన ఫేషీ అధికారులు,సిబ్బంది ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బెంచ్ లో సిటింగ్ జడ్జిగా నేడే చివరి రోజు అవుతున్న నేపథ్యంలో తీపి చేదు భావోద్వేగానికి గురవుతున్నట్లు తెలిపారు. క్రింద స్థాయి నుండి ఈ స్థాయికి చేరుకుని మూడు దశాబ్దాలకు పైబడి న్యాయ సేవలు అందజేసిన నా ప్రయాణం న్యాయ వ్యవస్థలో నేటితో ముగుస్తున్నద న్నారు.

ఈ హైకోర్టుతో నా బంధం 2021 జనవరి నుండి ప్రారం భం అయి అత్యల్ప సమయంలోనే ముగుస్తున్నది అనే విషయం ఏ మాత్రం ప్రధానం కాదని, మనం ఎంత క్రమ శిక్షణతో, అంకిత భావంతో నాణ్యమైన తీర్పులు వెలువరించామనే విషయమే ఎంతో ప్రధామైనదన్నారు. నా తీర్పులకు సంబందించిన కేసుల్లో 90 శాతం కేసులు ఎంతో పోటీ తత్వంతో కూడుకున్నవని, అన్నిస్థాయి పరిశీలనల్లో ఈ తీర్పులు చెక్కుచెదరకుండా నిలబడి నందుకు నాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. న్యాయమూర్తిగా ఎన్నో క్లిష్టమైన కేసులకు సంతృప్తి కర స్థాయిలో తీర్పులు ఇవ్వడం జరిగిందని, తీర్పు ఫలితాలను ఆశించకుండా బార్ సభ్యులు ఎంత గానో సహరించారని, ఇది ఎంతో శుభపరిణామని అభినం దించారు. పలు కారణాల వల్ల క్రిమినల్ కేసులు దీరకాలికంగా అపరిష్కృతంగా ఉండిపోతున్నాయని, వీటిని సాద్యమైనంత త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

సమాజాభివృద్ధి అనేది శాంతి భద్ర తలను సక్రమంగా నిర్వహించడం వల్లే సాద్యమ వుతుందనే విష యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సి ఉందన్నారు. ఆడ్వొకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్, హైకోర్టు బార్ అసోసి యేషన్ అధ్యక్షులు కె.చిదంబరం, ఎపి హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్. ద్వారకా నాథ్ రెడ్డి అడిషనల్ సొలిసిటర్ జనరల్ తది తరులు మాట్లాడుతూ జస్టిస్ ఎవి రవీంద్ర బాబు పలు క్రిమినల్ కేసు ల్లో స్పష్టమైన తీర్పు లు ఇవ్వడమే కాకుండా, సివిల్, క్రిమినల్ చట్టా లకు సంబంధించి అనేక అంశాల్లో చురుకైన పాత్రపోషించి న్యాయ వ్యవస్థకు మంచి సేవలు అందించారని కొనియాడారు.అత్యంత నిరాడంబరంగా జరిగిన ఈవీడ్కోలు కార్యక్రమంలో పలువురు హైకోర్టు న్యాయ మూర్తులు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణ రావు, పలువురు ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు,ఎపి లీగల్ సర్వీసెస్ అధా రిటీ,ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అరాచక పాలన..

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ధర్నాకు దిగుతామ న్నారు. ఏపీలో అరాచక పాలనకు నిరసనగా ధర్నా నిర్వహిస్తున్నట్లు మీడియాకు వెల్లడించారు. రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేస్తామని జగన్ చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పరిస్థితులు రాష్ట్రపతి పాలనకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. వినుకొండలో హత్యకు గురైన రషీద్ కుటుంబ సభ్యులను వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పిన ఆయన.. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చినప్పట్నుంచీ అరాచక పాలన రాజ్యమేలుతోందని ఆరోపించారు. హత్యలు, అరాచకాలు పెచ్చుమీరాయని షాకింగ్ కామెంట్స్ చేశారు.రషీద్ హత్యకేసుపై హైకోర్టులో కేసు వేస్తామన్నారు. రాజకీయ కక్షలతోనే రషీద్ హత్య జరిగిందని.. అయితే పోలీసులు మాత్రం వ్యక్తిగత కారణాలంటూ క్రియేట్ చేశారని ఆయన మండిపడ్డారు. పుంగనూరులో గురువారం నాడు ఎమ్మెల్యే, ఎంపీల పైనా రాళ్లు వేశారని మీడియాకు వివరించారు.'రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవు.. లా అండ్ ఆర్డర్ లేదు. తెలుగుదేశం వాళ్లు ఎవరినైనా కొట్టచ్చు.. చంపొచ్చా..? వాళ్లు ఏ అరాచకం చేసినా పోలీసులు పట్టించుకోరా..? పోలీసులు తిరిగి బాధితులపైనే కేసులు బనాయిస్తున్నారు.



# కృష్ణ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

○ ఎంపీని సత్కరించిన కృష్ణ అభిమానులు

**విజయవాడ, (గవర్నర్‌పేట) జూలై 19 (ఆంధ్రపత్రిక):** సూపర్‌స్టార్ కృష్ణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్లోని లెనిన్ పార్కులో ఏర్పాటు చేస్తున్న కృష్ణ కాంస్య విగ్రహ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిని ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాస్వామి కోరారు. సుధాస్వామి ఆధ్వర్యంలో కృష్ణ అభిమానులు శనివారం గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో కేశినేని చిన్నిని మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. పుష్పగుచ్చం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ సోదరుడు, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరావు పర్యవేక్షణలో లెనిన్ పార్కు వద్ద ఏర్పాటు చేస్తున్న కృష్ణ నిలువెత్తు విగ్రహం ఏర్పాట్లు గురించి అభిమానులు ఎంపీకి వివరించారు. దీనికి సంబంధించిన ఎలాంటి సహాయ సహకారాలు కావలసి వచ్చినా సహకరిస్తానని, పనులు త్వరగా పూర్తిచేయాలని అభిమానులకు ఎంపీ సూచించినట్లు సుధాస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు విజయ్, తరుణ్, సాయిచరణ్, వాసు, సత్యం, అప్పారావు, గోపీ, ప్రభాకర్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## 2047 విజన్ డాక్యుమెంట్

# రూపకల్పన





(మొదటిపేజీ తరువాయి)

చుట్టారు. వికసిత్ భారత్ తరహాలోనే ఇది ఉండనుంది. దాంట్లో భాగస్వామ్య మయ్యేలా 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రెండ్రోజుల క్రితం ఢిల్లీ పర్యటనలో భాగంగా విజన్ డాక్యుమెంటుపై నీతి అయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బేరీతో ముఖ్యమంత్రి 3గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంతో చంద్రబాబు సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఏపీ విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరచాల్సిన ముఖ్యమైన అంశాలను ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రతినిధులు కలిశారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రాజెక్టులపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తన గత అనుభవాలు, నిర్ణయాలు, వాటి ఫలితాలు, భవిష్యత్ ఆలోచనలను నీతి ఆయోగ్‌తో పంచుకున్నారు. దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించేందుకు ప్రత్యేకమైన ప్రణాళికలతో ఏపీ పనిచేస్తుందని సీఎం అన్నారు. పేదరికం లేని సమాజం, జనాభా సమతుల్యతపై కసరత్తు చేసి ప్రణాళికలు రూపొందిస్తాం. అన్ని రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అనుసంధానం చేస్తాం. రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీపై ఆలోచన చేస్తున్నాం. వ్యవసాయ రంగంలో కొత్త ఆవిష్కరణలు తీసుకొస్తాం. 15శాతం గ్రోత్ రేట్ సాధించడమే ఏపీ లక్ష్యం. అనుకున్న విధంగా గ్రోత్ రేట్ సాధిస్తే తలసరి ఆదాయం పెరుగుతుంది. పేదల జీవనం మెరుగవుతుంది. సంపద సృష్టి పాలసీలతో 2047 విజన్ డాక్యుమెంట్ ఉండాలి' అని సీఎం వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..' పేదరికం లేని సమాజం, జనాభా సమతుల్యతపై కసరత్తు చేసి ప్రణాళికలు రూపొందిస్తాం. అన్ని రంగాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనుసం ధానం చేస్తాం. ఏపీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నాం. వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్‌లో రాష్ట్రస్థాయి నుంచి కుటుంబస్థాయి వరకు ప్రణాళికలు రూపొందిస్తాం. వ్యవసాయ రంగంలో కొత్త ఆవిష్కరణలు తీసుకువస్తాం. అనుకున్న విధంగా గ్రోత్ రేట్ సాధిస్తే తలసరి ఆదాయం కూడా పెరిగి ప్రజల ఆర్థిక స్థితిగతులు మారతాయి. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ముఖ్యంగా పేదరిక నిర్మూలన దిశగా విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేస్తున్నాం. సంపద సృష్టి పాలసీలతో 2047 విజన్ డాక్యుమెంట్ ఉంటుంది' అని చెప్పారు.

# వాస్తవాలు మాట్లాడాలి

**అమరావతి,జూలై 19 (ఆంధ్రపత్రిక):** గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన హత్యను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తెలుగుదేశం పార్టీకి ఆపాదించడం సిగ్గుచేటని ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను రాజకీయం చేయడం ఆయనకే చెల్లుతుందని మంత్రి డోలా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలకు జగన్ రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అంటూ ఆయన ఎద్దేవా చేశారు. అయితే వినుకొండలో బుధవారం జరిగిన దారుణ హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ రోజు రాత్రి వైసీపీ నేత రషీద్‌ను జిలానీ అనే వ్యక్తి నడిరోడ్డుపై కత్తితో దాడి చేసి చంపేశాడు. దీనిపై ఇప్పటికే టీడీపీ, వైకాపా నేతల మధ్య వార్ నడుస్తోంది. దీనికి తోడు ఈ ఘటనపై మాజీ సీఎం జగన్ స్పందించడం అగ్నికి ఆద్యం పోసినట్లయింది. ఆయన బెంగళూరు పర్యటనను సైతం మధ్యలో ఆపేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించేందకు వినుకొండకు వచ్చారు. అయితే ఘటనపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన తప్పుపట్టడంపై మంత్రి డోలా ఆగ్రహం వ్యక్తం చేశారు. సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ..' ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించినా జగన్ మాత్రం తన బుద్ధి మార్చుకోలేదు. సొంత బాబాయి వైఎస్ వివేకానందరెడ్డిని సైతం చంపి నారాసుర రక్త చరిత్ర అంటూ పుస్తకం రాసి టీడీపీపై తప్పుడు ప్రచారాలు చేశారు. వినుకొండలో జరిగిన హత్యకు ముఖ్యకారకుడు జగనే. వైసీపీ హయాంలో హతుడు రషీద్, నిందితుడు జిలానీ మధ్య జరిగిన గొడవలపై అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే నేడు ఈ హత్య జరిగేదా?. ఆనాడు జగన్ చేసిన పాపానికి ఇవాళ ఓ వ్యక్తి తన నిండు ప్రాణాన్ని మూల్యంగా చెల్లించాల్సి వచ్చింది. జగన్ ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలి.

# అందరి చూపు కమలాహ్యారిస్ వైపు

**వాషింగ్టన్,జూలై 19 :** అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి.. ఓ వైపు దాడి తర్వాత మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో దూకుడుతో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.. మరోవైపు ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ కూడా ప్రచారాన్ని నిర్వహిస్తున్నప్పటికీ.. డెమోక్రాట్లలో ఆయన ఆరోగ్య పరిస్థితి పార్టీలో టెన్షన్ పుట్టిస్తోంది.. ఇలా అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ అధికార డెమోక్రాటిక్ పార్టీలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు, డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ తీరు, వ్యవహార శైలి పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. ఆయనను మార్చాలనే డిమాండ్లు సొంత పార్టీలోనే వెల్లువెత్తుతున్నాయి. బైడెన్‌కు ప్రత్యామ్నాయం కమలా హ్యారీస్ అన్న విషయం బాగా వినిపిస్తోంది. ఈ విషయాన్ని బైడెన్ వర్గాలు కూడా నిజమే అన్నట్లు తలూపుతున్నారు. దాదాపు చాలా మంది బైడెన్ కంటే కమలా హ్యారిస్ బెటర్ అంటూ పేర్కొంటుండటం సంచలనంగా మారింది..ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరపున జో బైడెన్ మరోసారి రేసులో పాల్గొనేందుకు ఆసక్తిగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇటీవల ఆయన మతిమరుపు సమస్యతో బాధపడుతున్నారు. పలుమార్లు సభల్లో వింతగా ప్రవర్తించారు. దీనికి తోడు ప్రత్యర్థి రిపబ్లికన్ నేత ట్రంప్..ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. దీంతో బైడెన్ కు వ్యతిరేకంగా డెమోక్రాట్లలో అసహనం వ్యక్తం అవుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై జో బైడెన్ పునరాలోచించాలని భావిస్తున్నట్లు మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తెలిపారు. బైడెన్ విజయావకాశాలు సన్నగిల్లినట్లు ఒబామా అంచనా వేస్తున్నారు. బైడెన్ తన అభ్యర్థిత్వాన్ని మరోసారి ఆలోచించాల్సి వస్తుందన్నారు. వాషింగ్టన్ పోస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒబామా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని తమ పార్టీ నేతలకు కూడా చెప్పినట్లు ఒబామా పేర్కొన్నారు. ఒబామా దేశాధ్యక్షుడిగా ఉన్న సమయంలో.. 2009 నుంచి 2017 వరకు జో బైడెన్ ఉపాధ్యక్షుడిగా చేశారు. ఈసారి రేసు నుంచి బైడెన్ తప్పుకోవాలని చాలా మంది డెమోక్రాట్లు అభిప్రాయ పడుతున్నారు. ఇక ఒబామా కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం. ప్రస్తుతం బైడెన్ కోవిడ్‌తో బాధపడుతున్నారు. ఆయన తన ఇంట్లోనే ఉన్నారు. కానీ తన వయసు, ఫిట్‌నెస్ విషయంలో వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. వైట్‌హౌజ్‌కు రేసులోనే ఉన్నట్లు కూడా వెల్లడించారు. గతవారం రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన డిబెట్‌లో బైడెన్ తడబడ్డారు. కొన్నిసార్లు అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామాలు డెమోక్రాట్లను కలవరానికి గురిచేస్తున్నాయి. రెండోసారి అమెరికా అధ్యక్షునిగా సర్వీస్ చేసేందుకు ఆయన సమర్థత సరిపోదనే మాట వినిపిస్తోంది. అంతేకాకుండా ఇటీవల న్యూస్ ఏజెన్సీలు జరిపిన సర్వేలు కూడా బైడెన్‌కు ప్రత్యామ్నాయం కమలా హరీస్ అని చెబుతున్నాయి. ఈ సర్వేల్లో ట్రంప్-బైడెన్ ఇద్దరి కంటే 6 పాయింట్ల ముందంజలో కమలా హరీస్ ఉన్నారట. డెమోక్రాట్లలోని 10మందిలో ఆరుగు కమలా హ్యారిస్ కు మద్దతు తెలపగా.. ఇద్దరు సూటవ్వరని.. మరో ఇద్దరు తెలియదని చెప్పినట్లు ఓ సర్వే తెలిపింది.. మెజారిటీ డెమొక్రాట్‌లు కమలా హరిస్ వైపు నిలుస్తుండటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.. ఈ క్రమంలోనే అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకోవాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించే సత్తా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు ఉందని పలువురు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు.

# ఎస్సీ ఎస్టీ కేసులకు అధిక ప్రాధాన్యత

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



బాపట్ల జులై 19 (ఆంధ్రపత్రిక) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అధికారులు అధిక ప్రాధాన్యతనిచ్చి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. గత సమా వేశంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై చర్చ జరిగింది. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచే యాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఏదైనా ఘటన జరగగానే ప్రాథ మిక విచాంణ చేయాలన్నారు. నిబంధనలను అనుసరించి తక్షణమే చార్జ్ షీట్ వేయాలన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణ మే స్పంది ంచాలన్నారు. వైద్య ధ్రువీకరణ పత్రాల జారీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం 47 కేసులకు నష్టపరిహారం అందిం చడానికి దస్త్రాలు సిద్ధం చేశామన్నారు. నిధులు విడుదల కాగానే నేరుగా బాధితులకు చేరుతాయన్నారు. అధిక నిధులు కావాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం 83 కేసులు విచారణలో ఉన్నాయన్నారు. భూమి కేటాయింపులు, ఉద్యోగం నియామకాలపై చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అట్రా సిటీ చట్టం కింద నమోదైన కేసులను సత్వరమే ఎలా పరిష్కరి ంచాలో అధికారులు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. స్మశా న భూములు లేని ఎస్సీ, ఎస్టీ గ్రామాలను గుర్తించాలన్నారు. ఏ గ్రామాలలో ఎంత భూమి అవసరత ఉందో, ఎంత భూమి కావా లనే అంశాలపై తక్షణ మే నివేదిక ఇవ్వాలని రెవిన్యూ అధికారులను ఆదేశి ంచారు. ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన స్మశానభూమి కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమలులో అడ్డంకు లను తొలగించేలా చూస్తామన్నారు. అద్దంకి గోవాడలో తక్షణమే స్మశాన భూమి కేటాయించాలన్నారు. మాదకద్రవ్యాలు నిరోధించడా నికి పోలీసు అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బాధితులకు భరోసా కల్పించే తక్షణమే సహాయ సహకారాలు అందించేలా చూస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. ఘటనలు జరిగిన ప్రాంతాలకు తక్షణమే పోలీసులు వెళ్లి విచారి ంచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చార్జిషీటు తక్షణమే నమోదు చేస్తామన్నారు. గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తామని చెప్పారు. ప్రజలలో సామా జిక చైతన్యం తీసుకువస్తామన్నారు. అట్రాసిటీ కేసులలో పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులం దరికీ న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు అన్నారు. కేసులలో ఎదురయ్యే సమస్యలన్నీ పరిష్కరి స్తామని వివరించారు. ఈ సమావేశంలో చీరాల శాసన సభ్యులు ఎం ఎం కొండయ్య, జిల్లా కమిటీ కన్వీనర్ రాజాదిబోరా, కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు, పి ప్రసాద్ రావు, టి సురేష్, జి రాజారావు, జి నాగమణి, అనుబంధశాఖల జిల్లా అధికారులు, ఆర్ డి ఓ లు, డిఎస్పీలు, తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ ధరకే బియ్యం కందిపప్పు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య



వేటపాలెం, జూలై 19 (ఆంధ్రపత్రిక): నిత్యవసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు తక్కువ ధరకే బియ్యం కందిపప్పు అందించే ఉద్దేశంతో వేటపాలెం గడియార స్తంభం సెంటర్లో స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య కేంద్రాన్ని ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి నిత్యావసర సరుకుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు ప్రజలకు అందుబాటులో తెచ్చే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రైస్ దాల్ మిల్లర్ అసోసియేషన్స్ లాభాలను తగ్గించుకొని తక్కువ ధరకు బియ్యం కందిపప్పు ఇవ్వటం అభినందనీయమన్నారు. ఎవరైనా సరే ఆధార్ కార్డు చూపించి బియ్యం కందిపప్పు కొనుగోలు చేయవచ్చు అని తెలిపారు. ఎక్కడైనా అక్రమ నిలువలు కృత్రిమ కొరత సృష్టిస్తే ఉక్కు పాదం మోపుతానని హెచ్చరించారు. ఈ కేంద్రంలో బియ్యం కిలో రూ. 49, ముడి బియ్యం కిలో రూ. 48, దేశి వాలి కందిపప్పు కిలో రూ. 160, చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేటపాలెం తహసిల్దార్ పి కృష్ణకాంత్, టిడిపి నాయకులు నాసిక వీరభద్రయ్య, పార్థసారధి, బాలకృష్ణ, సుభాని, షమీం, అందే శీను, శంకర్ తెలుగుదేశం,జనసేన,బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

# ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## ఉర్దూ భాష ప్రవీణులకు అపార అవకాశాలు - బాపట్ల జిల్లా ఉర్దూ రేంజ్ అధికారి నజ్మా ఖాతున్



బాపట్ల జులై 19 (ఆంధ్రపత్రిక) : ఇండో ఆర్యన్ భాషగా ఉర్దూ ఖ్యాతి గడించింది. భారతదేశంలోని 23 అధికార భాషల్లో ఉర్దూ ఒకటి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండవ అధికార భాషగా చలామణిలో ఉంది. 13వ శతాబ్దంలో ఉద్భవించిన ఉర్దూ భాషను నేడు 21 దేశాల ప్రజలు మాట్లాడుతున్నారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో పద్యాలు, కవితలు, గేయాలతో ప్రజల్లో చైతన్యం నింపి బ్రిటిష్ వారికి ముచ్చెమటలు పట్టేలా చేసిన భాష ఉర్దూ. హిందూ ధర్మ శాస్త్రాలు అయిన రామాయణం ,భగవద్గీత లు ఉర్దూ భాషలో తర్జుమా అయి మత సామరస్యం చాటుకున్న భాష ఉర్దూ. తియ్యటి గుభాలింపులు వెద జల్లుతూ శ్రావ్యత,స్పష్టతకు చిరునామా గా నిలిచింది. అలాంటి ఉర్దూ భాషాభివృద్ధికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల ఉర్దూ పాఠశాలల జిల్లా రేంజ్ ఇన్స్పెక్టర్ నజ్మా ఖాతూన్ అన్నారు." అధికారితో ఆంధ్రపత్రిక " కార్యక్రమం లో భాగం గా ఆమె పలు విషయాలు తెలిపారు.

**బాపట్ల జిల్లాలో తొంబై పాఠశాలల్లో ఉర్దూ బోధన :** బాపట్ల జిల్లాలో ఉర్దూ బోధన 90 పాఠశాలల్లో జరుగుతుందని నజ్మా ఖాతూన్ చెప్పారు. చిల్డ్రన్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో భాగంగా 2024 – 25 విద్యా సంవత్సరంలో 560 మంది విద్యార్థులను బడిలో చేర్పించడం జరిగిందన్నారు. ఆగస్టు వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లాలోని ఉర్దూ పాఠశాలలను ఇటీవల రాష్ట్ర పరిశీలకులు మల్లికార్జున్ పలు సందర్శించడం జరిగింది. ద్వి భాష పుస్తకాల ద్వారా పిల్లలకు సులువైన మార్గంలో భాష పై అవగాహన కల్పించి బోధన చేస్తున్నాము. ఈ పుస్తకాలను ప్రభుత్వము ప్రచురణ చేసి అందిస్తుంది. ఉర్దూ పాఠశాలల్లో ఉర్దూ తో పాటు అన్ని భాషలు సబ్జెక్టులు వారీగా బోధన ఉంటుంది. ఉర్దూ భాష నేర్చుకోవటం వలన అన్ని వర్గాల ప్రజలకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఏడాది ఎన్రోల్మెంట్ లో గత ఏడాది కన్నా చెప్పుకోదగ్గ పురోగతి ఉంది. జష్న్ ఏ తాలీమ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోజష్న్ ఏ తాలీమ్ కార్యక్రమం నిర్వహించాము.

జూన్ 13 నుంచి 29 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఉర్దూ పాఠశాలల పరిధిలో బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించడం జరిగింది. పిల్లల తల్లి దండ్రులకు చదువు యొక్క ప్రాముఖ్యత తెలియజేయడం ద్వారా పిల్లల నమోదు ప్రక్రియ విజయవంతం చేశాం. ప్రతి పాఠశాల పరిధిలో సమావేశాలు నిర్వహించాం. అలాగే ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశాం. కరపత్రాల ద్వారా మైనార్టీ వర్గంలో ఉన్నత శిఖరాలు చేరుకున్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, అబ్దుల్ కలాం, జాకీర్ హుస్సేన్ వంటి మహానుభావుల చరిత్ర తెలియజేయడం జరిగింది. వారి విజయ గాథలను వివరించి తల్లిదండ్రులకు ప్రేరణ కల్పించాము. ఈ కార్యక్రమం విజయవంతం అవడంలో ఉపాధ్యాయుల పాత్ర అభినందనీయం.

అప్రిసియేషన్ డే జష్న్ ఏ తాలీమ్ కార్యక్రమం విజయవంతం అయిన సందర్భంగా అప్రిసియేషన్ డే ఏర్పాటు చేసి విద్యార్థులకు పెయింటింగ్, డ్రాయింగ్, వ్యర్థ పదార్థాలు ఉపయోగించి బోధన, అభ్యసనకు ఉపయోగపడే వస్తువుల తయారీ పోటీలు నిర్వహించాము. విజేతలకు బహుమతులు అందించాం.

**ఉర్దూ భాషతో అపార అవకాశాలు:** ప్రస్తుత రోజుల్లో ఉర్దూ భాష అభ్యసించిన వారికి అపార అవకా శాలు ఉన్నాయి. ఉర్దూలో డిగ్రీ పీజీ చదివేందుకు గుంటూరు ఆంధ్ర ముస్లిం కళాశాలలో అవకాశం ఉంది. దూరవిద్య ద్వారా పీజీ కోర్సులు చదివేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ నేషనల్ యూనివర్సిటీల్లో చదవచ్చు. డిప్లమా, డైట్ కోర్సులు చేయాలంటే బోయపాలెంలో కళాశాలలో చేరవచ్చు. బీ ఈ డీ కోసం కనగాల రేపల్లెలో కళాశాలలు ఉన్నాయి. ఉర్దూ భాష అభివృద్ధి కోసం ప్రభుత్వం కళాశాలలు,పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు సమకూర్చుతుంది.

# విలువలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యం

## పొగడ దండ



చీరాల, జులై 19 (ఆంధ్రపత్రిక) : విలువలతో కూడిన విద్యను అందించి విద్యార్థులను వారి లక్ష్యాలను సాధించే విధంగా తీర్చిదిద్దటమే తమ కర్తవ్యం అని విఆర్ యస్ అండ్ వై ఆర్ ఎన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పొగడదండ రవికుమార్ అన్నారు. శుక్రవారం చీరా లలో వి ఆర్ యస్ అండ్ వై ఆర్ ఎన్ ఇంజనీ రింగ్ కళాశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యమని ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉచిత విద్యను అంది స్తామని చెప్పారు. కళాశాల మేనేజ్మెంట్ కోటలో ప్రతి సంవత్సరం 50 సీట్లు ప్రతిభ కలిగిన విద్యార్థులకు కేటాయిస్తామన్నారు. ప్రప ంచం సాంకేతిక అభివృద్ధిలో పరుగులు పెడుతుందని, అటువంటి ప్రపంచ స్థాయి విద్యను చీరాలలో కూడా అందిస్తామని తెలిపారు. ఐఐటీ అధ్యాపకులచే సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పడానికి గర్వపడుతున్నామని పేర్కొన్నారు. ఆపరేషన్ 2034 నిర్వహిస్తున్నామని వచ్చే ఏడాది నుంచి కేజీ టూ పీజీ విద్యను అందిస్తామని అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యం గా ముందుకు వెళుతున్నా మన్నారు. ప్రతిభ కలి గిన విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాక ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ యలమంచిలి గ్రూప్ ఆఫ్ కంపెనీల లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. చీరాల పరిసర ప్రాంతాలలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ కుర్చీలు బహుకరణ



అద్దంకి జూలై 19(ఆంధ్రపత్రిక):శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో, ఉన్నం శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి మనుమడు ఆహాన్ష్, మనుమరాలు రీతూష గార్ల సౌజన్యముతో, స్థానిక రోటరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అద్దంకి కొత్తపేటకు చెందిన పేద మహిళ కొల్లిపర లావణ్యకు కుట్టు మిషన్ అందచేశారు. రాజీవ్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 4 కుర్చీలు బహుకరించారు. రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ, కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసిన ఆహాన్ష్, రీతూషలను అభినందించారు. కుట్టుమిషన్ అందుకున్న లావణ్య మాట్లాడుతూ తనకు అడిగిన వెంటనే రోటరీక్లబ్ వారు మిషన్ అందించినందుకు రోటరీకి కృతజ్ఞతలు తెలిపారు. తమపాఠశాలకు కుర్చీలు ఇచ్చినందుకు హెడ్ మాస్టర్ కరి రామయ్య కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధికారి శ్రీమతి ఊటుకూరు ఉమాఅన్నపూర్ణ మాట్లాడుతూ మంచి సేవాకార్యక్రమాలు చేస్తున్న రోటరీ సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, పాస్ట్ ప్రెసిడెంట్ చిన్ని మురళీ కృష్ణ, పసుపులేటి ఆంజనేయులు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, డాక్టర్ దేవపాలన, జ్యోతి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల నుండి సమాచారం పొందవచ్చు



అద్దంకి జూలై 19 (ఆంధ్రపత్రిక): ఏ ప్రభుత్వ కార్యాలయం నుండైనా సమాచారాన్ని పొందే అధికారం పౌరులకు సమాచార హక్కు చట్టం కల్పించిందని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. సమాచార హక్కు చట్టం కమీషనర్ శ్రీ చావలి సునీల్ ఆదేశానుసారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం లో ముఖ్య అతిథి గా ప్రముఖ న్యాయవాది బత్తుల రామకోటయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అనేది పౌరుల చేతిలో పాశుపతాస్త్రం లాంటిదని,ప్రజలకు ఉపయోగపడే ప్రతి సమాచారాన్ని పొందే హక్కు ఈచట్టం కల్పించిందని తెలిపారు. దరఖాస్తుదారు కావలసిన సమాచారం 30 రోజులలో ఇవ్వాలని లేనిచో పై అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాని మండల విద్యాశాఖాధికారి గంగాధర్,డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి,పంచాయితీరాజ్ ఇంజనీర్ ఎల్.వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖాధికారి దీప్తి,వెలుగు ఏపిఎం కోటేశ్వరరావు,ఏపిఓ గాయత్రి లక్ష్మి,ఐసీడీఎస్ సూపర్వైజర్ రమాదేవి,టెక్నికల్ ఏ. ఓ మేరమ్మ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడా కారునికి సత్కారం



చీరాల, జులై 19 (ఆంధ్రపత్రిక) : ఇటీవల నేపాల్ లో జరిగిన ఇండోనేపాల్, ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ తైక్వాండో కరాటే పోటీ ఓల్లో బంగారు పతకం సాధించిన చీరాల కు చెందిన యువకుడు షైక్ కాలేష ను మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. చీరాల గంజి పాలెం లోని పీర్ల చావడి ఆవరణలో చీరాల శాఖ అధ్యక్షులు సయ్యద్ అమీర్, అధ్యక్షులు, షైక్ అల్లభక్షి,ఉపాధ్యక్షులు అబ్దుల్ ఘని, సెక్రటరీ షైక్ షౌకత్ అలీ , ట్రెజరర్ షైక్ ఇస్మాయిల్ లు శాలువా తో సత్కరించి, నగదు ప్రోత్సాహం అందచేశారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ కలేషా భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే ఒలంపిక్స్ స్థాయిలో రాణించి మాతృ భూమికి పేరు తేవాలని ఆశీర్వదించారు. మైనార్టీ వర్గాల అభ్యున్నతికి తాము ఎల్లపుడూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలో అభ్యసిస్తున్న పారిశుధ్య కార్మికుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి



అద్దంకి జూలై 19 (ఆంధ్రపత్రిక): ప్రైవేటు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న సఫాయి కార్మికులు (పారిశుధ్య కార్మికుల) పిల్లల కు స్కూల్ ఫీజులు 25 శాతం నుండి 50% వరకు రాయితీ ఇవ్వాలని బాపట్ల జిల్లా ఎస్సీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు నక్కా దెబోర సరళ తెలిపారు కమిటీ సమా వేశంలో జిల్లా కలెక్టర్ కి తెలపడం జరిగినదని .అద్దంకి మునిసిపాలిటీ ద్వారా పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు చాలా విలువైనవని వారి ద్వారానే ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తున్నారు కావునఅద్దంకి నగర పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో ఫీజు రాయితీని ఇప్పించాలని జిల్లా కమిటీ సమావేశంలో ఎస్సీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ నెంబరు దేబోరా సరళ కోరడం జరిగినది.

# ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలి



బాపట్ల జులై 19 (ఆంధ్రపత్రిక) :వర్షాలు అధికమై వరద వస్తే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కోరారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం కృష్ణా నది అరవింద వారధి, పెసర్లంక, చిలుమూరులంక, సుగ్గన లంక, పెద్దలంక, చింతర్లంక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. వరద ప్రమాదానికి గురయ్యే గ్రామాలలో ప్రజలతో మాట్లాడారు. గత అనుభవాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వరద ముంపు, విపత్తు రాకముందే ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు. లంక గ్రామాలలోని ప్రజలంతా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం విపత్తు నిర్వహణపై జిల్లా అధికారులతో కొల్లూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ అత్యవసర సమా వేశం నిర్వహించారు. ప్రజల ప్రాణాలు చాలా విలువైనవని, ఎవరికి ఎలాంటి హాని జరగరాదని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. కృష్ణానది లంక గ్రామాలకు ముంపు ఉన్నందు న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక వర్షాలు కురుస్తాయని ప్రకటనతో కృష్ణా నది ప్రకాశం బ్యారేజీలోకి వరద నీరు చేరితే దిగువకు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. నీరు అధికమైతే ఆరు లంక గ్రామాలలోని 14 ఆవాస ప్రాంతాలకు నీరు చేరుతాయన్నారు. ప్రస్తుతం 56 బోట్లు, 100 మంది గజ ఈతగాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఎన్ డి ఏ సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లంక గ్రామాల వద్ద పడిన గండి పూడ్చడానికి తాత్కాలిక, ప్రణాళిక శాశ్వత ప్రణాళికను రూపొందించి తక్షణమే నివేదిక పంపాలన్నారు. అధిక వర్షాలతో లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. అంటువ్యాధులు ప్రభల కుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విపత్తు నిర్వహణ సామగ్రి సమకూర్చుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే సమస్యలు తలెత్తకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను సిద్ధంగా ఉంచుకోవాల న్నారు. ఆయా గ్రామాలలో బ్లీచింగ్ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం జరగకుండా అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులకు అడ్డంగా చెట్లు కూలినా, గోడలు కూలిపోతే తక్షణమే తొలగించడానికి సహాయక చర్యలకు అవసరమైన యంత్రాలు మండల కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలన్నారు. సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించడానికి అవసరమైన వాహనాలు ముందుగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ కి 12 అడుగులకు వరద నీరు మించితే నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మొదటి హెచ్చరికగా భావించి గ్రామస్తులు బయటకు రావడానికి సిద్ధంగా ఉండి అధికారులకు సహకరించాలన్నారు. నీటి ప్రవాహం పెరిగే కొద్దీ లంక గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. వరద విపత్తు నేపథ్యంలో అనుబంధశాఖల అధికారులంతా అందుబాటులో ఉండాలన్నారు. పునరావాస కేంద్రాలలో మంచి భోజనం ఏర్పాటు చేయడానికి నిత్యవసర సరుకులు, గ్యాస్ సిలిండర్లు ముందుగా నిల్వ చేసుకోవాలన్నారు. అధికారులు అజాగ్రత్తతో ఉండరాదని హెచ్చరించారు. ఎక్కడ ఏ సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధారణ ప్రమాదాల నివారణ




చీరాల,జులై 19 (ఆంధ్రపత్రిక) : హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలనీ చీరాల బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి న్యాయవాది జీ కే. ఈశ్వరి రెడ్డి అన్నారు. శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థచీరాల ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట నారాయణ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సు లో ఆమె పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ దరించాలన్నారు. తద్వారా ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణాపాయ స్థితి నుంచి రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే భారీ జరిమానా ల లేకుండా ఉంటాయన్నారు. నూతన చట్టాల ప్రకారం హెల్మెట్ ధరించకపోతే భారీ జరిమానా విధిస్తారు అన్నారు. ఐ ఎస్ ఐ మార్క్ ఉన్న హెల్మెట్ మాత్రమే వినియోగించాలన్నారు. హెల్మెట్ లేకుండా ప్రాణాలు కోల్పోయిన సందర్భాల గురించి విద్యార్థులకు వివరించారు.

మైనర్లు డ్రైవింగ్ చేయటం,బైక్ రేసులు ,ట్రిపుల్ రైడింగ్ ,డ్రంక్ అండ్ డ్రైవ్ల ,సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపటం, తదితరాలు నేరాలు. కావున వాటి నుండి దూరంగా ఉండాలని తెలిపారు. యువత చట్టా నికి అనుగుణంగా ప్రవర్తిస్తూ,క్రమశిక్షణతో మెలగాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బీ.రామారావు,సోషల్ వర్కర్, పీ ఎల్ వి .ఎస్. డీ. మతిన్,పాటశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలసిన సమాజవాది పార్టీ సభ్యులు



బాపట్ల జులై 19 (ఆంధ్రపత్రిక) :బాపట్ల జిల్లాకు బదిలీపై వచ్చిన కలెక్టర్ జే వెంకట మురళి ని బాపట్ల సమాజ వాది పార్టీ సభ్యులు కలిశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ బి సుబ్బారావు, సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ తుషార్ డూడి కలిసి మర్యాద పూర్వకంగా శాలువా పూల మాలలు వేసి శుభాకంక్షలు తెలిపారు. అలాగేమున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా అధ్యక్షుడు గొర్ల .శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్ల అభ్యుద్ధికి,ప్రజల సంక్షేమానికి అధికారులకు పూర్తి స్థాయిలో తాము తోడ్పాటు అందిస్తామన్నారు. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా అభివృద్ధి పదంలో నడిచే విధంగా విద్యాపరంగా ప్రముఖ కేంద్రంగా విలసిల్లుతున్న బాపట్ల ను ఉపాధి కేంద్రంగా వ్యాప్తి చెందటానికి కృషి చేయవలసిందిగా కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సమాజవాది పార్టీ నాయకులు విలియం బూత్ కళాశాల ప్రిన్సిపల్ దాసరి శ్యామ్ లివింగ్ స్టన్ సీనియర్ అడ్వకేట్ లంబు సాంబయ్య అధ్యాపకులు మోర్ల చిన వెంకటేశ్వరరావు కంద్రూ శరత్ కుమార్ వ్యాపారస్తులు కొమ్మనబోయిన ఫణింద్ర బోయిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మొండిగేటు రైల్వే అండర్ డ్రైన్ కాలువ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి

## తూర్పు నియోజకర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్



**గుంటూరు : జులై 19( ఆంధ్రపత్రిక ):** గుంటూరు తూర్పు నియోజకవర్గానికి అత్యవసరంగా ఉన్న మొండిగేటు రైల్వే అండర్ డ్రైన్ కాలువ బ్రిడ్జి వెడల్పు నిర్మాణాన్ని వెంటనే చేపట్టటానికి తగు చర్యలు తీసుకోవాలని గుంటూరు తూర్పు శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ ని కోరారు. శుక్రవారం గుంటూరు పట్టాభిపురంలోని డిఆర్ఎం ఆఫీసులో మర్యాద పూర్వకంగా డివిజనల్ రైల్వే మేనేజర్ రామకృష్ణని కలిశారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం లోని 70% ఏరియా డ్రైనేజీ మొత్తం ఈ మొండి గేటు రైల్వే అండర్ బ్రిడ్జి నుండి పారుదల అవుతుందని, ఈ బ్రిడ్జి వెడల్పు లేకపోవడం వలన మురికి నీరు వెనకకు తన్నుతున్నందువల్ల ఈ బ్రిడ్జిని వెడల్పు చేసి నూతనంగా నిర్మించవలసిన అవసరం ఉందని దీనికి అవసమైన 9 కోట్ల రూపాయలను సగం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వారు, మిగిలిన సగం రైల్వే వారు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నసీర్ కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన డిఆర్ఎమ్ ప్రతిపాదనలు రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్, సికింద్రాబాద్ వారికి పంపి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# గుంటూరుకు ప్రపంచ స్థాయి ఫర్నిచర్‌ను తీసుకువచ్చిన రాయల్‌ఓక్ ఫర్నిచర్

## ఆకర్షణీయమైన ఫర్నిచర్ సొల్యూషన్స్ కోసం కస్టమర్ డిమాండ్‌ను కొత్త స్టోర్ తీర్చనుంది






**గుంటూరు : జులై 19( ఆంధ్రపత్రిక ):** భారతదేశంలోని ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ అయిన రాయల్ ఓక్ ఫర్నిచర్, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో తమ కొత్త స్టోర్‌ను ప్రారంభించింది. ఈ స్టోర్ వినియోగదారుల సంపూర్ణ ఫర్నిచర్ అవసరాలకు ఏకీకృత పరిష్కారంగా రూపొందించబడింది. కస్టమర్‌లు తమ కలల ఇంటిని సులభంగా సృష్టించుకోవడానికి అంతిమ గమ్యస్థానంగా ఇది ఉపయోగపడుతుంది. ఈ స్టోర్ ప్రారంభం, ఆంధ్రప్రదేశ్‌లో బ్రాండ్ యొక్క 15వ స్టోర్‌గా గుర్తించబడింది, ఇది గుంటూరు నివాసితులకు అద్భుతమైన అంతర్జాతీయ ఫర్నిచర్ ను ఎంచుకునే అవకాశం అందించటంతో పాటుగా తమ ఇళ్లను మరింత ఆకర్షణీయంగా మార్చుకునే అవకాశాన్ని అందిస్తుంది. రాయల్ ఓక్ ఫర్నిచర్ ఈ ప్రాంతంలో విలాసవంతమైన ఫర్నిచర్ కు పర్యాయ పదంగా మారింది. ఈ కొత్త స్టోర్ కస్టమర్‌లు తమ నివాస ప్రాంగణాలను సమూలంగా మార్చడానికి ఒక ప్రత్యేక మార్గంగా ఉపయోగపడుతుంది. దాదాపు 16,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్‌లోని ప్రతి అంతస్తు బ్రాండ్ యొక్క ట్రేడ్‌మార్క్ కంట్రీ కలెక్షన్‌కు అనుగుణంగా రూపొందించబడింది, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫర్నిచర్ అద్భుతాలను అందిస్తుంది. సందర్శకులు బ్రాండ్ యొక్క మలేషియా, ఇటాలియన్, అమెరికన్ మరియు ఎంపరర్ కలెక్షన్‌ల ద్వారా ప్రపంచాన్ని చుట్టవచ్చు, ఇది ఎలాంటి ఇంటిని అయినా సమున్నతం చేయడానికి ఫర్నిచర్ మరియు హెూమ్ డెకర్‌ల యొక్క వినూత్నమైన సింఫొనీని ఖచ్చితంగా అందిస్తుంది. కొత్తగా ప్రారంభించబడిన స్టోర్ గుంటూరు నివాసితులకు సరసమైన ధరలలో హై-ఎండ్ ఫర్నిచర్ పీస్‌ల.ద్వారా లగ్జరీ ప్రపంచాన్ని అన్వేషించడానికి సరైన అవకాశాన్ని అందిస్తుంది. ఈ స్టోర్ 10,000ం ఫర్నిచర్ పీస్ లను అందిస్తుంది, రిక్లైనర్లు మరియు లివింగ్ రూమ్ కోసం కాఫీ టేబుల్‌లు, స్టడీ టేబుల్‌లు మరియు అంతిమ కార్యస్థలాన్ని సృష్టించడానికి ఆఫీసు కుర్చీలు, విశ్రాంతిగా నిద్రించడానికి బెడ్‌లు మరియు పరుపులు మరియు పెరటి అందాలను మార్చడానికి అవుట్‌డోర్ ఫర్నిచర్ ఉంటాయి. గ్లోబల్ ట్రెండ్‌ల నుండి స్ఫూర్తిని పొందడం ద్వారా, బ్రాండ్ కస్టమర్‌లు తమ ఇళ్లను పునర్నిర్మించడానికి మరియు వాటిని వ్యక్తిగత ప్రాంగణాలుగా మార్చడానికి ప్రేరేపించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రారంభోత్సవం గురించి రాయల్ ఓక్ ఫర్నిచర్ చైర్మన్ విజయ సుబ్రమణ్యం మాట్లాడుతూ, "గుంటూరు వాసులకు హై-ఎండ్ ఫర్నిచర్ పీస్ లను పరిచయం చేయడం మాకు చాలా ఆనందంగా ఉంది. ఈ స్టోర్ మా కస్టమర్‌లకు అత్యుత్తమ మరియు అత్యంత విలాసవంతమైన ఆఫర్‌లను అందించాలనే మా ప్రయత్నాలను సూచిస్తుంది. గుంటూరు నుండి వచ్చే సందర్శకులందరూ స్టోర్‌లోని మా కంట్రీ కలెక్షన్ ద్వారా ప్రపంచాన్ని కనుగొంటారని మరియు వారి కలల గృహాలను వాస్తవంగా మార్చుకుంటారని మేము ఆశిస్తున్నాము. అంతేకాకుండా, ఫర్నిచర్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి మరియు దేశవ్యాప్తంగా ఉన్న మా వినియోగదారులందరికీ సేవలందించడానికి స్టోర్ మమ్మల్ని మరింత దగ్గర చేస్తుంది.." అని అన్నారు. గుంటూరులో జరిగిన ఈ నూతన ప్రారంభోత్సవం దేశంలోని ప్రతి మూలకూ, నాణ్యమైన, ప్రపంచవ్యాప్తంగా ప్రేరేపితమైన ఫర్నిచర్‌ను తీసుకురావడానికి బ్రాండ్ ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుంది.

# గత వైకాపా ప్రభుత్వం పెట్టిన అక్రమకేసులను త్వరితగతిన విచారణ చేసి తొలగించాలి

## గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ



**అమరావతి : జులై 19( ఆంధ్రపత్రిక ):** రాష్ట్రంలో యువజన విద్యార్థి నేతలతో పాటు అమరావతి రైతులు, నల్లమడ రైతులతో పాటు ప్రజాసంఘాలు మీడియా అధినేతలు సోషల్ మీడియా కార్యకర్తల పైన గత వైకాపా ప్రభుత్వం పెట్టిన అక్రమకేసులను త్వరితగతిన విచారణ చేసి తొలగించాలని, ఓడిపోయాక మీడియా యాజమాన్యాల పైన బెదిరింపులకు పాలపడుతున్న వైకాపా ముఖ్యనాయకులు అడ్డుకట్ట వెయ్యాలని ఎపి డిజిపి ద్వారకా తిరుమల రావుని గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ కోరారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సి హెచ్ ద్వారకా తిరుమల రావుని గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ మంగళగిరి లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని డిజిపి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా రావిపాటి సాయి కృష్ణ మాట్లాడుతూ గడచిన అయిదు సంవత్సరాల కాలంలో వైకాపా ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ తెలుగుదేశం - జనసేన కార్యకర్తలతో పాటు యువత విద్యార్థులు నిరుద్యోగులు, అమరావతి రైతులతో పాటు నల్లమడ రైతాంగం, వివిధ ప్రజాసంఘాల నాయకులపైనా సామజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టారంటూ ఎపి సిఐడి తో ఎన్నో అక్రమ కేసులు వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఈ క్రమంలో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, యువనేత మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, హెూమ్ మంత్రి వంగలపూడి అనిత పర్యవేక్షణలో రాష్ట్రంలో టిడిపి జనసేన కార్యకర్తలతో పాటు యువజన విద్యార్థి నిరుద్యోగులు అమరావతి రైతులు, నల్లమడ రైతులతో పాటు ప్రజాసంఘాలు మీడియా ప్రతినిధుల సోషల్ మీడియా కార్యకర్తల పైన పెట్టిన అక్రమ కేసులను త్వరిత గతిన తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎందరో యువత విద్యార్థులు ఉన్నత చదువులకి విదేశాలకు వెళ్లకుండా కేసులు అడ్డంకిగా మారటంతో పాటు వారి భవిష్యత్ అయోమయానికి గురి అవుతున్నారని తెలియజేసారు. ఇందుకు డిజిపి ద్వారకా తిరుమల రావు సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ప్రభుత్వంతో చర్చించి అక్రమ కేసులు తొలగింపు దిశగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు.

# ఫేక్ వార్తలు ఫేక్ ప్రచారలతో రాష్ట్ర ప్రజల్లో విద్వేషాలు సృష్టించేందుకు జగన్ రెడ్డి కుట్ర

## తూర్పు నియోజకర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్



**గుంటూరు : జులై 19( ఆంధ్రపత్రిక ):** ఫేక్ వార్తలు ఫేక్ ప్రచారలతో రాష్ట్ర ప్రజల్లో విద్వేషాలు సృష్టించేందుకు జగన్ రెడ్డి రోజుకొక కుట్ర చేస్తున్నాడు అని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ అన్నారు. గుంటూరు నగరం తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు వారి కార్యాలయం నందు శాసన సభ్యులు నసీర్ మాట్లాడుతూ జగన్ రెడ్డి మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మా ప్రభుత్వం మీద అబద్ధాలు అసత్య ఆరోపణలు చేయడం వైసీపీ వారికి అజెండాగా మారిందన్నారు. గిరిజన మహిళను వైసీపీ నేత విజయసాయిరెడ్డి వంచించిన విషయం సాక్షాధారం తో సహా బట్ట బయలైనందువల్ల ఈ అంశాన్ని పక్కదారి పట్టించెందుకు వినుకొండలో వైసీపీ కార్యకర్తల అంతర్గత వివాదాన్ని మా పార్టీపై నెట్టేందుకు జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నారు. నిన్న పల్నాడు జిల్లా వినుకొండలో ఇద్దరు మైనార్టీ సోదరుల జిలాని, రషీద్ ల మధ్య జరిగిన వివాదంలో ఒకరు బలయితే దానిని కూడా తెలుగుదేశం పార్టీ పై నెట్టే కుట్రలు చేస్తున్నారన్నారు. మృతుడు రషిదు హంతకుడు జిలాని వీరి ఇరువురు గతంలో వైసీపీ పార్టీకి చెందిన వారేనని గుర్తు చేశారు. గత ఏడాది తొలి ఏకాదశి రోజున వినుకొండలో వీరి మధ్య తలెత్తిన వివాదం అన్నారు. రషీద్ వల్ల వేధింపులకు గురవుతూ జిలాని హంతకుడుగా మారాడని వారిరువురు మధ్య ఉన్న గొడవలు వల్ల జరిగిన హత్యకు ఈ సంఘటనకు రాజకీయ రంగు పులవటం దుర్మార్గమన్నారు. జగన్ శవ రాజకీయాలు చేయటం వైసీపీ పార్టీ కార్యకర్తల మధ్య వ్యక్తిగత వ్యవహారం వినుకొండలో జరిగిన హత్య కారణమైతే బెంగళూరు నుండి వినుకొండ కి హడావుడిగా వచ్చి ఇక్కడ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయటం సరికాదన్నరు. అబద్ధాలు అసత్యాలు అవినీతి కలిపితే జగన్ రెడ్డి అన్నా విషయం వినుకొండ సంఘటన ద్వారా మరోసారి స్పష్టమైనది అన్నారు. కర్నూలు జిల్లాలో అబ్దుల్ సలాం కుటుంబం బలం మరణానికి కారణం వైసీపీ నేతలు కాదా అని అడిగారు. నరసరావుపేటలో మసీదు స్థలం కాపాడటానికి ప్రయత్నించిన మైనారిటీ నేత ఇబ్రహీంను నడిరోడ్డుపై గొంతు కోసి చంపిన వైసీపీ నేతలను కాపాడింది తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు కాదా అని గుర్తు చేశారు. గడిచిన 5 ఏళ్ల పాలనలో సుమారు 18 మందికి పైగా మైనార్టీల సోదరులను హతమార్చి వారి ఆస్తులను వైసిపి నేతలు కబ్జా చేశారన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు 11 సీట్లకి వైసీపీ నేతలను పరిమితం చేశారని అయినా జగన్ సైకో ప్రవర్తన మారలేదన్నారు. కూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డి అండ్ కో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. వైసీపీ నేతల కల్లబొల్లి మాటలు నమ్మొద్దు అని అన్నారు రాష్ట్ర ప్రజలు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి చిట్టి బాబు ఉన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు , జులై 19( ఆంధ్రపత్రిక ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు డివిజన్ లలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. శుక్రవారం 33వ డివిజన్ లోని "బ్రాడీపేట 4/18 నుండి 4/19" ప్రధాన రోడ్డులోని సైడ్ కాలువల నిర్మాణానికి 50 లక్షల రూపాయల అంచనాలు,అదే విధముగా ఆరండల్ పేట 10/3 లైన్ నుండి రవీంద్ర నాథ్ ఠాగూర్ విగ్రహం వరకు సిసి రోడ్డు, సైడ్ కాలువల పనులు ప్రారంభించనున్నారు. ఈ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ బ్రాడీపేట గుంటూరు నగరానికి తల మానికము అని, అటువంటి ప్రధాన రహదారిలో సైడ్ డ్రైన్లు లేక మురుగు నీరు రోడ్డు మీద పారటం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని, గతంలో ప్రతిపక్ష పార్టీలు గెలిచిన చోట్ల అభివృద్ధి పనులు జరిగేవి కాదని, ఆ సంస్కృతికి చరమగీతం పాడుతూ నేడు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను సమభావంతో చూస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని గళ్ళా మాధవి తెలిపారు.

అరండల్ పేటలోని ఠాగూర్ విగ్రహ ప్రాంత ములో ప్రధాన కాలువ మధ్యలో విధ్యుత్ స్తంభము ఉండటం వలన మురుగునీరు పారటానికి ఆటంకం ఏర్పడి, మురుగు నీరు రోడ్డు పై ప్రవహించటాన్ని శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే గమనించి, దీనిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోపూరి నరేంద్ర, శ్రీవల్లి, ఈరెంటి వర ప్రసాద్, కసుకుర్తి హనుమంతరావు, మరిపాటి శ్రీను,కిట్టు, వజ్జా రామకృష్ణ, గుర్రం మల్లేశ్వరి మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కష్టపడిన వారికి కచ్చితంగా టీడీపీలో తగిన గుర్తింపు ఉంటుంది

## శాలివాహన నాయకుడు ఈమని బాలుతో పల్లా శ్రీనివాస్



**గుంటూరు, జులై 19(ఆంధ్రపత్రిక):** టీడీపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ని శుక్రవారం తన కార్యాలయంలో శాలివాహన రాష్ట్ర నాయకుడు ఈమని బాలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అధ్యక్ష పదవికి అన్ని విధాల అర్హులు పల్లా శ్రీనివాస్ అని మరియు ప్రభుత్వం ప్రగతి పథంలో దూసుకువెళుతున్న వేళ రాజధానిలో శరవేగంగా పనులు జరుగుతున్నాయి అని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలాగే టిడిపి జెండాని గత పదేళ్లుగా మోస్తూ ఉన్న మాలాంటి యువకులకి తగిన న్యాయం చేయాలని పల్లా శ్రీనివాస్ తో వివరించడం జరిగింది.

అని ఈమని బాలు విలేకరుల సమావేశంలో తెలియజేసారు. యువ నాయకుడు నారా లోకేష్ మరియు సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి సమస్యని పరిష్కరిస్తున్న విధానం చాలా ఆనందదాయకమని అందులోనూ ప్రజలకి మరియు కార్యకర్తలకు అందుబాటులో ఉండటం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. అలాగే టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కష్టపడిన వారికి కచ్చితంగా ఈ పార్టీలో తగిన గుర్తింపు జరుగుతుందని తొందరలోనే అది నెరవేరుతుందని తెలియజేసారు.

# వేటపాలెంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

**వేటపాలెం, జులై 19(ఆంధ్రపత్రిక):** నేడు వేటపాలెం మండల కార్యాలయం ఆవరణలోని ఐసీడీఎస్ సమావేశ మందిరంలో సమాచార హక్కు పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.కాశీ విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని అన్నారు. ఈ సదస్సులో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.కావున రైతులు,ఆయా శాఖల అధికారులు,ప్రజలు పాల్గొనాలని కోరారు.

# నేడు బాపట్లలో సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు

**బాపట్ల, జులై 19( ఆంధ్రపత్రిక ):** నేడు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి చంద్ర శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ అవగాహన సదస్సులో సమాచార చట్టం పై చర్చ జరుగుతుందన్నారు.కావున మండలంలోని అధికారులు,రైతులు,ప్రజలు పాల్గొనాలని కోరారు.ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుంది అన్నారు.

# వివాలో ఐక్యరాజ్య సమితి నమూనా సదస్సు




**గుంటూరు , జులై 19( ఆంధ్రపత్రిక ) :** అంతర్జాతీమ వ్యవహారరాలపై అవగాహన మరియు నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి చెందేలా వివా ది స్కూల్ విద్యార్థులు నిర్వహిస్తున్న మోడల్ యునైటెడ్ నేషన్ ఐక్యరాజ్యసమితి నమూనా కార్యక్రమం ప్రారంబోత్సవానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు కృష్ణదేవరాయులు హాజరుకాగా, గౌరవ అతిథులుగా ఎమ్మెల్సీ కె. లక్ష్మణరావు, జార?ండ్ రాష్ట్ర రిటైర్డ్ డీజిపి మండవ విష్ణువర్ధన్ రావు, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ హాజరయ్యారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ పాఠశాలలనుండి 360 మంది విద్యార్థులు పాల్గొని ఐక్యరాజ్యసమితిలో భాగమైన ప్రతినిధుల సభ, భద్రత మండలి, సచివాలయం, అంతర్జాతీయ న్యాయస్థానం, ఆర్థిక సాంఘీక మండలి సభ్యులుగా ఏర్పడి చర్చించనున్నారు. ఈ సంధర్బంగా పార్లమెంటు సభ్యులు లావు కృష్ణదేవ రాయులు మాట్టడుతూ మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సు నిర్వహణ వలన భావితరాల వారికి ప్రపంచ దేశాలు ఎదుర్కుంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు తెలుస్తాయని తద్వారా భావి నాయకులుగా, పరిణితి చెందిన పౌరులుగా ఎదుగుతారని అన్నారు. భారతదేశం శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక, పరిశోధనారంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతూ, ఐక్యరాజ్యసమితిలో కీలక భూమిక పోషించే స్థాయికి ఎదుగుతుందన్న అశాభావం వ్యక్తపరిచారు.

ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులను అభినందించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లడుతూ 1945లో ఏర్పడిన ఐక్యరాజ్య సమితిలో 193 దేశాలు భాగస్వామ్యం అయ్యాయని అందులో కీలకమైన భద్రతా మండలిలో ఐదు దేశాలు మాత్రమే శాశ్వత సభ్యులుగా ఉన్నారనీ భద్రతా మండలి సభ్యులను పెంచి దానిలో భారతదేశానికి శాశ్వత సభ్యత్వం కల్పించాలని విద్యార్థులు చర్చించాలని సూచించారు. వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ విద్యార్థుల సమిష్టి కృషి ద్వారా అద్భుతాలు సృష్టించగలుగుతారన్న విషయాన్ని ఈ కార్యక్రమం ద్వారా నిరూపిస్తున్నారని అన్నారు. ఇతర పాఠశాలలనుండి వచ్చిన విద్యార్థులకు స్వాగతం పలికారు. యమ్.యూ.ఎస్ సంధానకర్తలు ఋషి రాజ్, రణవీర్ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్ కమాండర్ కె.ఎస్.రావు, ప్రిన్సిపాల్ సిహెచ్. సరళ, మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# నగరంలో పూడిక తీత జరగని ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలి



**గుంటూరు , జులై 19( ఆంధ్రపత్రిక ) :** నగరంలో పూడిక తీత జరగని ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన తీయించాలని, తీసిన పూడికను ఎప్పటికప్పుడు తరలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ కెవిపి కాలనీ, పట్టాభిపురం, స్తంభాల గరువు, భాగ్య నగర్, తుఫాన్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం, డ్రైన్లలో పూడికతీత పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే అన్ని ప్రాంతాల్లోని డ్రైన్లలో పూడికతీత పనులకు అవసరమైన టెండర్లు ప్రక్రియ పూర్తి అయిందని, ఎక్కువ ప్రాంతాల్లో పూడికతీత పనులు కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. కాని కొన్ని ప్రాంతాల్లో పూడిక తీత పనుల్లో జాప్యం జరుగుతుందని, సదరు జాప్యం వలన వర్షాలకు డ్రైన్లు పొంగి ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. కనుక ఇంజినీరింగ్ అధికారులు తక్షణం పూడికతీత పనులు చేపట్టపాలన్నారు. భాగ్య నగర్ ప్రాంతంలో కచ్చా డ్రైన్ పూడిక తీయక పోవడం పై ఏఈ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే పనులు చేపట్టాలన్నారు. అలాగే స్థానిక ప్రజల నుండి పారిశుధ్యం పై అందిన ఫిర్యాదుల మేరకు ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ ద్వారా అంతర్గత డ్రైన్లను శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ని ఆదేశించారు. పట్టాభిపురం మెయిన్ రోడ్ సెంట్రల్ డివైడర్ వెంబడి మట్టి ఉండడం గమనించి, ప్రతి రోజు శుభ్రం చేయాలని శానిటరీ సూపర్వైజర్ ని ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య పనుల పర్యవేక్షణ స్పెషల్ అధికారులు ప్రతి రోజు ఉదయం 5:30 గంటల నుండి తమకు కేటాయించిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పారిశుధ్యం పై ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అధికారి వైర్ లెస్ సెట్ వినియోగించాలన్నారు. పర్యటనలో స్పెషల్ అధికారులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# జులై 22 నుంచి అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం





**బాపట్ల, జులై 19( ఆంధ్రపత్రిక ):** కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం జాతీయ విద్యావిధానం 2020 ప్రవేశపెట్టి 4 వ వార్షికోత్స వం సందర్భంగా జూలై 22 నుంచి 28 వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశా లల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు, కార్యక్రమ నోడల్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. దేశవ్యాప్తంగా జరుపు కుంటున్న ఈ వేడుకల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. దీనిలో భాగంగా బాపట్ల జిల్లా వ్యాప్తంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్ర శిక్ష ఏ పీ సీ ఏం. వీ.సుధాకర్, ఏ ఎం వో డాక్టర్ బీ.మోసెస్ లు అన్నారు.ఈ సందర్భంగా వారు ప్రకటన విడుదల చేశారు.జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై , దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేసే దిశగా ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు భాగస్వా మ్యం కావాలని కోరారు.శిక్షా సప్తాహ్ కార్యక్రమం వారం రోజులు జరుగుతుంది. 22 ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామాగ్రి తయారు చేసి ప్రదర్శించటం.23 పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు అవగాహన కల్పించడం.జూలై 24 క్రీడా దినోత్సవం- విద్యార్థులతో క్రీడలు, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేసేందుకు క్రీడా పోటీలను నిర్వహించడం. 25 సాంస్కృతిక దినోత్సవం: విద్యార్థుల్లో భిన్నత్వం లో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం. 26 సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం స్కిల్ డిజిటల్ ఇనిషియేటివ్ డే గా నిర్వహించాలి.ప్రస్తుత ఉద్యోగావకాశాల నేపథ్యంలో అన్ని తరగతి గది అనుభవాలను మెరుగుపరచడానికి డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం.నైపుణ్య విద్య, సమర్థమైన పోటీతత్వ వర్క్ ఫోర్స్‌ను నిర్మించడం.విద్యలో సాంకేతికత దివస్. 27 పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు పాఠశాలలో పోషణ దినోత్సవ నిర్వహణ. న్యూట్రిషన్ డే .పాఠశాలల్లో కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం కార్యక్రమం కింద కనీసం 35 మొక్కలు తల్లి బిడ్డల తో కలిసి నాటించడం. 28 సామాజిక భాగస్వామ్య దినోత్సవం.విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లి దండ్రుల కమిటీలు , తల్లిదండ్రులు ఉపాధ్యాయ సంఘాలతో సహకారాన్ని పెంపొందించడం మరియు నైపుణ్యాభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను అందించడం పుట్టిన రోజులు ప్రత్యేక సందర్భాలలో తిథి భోజనాలు పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం నిర్వహించాలి అన్నారు.ఈ కార్యక్రమాలకు సంబంధించి కార్య నిర్వహణ, అమలు పరచే విధి విధానాలకు జిల్లా విద్యాశాఖాధికారులకు, సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్లను బాధ్యులుగా గుర్తించామన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో శిక్షా సప్తహ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బీ.శ్రీనివాసరావు కోరారు.

## ములకల్లంక శ్రీరంగపట్నంలో

# కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

### వరద ఉధృతిపై కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే బత్తుల పరిశీలన







**కోరుకొండ, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** గోదావరి వరద ఉధృతి దృష్ట్యా జిల్లా అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా వారికి కేటాయించిన విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులకు సూచించారు. శుక్రవారం గోదావరి మధ్య లో ఉన్న ములకల్లంకను స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఆర్డీవో చైత్రవర్షిణి ములకల్లంకలో పర్యటించి, స్థానిక ప్రజలతో మాట్లాడారు. తొలుత బొబ్బిల్లంక రేవు నుంచి బోటులో ములకల్లంక చేరుకున్నారు. గోదావరి వరద ఉధృక్తంగా ఉన్నందున గ్రామం విడిచి రావాలని స్థానిక ప్రజలను కలెక్టర్ కోరారు. త్రాగునీరు, విద్యుత్ సరఫరాలో ఏమైనా ఇబ్బం దులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఏసహకారం ఆశిస్తున్నారని స్థానిక ప్రజలను కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ, గోదావరి వరద పెరిగితే మర పడవలపై ప్రయాణం నిలిపి వేస్తామని, బోటులను ఏర్పాటు చేస్తామన్నారు. త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు సూచించడం జరిగిందన్నారు. శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ అధికారులకు ఆదేశించామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, రెవిన్యూ, మండల పరిషత్, ఆర్ డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఫిషరీస్, విద్యుత్ శాఖాధికారులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రాంతంలో పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే పశువులకు ప్రభుత్వం నుంచి వచ్చే దాణా అందిస్తామన్నారు. అవసరమైతే వైద్యారోగ్యశాఖ ఆద్వర్యంలో వైద్యశిభిరాలు ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ధవలేశ్వరం బ్యారేజ్ నుండి 4.2 లక్షల క్యూసెక్కుల వరకు క్రిందికి విడుదల చేయడం జరిగిందని, గోదావరిలో 10 లక్షల క్యూసెక్కుల నీరు ఉంటే ఫస్ట్ వార్నింగ్ కు ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే జిల్లాలో ఎర్రకాలువ వరద ఉధృతి ఎక్కువగా ఉందని, రెండవ ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేయడం జరిగిందన్నారు. ఎర్రకాలువ వరద ఉధృతి కారణంగా నిడదవోలు, నల్లజర్ల మండలాల్లో కొన్ని గ్రామాలు ముంపు ప్రభావితం అయ్యాయన్నారు.

ఇప్పటివరకు జిల్లాలో మూడు వేల ఎకరాలు వరకు 25 రోజులు గల వరి ముంపుకు గురైనట్లు తెలిపారు. వరద ఉధృతి కారణంగా రాకపోకలు లేని గ్రామాల్లో ప్రజలను రిలీఫ్ క్యాంపు లకు తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రిలీఫ్ క్యాం పుల్లో వసతులను ఏర్పాటు చేసే దశగా చర్యలు చేపట్టామన్నారు. వరద ప్రభావితం ఉన్న కొన్ని గ్రామాల్లోని పశువులను ముందుగానే గుర్తించి సురక్షిత ప్రదేశాలకు తీసుకురావడం జరిగిందన్నారు. వరద ప్రభావిత ప్రాం తాల్లో పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్రాగునీరు విద్యుత్తుపై ఎటువంటి సమస్యలు లేకుండా నిరంతర పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్ కలెక్టరేట్ ఏర్పాటు చేశామని, ఎవరైనా సమస్యపై ఫోన్ చేసిన వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్ లోతట్టు ప్రాంతాల్లోని గోదావరి వరద ఉధృతి నిరంతర పర్యవేక్షణ కు గాను నాలుగు బృందాలు నియమించడం జరిగిందని వీరు నిరంతరం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లా డుతూ, గోదావరి వరద ఉధృతి దృష్ట్యా ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి సమస్య ఉన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే బలరామకృష్ణ బురద కాలువ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసం దర్భంగా రైతులతో, గ్రామస్తులతో మాట్లా డారు. బురద కాలువలు వెడల్పు చేయాలని స్థానికులు కోరారు. ఈకార్యక రమంలో ఆర్డీఓ ఏ చైత్రవర్షిణి, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, ఆయా మండలాల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణ కార్యక్రమం విజయవంతం కావాలి

### భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదు- అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి: కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి శనివారం జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పర్యవేక్షణ నేపథ్యంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, మేయర్ హరి వెంకట కుమారితో కలిసి శుక్రవారం కలెక్టర్ పర్యటించారు. లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున సింహగిరిపై క్యూలైన్లు, ఆలయ ప్రదక్షిణ కోసం ఏర్పాటు చేసిన ర్యాంపులు, కొబ్బరి కాయలు కొట్టే ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం వంటి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలన్నారు. భక్తులకు దర్శనం ఇచ్చే నీలాద్రి గుమ్మాన్ని ఈఓ కలెక్టర్ కి చూపించి ఏర్పాట్లను వివరించారు. ఆలయ ఉత్తర ద్వారం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు వర్షానికి కారిపోతుండడాన్ని గమనించిన కలెక్టర్ ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు.

వర్షం కారణంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. క్యూ లైన్లలో బురద లేకుండా చూడాలని చెప్పారు. వచ్చే భక్తులకు అర్ధమయ్యేలా దారిపొడవునా సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం పటిష్టంగా ఉండాలని, భక్తులకు ఎప్పటికప్పుడు సమాచా రాన్ని అందేలా చూడాలని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూం వద్ద అధికారులు కూడా సమాచారం తెలుసుకునే ఏర్పాటు చేయాలని ఇందుకోసం ప్రత్యేకంగా ఫోన్ నంబర్ ఉండేలా చూడాలని కలెక్టర్ చెప్పారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో మెట్ల మార్గంలోని పరిస్థితిని ఈఓ కలెక్టర్ కి తెలియజేశారు. భారీ వర్షం వచ్చి మెట్ల పైనుంచి వరద వచ్చేలా ఉంటే భక్తులు రాకపోకలు నిలిపేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం ఉన్నప్పటికీ ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదని చెప్పారు. కొండ దిగువ ఏర్పాట్లను వేగవంతం చేయాలని తెలిపారు.

కొన్ని చోట్ల షామియానాలు చెదిరిపోవడాన్ని గమనించిన కలెక్టర్ వాటిని సరిచేయడంతో పాటు వర్షానికి భక్తులు తడవకుండా తగిన ఏర్పాట్లుచేయాలని అన్నారు.

సింహగిరి ప్రదక్షిణ ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం సిద్ధం చేసిన ప్రణాళికను పరిశీలించిన ఆయన అధికారులు బాధ్యతగా వ్యవహరించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆలయ ఈఓ ఎస్. శ్రీనివాసమూర్తి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సార్వమతస్తులు ఐకమత్యంతో ఉండేందుకు క్రైస్తవ జెఏసి దోహదం



**కొత్తపేట, జులై 19 (ఆంధ్రపత్రిక):** హిందూ,ముస్లిం,క్రైస్తవులు అందరూ ఐఖ్యమత్యంతో మెలగాలనే దృడ సంకల్పంతో కొత్తపేట నియోజకవర్గ క్రైస్తవ జాయింట్ యాక్షన్ కమిటీ పనిచేస్తుందని రావులపాలెం లిటిల్ ఫ్లాక్ లూథ రన్ చర్చ్ చైర్మన్ కప్పల వరప్రసాద్(సి.ఆర్) అన్నారు. శుక్రవా రం లిటిల్ ఫ్లాక్ లూథరన్ చర్చ్ లో కప్పల వరప్రసాద్ ఆధ్వర్యంలో జెఏసి అధ్యక్షుడు ఎన్ డేవిడ్ రాజ్ అధ్యక్షతన కొత్త పేట నియోజకవర్గం క్రైస్తవ జాయి ంట్ యాక్షన్ కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కప్పల వరప్రసాద్ మాట్లాడుతూ గత శనివారం రావులపాలెం,ఊబలంక మధ్యగల రోడ్డులో బ్రదర్ సత్యా ఆధ్వర్యంలో క్రైస్తవ సువార్త ప్రకటించడం జరిగిందని,ఈ క్రమంలో హిందూ మత సామరస్యం దెబ్బతిన్న కారణం చేత సువార్త ఏర్పాటుచేసిన బ్రదర్ సత్యని వివరణ కోరటం జరిగిం దని,రెండవ శనివారం సందర్భంగా సెలవు దినం కావడంతో ఏర్పాటు చేసిన సువార్త మాత్రమే తప్పు ఉద్దేశ్యపూర్వ కంగా చేసినది కాదని కొత్తపేట నియోజకవర్గ జెఏసి కి గాని స్థానిక సంఘ నాయకులకు గానీ క్రైస్తవ సంఘాలకు గాని ఏ విధమైన సంబంధం లేదని తెలియ చేయడం జరిగిందన్నారు. తెలియక నావల్ల జరిగినదని ఈ విషయమై ఇకముందు ఎన్నడూ హిందూమత సంప్రదాయాలకు ఏ విధమైన ఆటంకం కలగ కుండా ఇలాంటివి జరగకుండా జాగ్రత్తగా ఉంటానని తెలిపార న్నారు. మతసామరస్యానికి విఘాతం కలగకుండా అందరి మనో భావాలను గౌరవించేటట్లు మెలగాలని నాలుగు మండలాల ఉన్న క్రైస్తవులకు పిలుపు నిచ్చారు. రానున్న కాలంలో మనందరం హిందూ, ముస్లిం క్రైస్త వులం దరూ భారత పౌరులుగా అన్నద మ్ములుగా మెలుగుతూ ఒకరికి ఒకరు అభ్యంతరకరంగా కాకుండా, సామరస్యంగా కలిసి మెలిసి ఉండుటకు సహకరిం చవలసిందిగా కోరారు.

ఈ సమావేశంలో జెఏసి ప్రెసిడెంట్ -రెవ.ఎన్ డేవిడ్ రాజ్ వైస్ ప్రెసిడెంట్ డా.ఎమ్ విలియండాసన్న సెక్రెటరీ,బిషప్ అడపా ప్రసాద్,జా. సెక్రటరీ. బండి కాంత రాజ్, ట్రెజరర్. వై. ఆనంద రాజ్, కన్వీనర్. యస్. సుదర్శన్,కె. బర్నబాస్, కె. డామియాన్ ఇశ్రాయేలు, ఎలిషారాజ్, ఆర్. అరుణ్ కుమార్ డి. సామ్యూల్, ఎం. ఏదిద్య దేవదాస్, బ్రదర్ సత్య తదితరులు పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో వ్యాస జయంతి



**గోకవరం, జూలై 19 (ఆంధ్రపత్రిక) :** గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి ఉపాధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, కొత్తపల్లి రాము ఆధ్వర్యంలో వ్యాస జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈకా ర్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయిబాబా మాట్లాడుతూ, ప్రపంచంలో ఉన్న అన్ని గ్రంథముల కంటే అతిపెద్ద గ్రంథమైన మహాభారతాన్ని అతి పురాతనమైన పురాణ విద్యను దేశ కాలమానములకు అతీతమైన సమస్త విజ్ఞాన వాంగ్మయాన్ని మానవాళికి ప్రసాదించిన మహా మహితాత్ముడు పుణ్య శ్లోకుడు వ్యాసమహర్షని కావున ప్రతి పల్లెలో వ్యాస జయంతి జరుపుకోవడం మానవజాతి ప్రధాన కర్తవ్యమని అన్నారు. ఈకార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు అక్షింతల రాజా, ప్రధాన కార్యదర్శి దోసపాటి సుబ్బారావు, పిల్లం గోరు పాపారావు, వలసాల చెన్నారావు, కొరిపిల్లి అప్పలస్వామి, కాండ్రేగుల కుమార్, మార్నీడి రంగబాబు, గుర్రాల వెంకటేశ్వర రావు, బత్తుల కొండ, ముప్పిడిశెట్టి సూర్యనారాయణ, అరవల రాజు, కొత్తపల్లి సూర్యనారాయణ, పచ్చిపులుసు సాయి, ఉంగరా ల సత్యనారాయణ, కొత్తపల్లి ప్రసాదు, నల్లల సంతోష్, యవ్వా కుల నరసింహారావు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### వి.ఎం.ఆర్.డి.ఏ కమీషనర్ రవీంద్ర




**విశాఖపట్నం, జులై 19 (ఆంధ్రపత్రిక):** విఎంఆర్డిఏ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రాజెక్టు పనులు త్వరతగతిన పూర్తి చేయాలని, విఎంఆర్డిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ రవీంద్ర సంబంధిత అధికా రులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సాంకేతిక విభాగం సమీక్ష సమావేశంలో కమీషనర్ రవీంద్ర మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న మల్టీలెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్ట్, ఎన్ఏడి ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ వంతెన, ఎండాడ, చీమలాపల్లి నిర్మి స్తున్న కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి సాద్య మైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వహక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వహక ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోడగలీ కులస్థులు కుల ధ్రువీకరణకు దరఖాస్తు చేసుకోండి

### తహసీల్దార్ రమణారావు



**రావికమతం జూలై 19 (ఆంధ్రపత్రిక):** గొడ గలి కులస్థులు కుల ధ్రువీకరణ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తాసిల్దార్ రమణా రావు తెలిపారు. ఎస్సీ సబ్ కాస్ట్ అయిన గోడ గలి కులస్తులు కుల ధ్రువీకరణ కోసం ఆన్లైన్లో దరఖాస్తు ఆప్షన్ లేకపోవడంపై ఈనెల 12న మండలంలో కొత్త కోటకు చెందిన ఈ కులస్థులు తాసి ల్దార్ కార్యాలయం ఎదుట ఆం దోళన నిర్వహించారు. 20 23 వరకు రావికమతం తాసిల్దార్ కుల ధ్రువీకరణాలు జారీ చేశారని వీటిని రెన్యూవల్ కు సచివా లయానికి దరఖాస్తుకు వెళ్ళగా ఈ కులానికి సంబంధించిన ఆప్షన్ ఆన్లైన్లో లేద ని దరఖాస్తు తీసుకోలే మని సచివాలయ సిబ్బంది నిరాక రించారు. గత్యంతరం లేక తాహ సిల్దార్ కార్యాలయం ముందు ఆం దోళన నిర్వహించారు. ఈ మేరకు స్పందించిన తాహసిల్దార్ గొడ గలి కుల స్తులను వెంటబెట్టుకొని ఈనెల 12 న నర్సీపట్నం ఆర్డీవో కార్యాల యానికి వెళ్లి ఎదుర్కొంటున్న సమస్యను ఆర్డీవో జయరాం కు వివ రించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి వీలైనంత త్వరలో పరిష్క రిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 19వ తేదీ నుంచి మండలంలో అన్ని సచివాలయాల్లో గొడ గలి కులస్తులు దరఖాస్తుకు వీలుగా ఆప్షన్ను నమోదు చేయించా రు. ఈ అవకాశాన్ని సద్వి ని యోపరుచుకోవాలని తాహసిల్దార్ కోరారు.

## కిడ్నీ క్యాన్సర్‌కు రోబోటిక్ సర్జరీ చేసిన మెడికవర్ వైద్యులు




**విశాఖపట్నం, జులై 19 ఆంధ్రపత్రిక):** కిడ్నీ క్యాన్సర్ తో బాధపడుతున్న ఒక పేషెంటుకు మెడికవర్ ఆసుపత్రి వైద్యులు రోబోటిక్ సర్జరీ చేసి ప్రాణాలను కాపాడారు. ఒడిస్సాలోని రాయగడకు చెందిన 70 ఏళ్ల రోగి క్రియాటినిన్ స్థాయి 3.8 ఎంజి డీఎల్ తో దీర్ఘకాలిక మూత్రపిండ వైఫల్యంతో బాధపడుతూ విశాఖలో ఉన్న మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ భాస్కర్ ని సంప్రదించారు. అతన్ని పరీక్షించిన డాక్టర్ తగిన పరీక్షలు నిర్వహించి, అతనికి ఎడమ కిడ్నీ దిగువ భాగంలో 10 సెం.మీ పెద్ద కిడ్నీ కణితిని గుర్తించారు . అటువంటి రోగులలో, సాధారణంగా మొత్తం మూత్రపిండం తొలగించబడతుంది. అయితే, డాక్టర్ కార్తీక్ చంద్ర రోబోటిక్ పార్షియల్ నెఫ్రెక్టమీ అని పిలిచే ఒక ప్రత్యేకమైన శస్త్రచికిత్సను నిర్వహించారు. చిన్న కోతతో రోబోటిక్ పరికరాలతో సంక్లిష్టమైన ఈ యొక్క ప్రక్రియను చేయగలిగారు, ఇందులో చిన్న మార్జిన్‌తో కణితిని మాత్రమే తొలగించి, మిగి లిన కిడ్నీని రక్షించారు. ఇది మూత్రపిండాల రక్తనాళాలను తాత్కాలికంగా బిగించి, కిడ్నీ నుండి కణితి ని తొలగించి, 20 నిమిషాల వ్యవధిలో జాగ్రత్తగా తిరిగి మూసివేయడం జరిగింది. ఈ ప్రక్రియలో రక్త నష్టం చాలా తక్కువగా ఉంది. రక్తమార్పిడి అవసరం లేదు. రోగి శస్త్రచికిత్స తర్వాత రోజు కూడా నడవగలిగాడు. చాలా తక్కువ నొప్పి అతను త్వరగా కోలుకున్నాడు. మూత్రపిండాల వైఫల్యం స్థిరీకరించబడింది. శస్త్రచికిత్స తర్వాత క్రియేటినిన్ స్థిరంగా ఉందని, రోగికి డయాలసిస్ కూడా అవసరంరాలేని వైద్యుల తెలిపారు. తనకు సర్జరీ చేసి కాపాడిన మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యానికి , వైద్యులకు ధన్యవాదములు తెలిపారు.

## రిజర్వాయర్ వద్ద అప్రమత్తంగా ఉండాలి

### తహసిల్దార్ రమణారావు



**రావికమతం జూలై 19 (ఆంధ్రపత్రిక):** కళ్యాణపు లోవ రిజర్వాయర్ వద్ద ఇరిగేష న్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమణారావు ఆదేశించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణం గా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో రిజ ర్వాయర్ ను శుక్రవారం తాసిల్దార్ రమణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ ఏ ఈ సత్యనారాయణ దోరను ప్రస్తుతం రిజర్వాయర్ లోని నీటి పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 460 అడుగులు కాగా ప్రస్తుతం 458.8 0 అడుగుల వద్దకు నీటిమట్టం చేరుకుందన్నారు. ఇన్ ఫ్లో 100 క్యూసెక్కులు ఉందని ఏఈ వివరించారు వర్ష తీవ్రత ఎక్కువైన పక్షంలో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని సమీక్షించాలని సూచించారు. ప్రమాద స్థాయికి చేరుకున్న ఎడల రిజర్వాయర్ గేట్లు ఎత్తి నదిలోకి నీరు విడుదల చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 48వ వార్డు ఇందిరా నగర్‌లో వర్షాలకు కూలిన గోడ

### కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు సహాయక చర్యలు




**విశాఖపట్నం, జులై 19 (ఆంధ్రపత్రిక):** గ్రేటర్ విశాఖ పట్నం మున్సిపల్ కార్పొరేషన్ 48వ వార్డు పరిధిలో విశాఖలో కురుస్తున్న వర్షాలకు కొండ వాలు ప్రాంతం ఇందిరా నగర్ -3 ప్రాంతంలో ఓ ఇంటికి అనుకోని ఉన్న గోడ కూలిపోయింది. ఆ వార్డ్ బీజేపీ కార్పొరేటర్ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు అక్కడకు చేరు కున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పై నుంచి లోతట్టు ప్రాంతాలకు నీటి ప్రవాహం అధికమైం దనీ వీటి వలన గోడ కూలిందని స్థానికులు తెలిపారు. వర్షాల వల్ల ఇబ్బందికర సంఘటనలను ఎదుర్కొంటున్న ఇండ్లలో ఉన్న ప్రజలను చుట్టూ ప్రక్కల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని గంకల కవిత అప్పారావు అప్రమత్తం చేసారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘ టనలు జరగకుండా ముందు జాగ్రత్తతో వ్యవహరించేలా చూడాలని అధికారులను కోరారు. వర్షం ముప్పు తగ్గగానే యుద్ధ ప్రాతిపదికన గోడ నిర్మాణం చేస్తామని గంకల కవిత అప్పారావు హామీ ఇచ్చారు.

## డ్రైయిన్ల నిర్మాణానికి విజ్ఞప్తి

**విజయవాడ,జులై 19 (ఆంధ్రపత్రిక):** స్థానిక 23వ డివిజన్లో పలు వీధుల్లో 50 సంవత్సరాల క్రితం భూగర్భ డ్రైనేజీ వేశారని, వాటికి సమాం తరం కొత్త లైన్లు వేయాలని తెదేపా ఫ్లోర్డర్ నెల్లిబండ్ల బాల స్వామి గురువారం ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. పాత లైన్లు కావడంతో ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదని, మురుగునీరు పొంగి పొర్లుతోందన్నారు. ఆకుల వారివీధి, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, చిలుకు దుర్గయ్య వీధి, విష్ణు వర్ధనరావు వీధి వెంకటరత్నం వీధి, చలసాని వెంకటకృష్ణయ్య ,దాసరి వారి వీధి,చెరుకు పల్లివారి వీధి, మోడ్రన్ సూపర్ మార్కెట్ ఎదురు ప్రకాశం రోడ్‌లో మ్యాన్ హోల్ కట్టవలేను, ఎన్.సుబ్బారావు హాస్పిటల్ వీధి, తదితర ప్రాంతాల్లో రెండో లైను వేయాలని కోరారు. దీనిపై స్పందించిన బొండా ఉమా చర్యలు తీసుకోవాలని ఈఈ శ్రీనివాసరావుకు ఫోన్ చేసి చెప్పారు.

## బజాజ్ ఆటో పల్సర్‌లో 400 సీసీ బైక్ ఆవిష్కరణ




**విజయవాడ, జులై 19 (ఆంధ్రపత్రిక):** అధునాతన టెక్నాలజీతో రూపొందించిన బజాజ్ ఆటో పల్సర్‌లో 400 సీసీ బైక్‌ను ఆంధ్ర లయోలా ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ జోజిరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బజాజ్ ఆటో లిమిటెడ్ సేల్స్ మేనేజర్ సదత్ బాషా మాట్లాడుతూ, ఈ వాహనంలో 4స్ట్రోక్ లిక్విడ్ కూల్డ్, ఫ్యూయల్ ఇంజక్షన్ సిస్టమ్, 40 హార్స్ పవర్, 35 ఎన్.ఎం. టార్క్ అందించగల, 6-స్పీడ్ గేర్ బాక్స్ ఉన్నాయని తెలిపారు. అలాగే కొత్త పల్సర్‌లో 3డిడెకాల్, డిజిటల్ బ్లూ టూత్ కాల్ మేనేజ్‌మెంట్, యూఎస్బీ ఛార్జింగ్ పోర్ట్, నోటిఫికేషన్స్ వంటి ఫీచర్స్ ఉన్నాయని తెలిపారు. దీని ఎక్స్ షోరూం ధర రూ.1,84,998గా నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో వరుణ్ బజాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో కంట్రోల్ రూములు ఏర్పాటు

### కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం, జులై 19 (ఆంధ్రపత్రిక):** జిల్లాలో గత రెండు రోజు లుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ విభా గంలో తుఫాను కంట్రోల్ రూములను ఏర్పాటుచేసినట్లు కలక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 0891 - 2590102, 0891 - 2590100 ఫోన్ నంబర్లతో పని చేస్తుం దని కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ల ద్వారా తుఫాన్ పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు పొందవచ్చని, అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని తాజా పరిస్థితులను తెలియజేయ వచ్చని అన్నారు.



## ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆకస్మాత్తుగా తనిఖీ

**విద్యార్థినిలకు మెను సక్రమంగా అమలు చెయ్యాలి**

**అరుకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం.మత్య లింగం**



**డుంబ్రిగుడ, జూలై 29 (ఆంధ్రపత్రిక):**మండల కేంద్రం పరిధిగల జామగూడ ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలలో శుక్రవారం స్థానిక అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం.మత్య లింగం పాఠశాలలో సందర్శించి ఆకస్మాత్తుగా తనిఖీ నిర్వహించారు. ఆ పాఠశాలలో అభ్యసిస్తున్న ఆరు ఏడు తరగతి విద్యార్థినిలకు తెలుగు పాఠ్యాంశం పుస్తకం తీసి చదువమని చెప్పడం తో విద్యార్థినిలు చదవకుండా తడబడడంతో పాఠశాల నిర్వహకులపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వంట సాలలో సందర్శించి మెనూ ప్రకారం విద్యార్థినులకు సక్రమంగా భోజనాలు పెడుతున్నారా లేదా అరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలకు ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాల రికార్డులను క్షణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా రోజువారి ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల హాజరు రికార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల జిల్లా ప్రదేశిక సభ్యులు చట్టారి. జానకమ్మ, వైసిపి ముఖ్య నాయకులు కే. అశోక్, పి. నరేష్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు బి. శాంతి తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావంతో చిత్తడిగా మారిన అరకు వారపు సంత



**డుంబ్రిగుడ, జూలై 19 (ఆంధ్రపత్రిక):**బంగాళాఖాతం అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పలుచోట్ల గేడ్డలు,వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో శుక్రవారం అరకు వారపు సంతకు వర్షం దెబ్బ తగిలింది. సంతకు వచ్చిన కొనుగోలుదారులు బుర్ధకు అడుగు వేసి అడుగు వేయలేని పరిస్థితుల్లో ఇబ్బందులు గురయ్యా రు. వ్యాపరాస్తులు, రైతులు కవర్లు కట్టుకొని అమ్మకాలు చేపట్టారు. క్రయ విక్రయాలు నామమాత్రంగా జరగడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారస్తులు నిరాశ చెందారు.

## తాగునీరు సరఫరాలో తగు శ్రద్ధ వహించాలి

**-అర్.డబ్ల్యూ.ఎస్.ఎస్.ఏఈశ్వేత**

**కె.కోటపాడు, జులై 19 (ఆంధ్రపత్రిక):**వర్షాలు కురుస్తున్నందున ప్రజారోగ్యం పరిరక్షణ దృష్ట్యా తాగునీరు కలుషితం కాకుండా తగుశ్రద్ధ వహించాలని గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య(అర్.డబ్ల్యూ.ఎస్.ఎస్.)శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అల్లు శ్వేత అన్నారు.రక్షిత నీటి సరఫరాపై శుక్రవారం కలెక్టర్ విజయకృష్ణన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సంబంధిత శాఖల మండల అధికారులు పాల్గొన్నారు. అనంతరం అర్.డబ్ల్యూ.ఎస్.ఎస్. ఏఈ మాట్లాడుతూ రక్షితనీటి పథకాల ట్యాంకులనునింపుతున్న ప్రతిసారి క్లోరినేషన్ జరగాలని, వారానికి ఒక్కసారి పరిశుభ్రం చేయాలని, ఇంటింటికి సరఫరా జరుగుతున్న త్రాగునీరు ఎక్కడా లీకేజీలు లేకుండా చూసుకోవాలని, లీకులునట్లయితే నీరు కలుషితం కాకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని చెప్పారు. గ్రామాల్లో బోరు బావుల ప్లాట్ ఫార్మ్, నీటి పథకాల ట్యాంకులు చెంతన, అలాగే పరిసరాల్లో నీరు నిలవలేకుండా చర్యలు చేపట్టాలని మండలంలోని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆమె సూచించారు. అర్.డబ్ల్యూ.ఎస్.ఎస్. ఏఈ శ్వేతతో పాటు సైట్ ఇంజనీర్ గండి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

## ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**డిసిసిబి మాజీ చైర్మన్ వి.వి చిన రాము నాయుడు**



**వేపాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక):**విద్యార్థులు విద్యను ఉత్తమంగా అభ్యసించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని నీలకంఠ రాజపురం డిసిసిబి మాజీ చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన సర్పంచ్ గొటివాడ దేవి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీపీ పాఠశాలలో గల విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కండిపల్లి పెదనాయుడు తదితర పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కానరాని అభివృద్ధి



**ద్వారకాతిరుమల,జూలై 19 (ఆంధ్రపత్రిక):**ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండల పంచాయతీలో లక్షలాది రూపాయలు అవినీతి జరిగింది ఇది అప్పటిలో ఆరోపణగా పరిగణించారు. కానీ అనంతరం ఒక మహిళ ఫిర్యాదు మేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ స్పందించడం వల్ల ఈ అవినీతి జరిగిందని నిర్ధారించడం అయినది. ఇంటి పన్నులు కులాయి పన్నులు రసీదుల్లో గోల్మాల్ జరిగిందని పంచాయతీ సంబంధించిన స్టాఫ్ పాటల విషయంలో చెత్త తీసుకురావడానికి ఉపయోగించే రిక్షాలతో సహా పాట పెట్టారని లక్షల్లో విలువ చేసే స్క్రాప్‌ని కొంతమంది వ్యక్తులకి తక్కువ రేట్‌కి పాట పెట్టారని తెలియజేశారు. దీని విలువ లక్షల్లో కాదు కోట్లల్లో ఉందని నిర్ధారించారు. అవినీతి ఎక్కువైపోవడం వలన పారిశుద్ధ కార్మికులకు నెలనెలా జీతం ఇవ్వలేని పరిస్థితికి పంచాయతీ వచ్చేసింది. పారిశుద్ధ కార్మికులు నెలల జీతం వెయ్యని రోజుల్లో వారు రెండు మూడు రోజులు పనికి రావడం మానేస్తున్నారు దీనివల్ల పరిశుభ్రంగా ఉండాల్సిన గ్రామం ఎక్కడికక్కడ అధిక చెత్త పేరుకుపోయి ఉన్నది. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది పారిశుద్ధ కార్మికులు రెండు మూడు రోజులు రాకపోవడం వల్ల గ్రామంలో చెత్త బాగా పేరుకుపోయి, కుళ్లిపోయి గ్రామ ప్రజలు చిన్నపిల్లలు అనారోగ్య పాలవుతున్నారు. ఈ మధ్య 2 డెంగ్యు జ్వర కేసులు కూడా నమోదు అయ్యాయి. పంచాయతీ ఇలా ఉంటే దేవస్థానం వారు కూడా ఏమి పట్టించుకోరు గత కొన్ని సంవత్సరాల క్రితం పంచాయతీ టోల్గేట్ వసూలు చేసేది పంచాయితీకి దేవస్థానానికి ఒక ఒప్పందంతో దేవస్థానం వారు టోల్గేట్ వసూలు చేస్తున్నారు టోల్గేట్ దేవస్థానం వసూలు చేసుకుని కొంత సొమ్ము గ్రామ అభివృద్ధికి



ఉపయోగించేలా ఒప్పందం అయింది అని వినికిడి కానీ దేవస్థానం వారు గ్రామ అభివృద్ధికి ఏ విధమైన సహకారాలు అందించడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు.



## సాగు నీరు తాగుతున్నాం...

**- తాగునీరు ఇప్పించండి సారు...**



**డుంబ్రిగుడ, జూలై 19 (ఆంధ్రపత్రిక):**కొల్లాపూటు పంచాయితీ పరిధి గల నందివలస గ్రామంలో సురక్షితమైన తాగునీటి లేక సాగు నీటి పైనే అవసరాలు తీర్చుకుంటున్నారు. ఈ విషయంపై గ్రామస్తులకు వివరాలు అడిగి తెలుసుకోగా ఇంటింటి కొలాయి మోటర్ గత ఆరు నెలలుగా మూలకు చేరడంతో గత్యంతరం లేక పొలాల నుంచి వచ్చే సాగునీరుకు పైపు గొట్టాలు అమర్చి కలుషితమైన బురద నీటినే త్రాగుతున్నామని చెప్పారు. ఎన్నోమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించటం లేదని గ్రామ మహిళలు స్థానిక విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. కొండ వాగు నుంచి వచ్చే కలుషితమైన బురద నీరు త్రాగటం వలన అనేక రకమైన వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మా గ్రామంలో తాగునీటి కొరత లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గెస్ట్ టీచర్స్‌ని విధుల్లోకి తీసుకొని కాంట్రాక్ట్ టీచర్స్‌గా నియమించాలి

**సమగ్ర శిక్ష స్టేట్ సెక్రటరీకి కేజీబీవీ గెస్ట్ టీచర్స్ వినతి**

**ఎటపాక, జూలై 19 (ఆంధ్రపత్రిక):**గత 6 సంవత్సరాలుగా గెస్ట్ టీచర్స్‌గా పనిచేసిన తమను విధుల్లోకి తీసుకొని కాంట్రాక్ట్ టీచర్స్‌గా నియమించాలని కోరుతూ సమగ్ర శిక్ష స్టేట్ సెక్రటరీ మధు సూధన్‌కు ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ద్వారా కేజీబీవీ గెస్ట్ టీచర్స్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కసుర్భా గాంధీ బాలికా విద్యాలయాల నందు 2016నుండీ గెస్ట్ టీచర్స్ గాపనిచేస్తున్న తమ ను రెండు దఫాలుగా రంపచోడవరంలో, కాకినాడలో కౌన్సిలింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి డెమో క్లాస్ డిఇఓ సమక్షంలో తీసుకొని మా ప్రతిభను గుర్తించిన అధికారులు గెస్ట్ టీచర్స్‌గా నియామకాలు జరిపారన్నారు. భవిషత్ లో కూడా మిములను కొనసాగిస్తామని హామీ ఇచ్చిపై అధికారుల సమక్షంలో అప్పాయింట్ మెంట్ ఆర్డర్ ఇచ్చినారు అని అప్పటినుండి మేము రెగ్యులర్ సిఆర్‌టి టీచర్స్‌తో సమానంగా నైట్ డ్యూటీ లు, సండే డ్యూటీలు, పండగ డ్యూటీలు, స్టడీ అవర్స్ డ్యూటీలు చేస్తూ మా సబ్జక్ట్ లలో 100శాతం పలితాలు తీసుకొచ్చాము అన్నారు. మాకు అవకాశం కల్పించకుండా అనుభవం లేనివారిని తీసుకొని ఎక్స్పిరియన్స్ వున్న మాకు అన్యాయంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న తమను విధుల్లోకి తీసుకొని సిఆర్టిలుగా నియమించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. దీనికి స్పందించిన అదికారులు ముంపు మండలాల కేవీబీవీలా పనిసేసే మీ డేటా తెప్పుంచి త్వరలో మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతీ పత్రం ఇచ్చిన వారిలో ఎటపాక సిపిఎం మండల కార్యదర్శి ఐ వి,ఎటపాక, కూనవరం, వీఆర్ పురం, వై.రామవరం, గంగవరం కేజీబీవీ గెస్ట్ టీచర్స్ కుమారి, వనజ, చంద్రమ్మ, పద్మశ్రీ, శాంతి లత, రామలక్ష్మి, పద్మ, సీతమ్మ ఉన్నారు.

## టీడీపీలో చేరిన గొండుపాలెం నాయకులు



**కె.కోటపాడు, జులై 19 (ఆంధ్రపత్రిక):**మండలంలోని గొండుపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పలువురు తెలుగు దేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వంటాకు శ్రీను, చోడవరం షుగర్ ఫ్యాక్టరీ పాలకవర్గం మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ వైసీపీని వీడి కార్యకర్తలతో కలిసి టీడీపీలో చేరారు. మండల టీడీపీ అధ్యక్షుడు రొంగలి మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లి టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు సమక్షంలో "దేశం"లో చేరారు. వారిని మాడుగుల ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు, మాడుగుల మాజీఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తదితర నాయకులు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గొండుపాలెం పాలసంస్థ డైరెక్టర్లు బండారు సూర్యనారాయణ, వంటాకు దేముడుబాబు, సాగునీటి సంఘం మాజీ డైరెక్టరు బండారు రామన్నపాత్రుడు, మాజీ ఉప సర్పంచ్ ఆడారి ఈశ్వరరావు, సీనియర్ నాయకుడు మద్దాల ఈశ్వరరావు తదితరులు ఉన్నారని శ్రీను చెప్పారు. ఈ సందర్భంగా శ్రీను, ఉమాశంకర్ మాట్లాడుతూ తమతోపాటు గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు సుమారు వందమంది టీడీపీలో చేరారన్నారు. వంటాకు శ్రీను, దొగ్గ ఉమాశంకర్ టీడీపీలో చేరడంపట్ల గొండుపాలెం టీడీపీఅధ్యక్షుడు ఈర్లిదేముడుబాబు (నాయుడు), చౌడువాడ, ఎ.కోడూరు సర్పంచ్‌లు దాడి ఎరుకునాయుడు, బొడ్డు అక్కునాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## వరి సాగులో వీఏఏల సూచనలు పాటించాలి

**-వ్యవసాయ అధికారి సోమశేఖర్**



**కె.కోటపాడు, జులై 19 (ఆంధ్రపత్రిక):**వరి నారుమడుల నిర్వహణకు గ్రామంలోని వ్యవసాయ సహాయకుల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని మండలం వ్యవసాయ శాఖ అధికారి ఎం.వి.సోమశేఖర్ తెలిపారు. మండలంలో 5,000 ఎకరాలకు సరిపడా వరినారును రైతులు వేసుకున్నారని చెప్పారు. ప్రస్తుతం నారుమడులు ఆరోగ్యకరంగానే ఉన్నాయన్నారు. ఎక్కడైనా నారు మడులలో కలుపుమొక్కల సమస్య ఉంటే వెంటనే సంబంధిత రైతు సేవ కేంద్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించిన తరవాత మాత్రమే కలుపు మందులను వాడాలని ఏఓ తెలిపారు. అవసరం మేరకు నారుమడులలోడి.ఎ.పి.వాడకుండా కేవలం సూపర్ ఫాస్ఫేట్ మాత్రమే వాడాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.వి.సోమశేఖర్ తెలిపారు. ఏఓ ఆదేశాల మేరకు గుల్లేపల్లి, ఆర్.వై.అగ్రహారం, కె.కోటపాడు, మేడిచర్ల తదితర గ్రామాల్లో వరి నారుమడులను ఏఈఓ లైలాదేవి, వి.ఎ.ఎ.లు కల్యాణి, హరీష్, వరహాలుదొర తదితరులు పరిశీలించారు. రైతులకు సూచనలు ఇచ్చారు.

## పుట్టిన రోజున పది మొక్కలు నాటుదాం

**- డ్రగ్స్ ఇన్స్పెక్టర్ డాక్టర్ మిథున్ కుమార్**



**వేపాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక):**ప్రతి మనిషి తన పుట్టినరోజు నాడు పది మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడానికి తమవంతుగా పాటుపడాలని డ్రగ్స్ ఇన్స్పెక్టర్ డాక్టర్ మిథున్ కుమార్ అన్నారు. గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వశి గ్రామంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం చుట్టూ శుక్రవారం యాబై కొబ్బరి మొక్కలు నాటారు. బొబ్బిలి యశశ్రీ, చిర్ల మాధవీ సుమ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డ్రగ్స్ ఇనస్పెక్టర్ డాక్టర్ మిథున్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విరివిగా చెట్లు పెంచాలన్నారు. ప్రతీ ఒక్కరం పుట్టిన రోజున పది మొక్కలు నాటుదాం, సంరక్షిద్దామని జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒబ్బిన పార్వతి, బంగారు నాయుడు, చిర్ల శ్రీనివాస రెడ్డి,ఎర్ర చంద్ర రావు, చుక్క శ్రీను,ఎమ్.ఎర్రి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు



**వేపాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక):** మండలం కేంద్రం వేపాడలోగల స్థానిక వెలుగు కార్యాలయంలో డిఎల్ఎంపి స్వామి నాయుడు, ఎన్.ఎఫ్.ఏ మెర్సి, అనిత ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులకు చెప్పవలసిన సార్వత్రిక సూత్రాలు, మోడల్స్ గురించి,పంట యాజమాన్య పద్ధతులు, కషాయాలు తయారీ విధానం, పంట కోత ప్రయోగాల గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు అందించాల్సిన సేవలు గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## అమ్మో.. కుక్కలు బాబోయ్ కుక్కలు

**వీధి కుక్కల వీరంగం**

**ఇళ్లల్లోకి చొరబడి భయ బ్రాంతులకు గురి చేస్తున్న వైనం**

**కుక్క కాట్లకు గురవుతున్న జనం**

**పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు**

**వేపాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక):**అమ్మో కుక్కలు బాబోయ్ కుక్కలు అంటూ గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపిల్లలను ఒంటరిగా బయటికి పంపించాలంటే కుక్కల దాడిలో ఎక్కడ మృతి చెందుతారన్న భయంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కంచే చేను మేస్తున్న చందంగా వీధి కుక్కలు తయారయ్యాయి. గ్రామాల్లోని ఏ వీధిలో చూసినా, ఏ కోళ్ల ఫారం దగ్గర చూసినా గుంపులు, గుంపులుగా వీధికుక్కలు దర్శణమిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. కుక్కలను పెంపుడు జంతువులుగా పెంచుకోవచ్చన్నది ప్రభుత్వం, కోర్టులు చెబుతున్న మాటలు. కానీ అవి కరిస్తే వాటిని చంపే హక్కు మనకు లేదు. పశు పక్ష్యాదులను, గొర్రెలు మేకలు కోళ్లను చంపుకొని తినేయవచ్చు. ఇంకా ఒక అడుగు ముందుకు వేసి అడవుల్లో పలు రకాల జంతువులను వేటాడి ఆ మాంసంను తినేస్తున్న రోజులివి. కానీ మనుషులను జంతు వులను, చిన్నారులను విచక్షణా రహితంగా కుక్కలు కాటేయ వచ్చు. కానీ వాటిని చంపే హక్కు మనకు లేదు. ఇదేమి చోద్యమో తెలీదు గాని మండలంలోని అన్ని గ్రామాల్లో కుక్కల బెడద బాగా ఎక్కువయింది. రోడ్ల పైన, ఇళ్ళల వద్ద, వీధుల్లోనూ, కోళ్ల ఫారాల వద్ద కాపు కాసి మరీ అందర్నీ కరుస్తూ ప్రాణాపాయాన్ని కలిగిస్తు న్నాయి. సింహాచలం దేవస్థానం గోశాల నుంచి అక్రమంగా పశువులను తరలించి, పశువుల పెంపకం కోసం అని మధ్య పెట్టి మాంస భక్షణకు ఉపయోగిస్తున్న నేపథ్యంలో కుక్కలను చంపకూడదు అని చెప్పక చెప్పడం విచారకరం. మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు మండల పరిసర గ్రామాలు, ఆస్పత్రుల్లో నమోదైన కుక్కల కాట్లకు గురైన వారి సంగతి వర్ణనాతీతమని చెప్పక తప్పదు.



## ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న జల్లులు

**వరి నారుకు ఊపిరి పోసిన వరుణుడు.**

**పొలం పనుల్లో బిజీ బిజీగా రైతన్నలు.**

**స్కూళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు.**



**వేపాడ, జూలై 19 (ఆంధ్రపత్రిక):**తుఫాన్ ప్రభావంతో మండలంలో రెండు రోజులుగా జల్లులు పడుతుండడంతో రైతులు పొలం పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. వరుణుడు కరుణించడంతో మెట్ట ప్రాంతాల్లో సాగునీరు అందక వరి నారు ఎండిపోతున్న తరుణంలో గురు, శుక్రవారాల్లో పడిన జల్లులకు వరి నారు ఊపిరి పోసుకొని పచ్చదనంతో కళకళలాడుతోంది. గురువారం ఉదయం నుంచి పడుతున్న జల్లులకు వాతావరణం చల్లబడడమే కాకుండా నేల తల్లి వరి నారుకు ఊపిరి పోసింది. అలాగే శుక్రవారం తెల్లవారు జామున 2గంటలు నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులతో పాటుగా పొలాల్లో కూడా వర్షపు నీరు చేరడంతో ప్రకృతి ఒక్కసారిగా పులకరించినట్లయింది. దాంతో కొన్ని గ్రామాల్లోని పొలాల్లో ఇప్పటికే కొద్దో గొప్పో దమ్ములు పట్టి వరి నాట్లు కూడా వేస్తున్నారు. అలాగే ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు స్కూళ్ళకు సెలవులు ఇవ్వాల్సి వుండగా ఎందు చేతనో సెలవులు ఇవ్వక పోవడంతో విద్యార్థులు తప్పనిసరి పరిస్థితిలో భుజాలకు బ్యాగులను తగిలించుకొని గొడుగులను చేతపట్టుకొని బడులకు వెళ్ళాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా ప్రక్కనున్న విశాఖ అనకాపల్లి జిల్లాల్లో వర్షం కారణంగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో అధికారులు చొరవ తీసుకుని విద్యార్థులకు సెలవులు ప్రకటించగా విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారులు మాత్రం స్కూళ్లకు సెలవులు ప్రకటించక పోవడం ఎంతవరకు సబబని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



# ఇంద్రకీలాద్రిపై శాకాంభరీ ఉత్సవాలు





- మూడురోజులపాటు జరగనున్న ఉత్సవాలు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ఆకుకూరలు, కాయగూరలను సమర్పించిన భక్తులు







**విజయవాడ(ఇంద్రకీలాద్రి). జూలై 19 (ఆంధ్రపత్రిక):** శాకంభరీ దేవి ఉత్సవముల మొదటి రోజు (నిన్న శుక్రవారం) సందర్భంగా అమ్మవారి, స్వామి వారి దర్శనార్థం విశేషముగా విచ్చేసిన భక్తుల రద్దీ, మరియు ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి పవిత్ర సారె సమర్పించుటకు విచ్చేసిన భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ ఈవో కెఎస్ రామరావు పర్యక్షించారు. ఉదయం నుండి అమ్మవారికి సారె సమర్పించుటకు విచ్చేస్తున్న పలు బృందాల వారు ఆలయానికి చేరుకున్నారు. నిత్య ఆర్జిత సేవలైన శ్రీ స్వామి వారి అభిషేకం, శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం, శాంతికళ్యాణం మరియు ఇతర సేవల యందు విశేషముగా పాల్గొని, శ్రీ అమ్మవారిని స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. రద్దీ దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం పలు ఏర్పాట్లను ఆలయ ఈవో ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



ఆంధ్రపత్రిక ఫోటోలు: సి.హెచ్.విజయభాస్కర్













## నెల్లూరు రొట్టెల పండగకు 5 కోట్లు విడుదల

- సిఎం చంద్రబాబు వెల్లడి

**నెల్లూరు, జూలై 19 (ఆంధ్రపత్రిక):** జిల్లాలోని బారాషహీద్ దర్గాలో మూడోరోజు రొట్టెల పండగ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అక్కడికి వచ్చిన భక్తులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రొట్టెల పండగకు ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వేడుకల నిర్వహణకు రూ.5 కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల్లో విశ్వాసాన్ని నింపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చంద్రబాబు తెలిపారు.

## వైసిపి హయాంలో చేపట్టిన పనుల్లో డొల్ల



- మంజూరైన నిధులకు, పనులకు కానరాని పొంతన
- ఇచ్ఛాపురం పర్యటనలో అధికారులతో మంత్రి రామ్మోహన్ సమీక్ష

**శ్రీకాకుళం, జూలై 19 (ఆంధ్రపత్రిక):** వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన చాలా పనుల్లో డొల్లతనం సమీక్షల్లో బయటపడుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇరిగేషన్, రూరల్ వాటర్ స్కీమ్, పంచాయతీరాజ్, పథకాల్లో గతంలో మంజూరైన నిధులు పనులకు పొంతన లేదని చెప్పారు. ఉద్దానం వాటర్ ప్రాజెక్ట్‌పై మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి హడావిడి చేశారని అన్నారు. 400 గ్రామాలకు మంచి నీరు అందితుందని.. ఇంకా 700 గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని తెలిపారు. జిల్లా దశ దిశను మార్చే నదుల అనుసంధానంపై ప్రత్యేక కార్యాచరణలో ముందుకు వెళ్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఇచ్ఛాపురంలో శుక్రవారం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి తెలుగుదేశం కంచుకోట ఇచ్ఛాపురం నియోజకవర్గ పర్యటనకు వచ్చారు. సాదరంగా ఆహ్వానం పలికిన కార్యకర్తలు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ స్వేచ్ఛవతి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్న అనంతరం ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ, మండలంలోని ప్రధాన సమస్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం వచ్చే విధంగా మేము చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కూడా కలిసి సమస్యలను పరిష్కరిస్తాం అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు భరోసా ఇచ్చారు.

శుక్రవారం విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్....





గత నాలుగు రోజులు నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇబ్బంది పడుతూ ఉద్యోగాలకూ, పనులకు వెలుతున్న వాహనదారులు



## జగన్‌కు తగిన భద్రత కల్పించాం

- వాహనాలను కూడా అందించాం
- విమర్శలకు ప్రభుత్వ వివరణ

**అమరావతి, జూలై19 (ఆంధ్రపత్రిక):** కండిషన్‌లో లేని వాహనాలు ఇచ్చారని, భద్రత తగ్గించారని మాజీ సీఎం జగన్, ఆయన పార్టీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తప్పుబట్టింది. జగన్‌కు ప్రస్తుతం జడ్‌ప్లస్ సెక్యూరిటీకి ఇచ్చే భద్రత ఉందని పోలీసుశాఖ నిర్ధారించింది. వాహనం ఫిట్‌నెస్‌పై వైకాపా చేస్తున్న ఆరోపణలను ప్రభుత్వం తోసిపుచ్చింది. జగన్‌కు కేటాయించిన వాహనం పూర్తి ఫిట్‌నెస్‌తో ఉందని కండిషన్ చూసిన తర్వాతే వీఐపీకి కేటాయించామని అధికారులు స్పష్టం చేశారు. సౌకర్యంగా లేదని జగన్ కారు దిగి.. వాహనం ఫిట్‌గా లేదని ప్రచారం చేయడం తగదంటున్నారు. జగన్ కారు దిగిన తర్వాత అదే కాన్వాయ్‌లో ఆ వాహనం వెళ్లిందని ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. ర్యాలీలు, సభలకు అనుమతి లేదని, జగన్ వెళ్లే పరామర్శ కార్యక్రమానికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని ఓ ప్రకటనలో తెలిపారు.

GOVERNMENT OF ANDHRA PRADESH



## ప్రజల విన్నపాలపై ప్రతి వారం సమీక్ష





- శాఖల వారీగా విభజించి సమస్యల పరిష్కారానికి కృషి
- అధికారులు, సిబ్బందిని ఆదేశించిన మంత్రి నారా లోకేష్
- జోరువానలోనూ 19వ రోజు "ప్రజాదర్బార్"కు విన్నపాల వెల్లువ





**అమరావతి, జూలై 19 (ఆంధ్రపత్రిక):** సమస్యల పరిష్కార వేదిక "ప్రజాదర్బార్"కు వస్తున్న విన్నపాలపై వారం వారం సమీక్షించనున్నట్లు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉండవల్లి నివాసంలో నిర్వహిస్తున్న "ప్రజాదర్బార్" కార్యక్రమానికి మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. తాము పడుతున్న కష్టాలు, సమస్యలపై యువనేతను నేరుగా కలిసి అర్జీలు ఇస్తున్నారు. ఆయా విన్నపాలను శాఖల వారీగా విభజించి సమస్యల పరిష్కారానికి కృషిచేయడం జరుగుతోంది. ప్రజల అర్జీలు ఎంతమేరకు పరిష్కారం అయ్యాయి, వాటి స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆయా విన్నపాలపై ప్రతివారం సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు యువనేత వెల్లడించారు. జోరువానలోనూ 19వ రోజు నారా లోకేష్ "ప్రజాదర్బార్"కు వినతులు వెల్లువెత్తాయి.

**పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి:**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న 27వేల మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కార్మికులను టెండర్లతో పనిలేకుండా మస్టర్ రోల్ ద్వారా కొనసాగించాలనే హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని కోరారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు.

**అంగన్ వాడీ పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించండి:**

అద్దెభవనంలో ఉన్న తాడేపల్లి కృష్ణనగర్ అంగన్ వాడీ పాఠశాలకు స్థలం కేటాయించడంతో పాటు శాశ్వత భవనం నిర్మించాలని డి.లీల నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పక్షవాతంతో మంచానికే పరిమితమైన తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని నవులూరుకు చెందిన బేతపూడి కోటేశ్వరరావు కోరారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh,
and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com